

నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



మతమా.. ప్రజాస్వామ్యమా?
బంగ్లాదేశ్‌లో ఇంకా రాజకీయ అనిశ్చితి

పత్రికలు నిష్పక్షపాతంగా ఉండాలి

జూనియర్లకు మంత్రి పదవా?

లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 47 | బుధవారం | 6-08-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## రెండేళ్ళు బయట చదువుకున్న విద్యార్థి తెలంగాణ స్థానికత కోల్పోతాడా?

ప్రశ్నించిన సిజెఐ జస్టిస్ గవాయ్
స్థానికతపై సుప్రీంతీర్పు వాయిదా



**న్యూఢిల్లీ:** కొంతకాలం బయట ప్రాంతాల్లో శిక్షణ పొంది వచ్చి వైద్యవిద్యకోసం స్వరాష్ట్ర కళాశాలల్లో ప్రవేశ దరఖాస్తులు చేసుకునే తెలంగాణ విద్యార్థులకు ఎదురవుతున్న స్థానికత సమస్యపై కేసు విచారణలో సుప్రీంకోర్టు వాదనలు వినడం పూర్తిచేసింది. ఈ కేసుపై తీర్పును వెంటనే ప్రకటించకుండా తనవద్దనే ఉంచుకుంది. ఈ తీర్పును మరో తేదీన తర్వాత ప్రకటిస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్,జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం, విద్యార్థులు చేసిన వాదనలను క్షుణ్ణంగా ఆలకించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. తెలంగాణలో పుట్టిపెరిగిన విద్యార్థులు తండ్రి ఉద్యోగ బదిలీలవల్లనో లేక మంచి చదువులకోసం శిక్షణ పొందడానికో కొన్నేళ్ళు రాష్ట్రంలో లేకుండా తర్వాత తిరిగి వచ్చి స్థానిక కళాశాలల్లో ప్రవేశాలను కోరినప్పుడు తమ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని తరువాయి 2లో

# జలప్రళయం

## కొట్టుకుపోయిన ధారాలీ గ్రామం



- ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సం
- మేఘాల విస్ఫోటనంతో కుంభవృష్టి
- నలుగురి మృతి... 50 మందికి పైగా గల్లంతు
- ఇతర ప్రాంతాలతో తెగిన రవాణా సంబంధాలు

**ఉత్తరకాశి:** ఉత్తరాఖండ్‌లో జలప్రళయం ఏర్పడింది. ఉత్తరకాశీలో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. మంగళవారం తెల్లవారుజామున సంభవించిన వినాశకరమైన మేఘాల విస్ఫోటనం వల్ల తీవ్ర విధ్వంసం సంభవించింది. అత్యంత సుందరమైన ధారాలీ గ్రామంపై జలప్రవాహం విరుచుకుపడింది. దీంతో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందగా, 50 మందికి పైగా గల్లంతయినట్లు ప్రాథమిక సమాచారం. కుంభవృష్టి కారణంగా ఎగువ ప్రాంతమైన ఖీర్‌గఢ్ నుంచి మెరుపు వరదలు సంభవించాయి. ఈ సంఘటన మొత్తం ధారాలి బజార్ ప్రాంతాన్ని ప్రభావితం చేసింది. ఇది గంగోత్రి ధామ్‌కు వెళ్లే మార్గంలో కీలక ప్రదేశం. ప్రాథమిక సమాచారం ప్రకారం, ధర్లి గ్రామంపై మేఘాల విస్ఫోటనం సంభవించింది. దీని ఫలితంగా ఖీర్ గంగానది నుంచి అకస్మాత్తుగా భారీ వరదలు వచ్చాయి. వరదల కారణంగా నది ఒడ్డున ఉన్న వందలాది ఇళ్లు కొట్టుకుపోయాయి. ఈ దృశ్యాలు అగ్గిపుల్లలు కొట్టుకుపోయినట్లుగా కనిపించాయి. ఈ ప్రాంతంలోని అనేక హోటళ్లు, హోమ్ స్టేలు దెబ్బ



తిన్నాయి. చాలామంది కార్మికులు, నివాసితులు ఇప్పటికీ శిథిలాల కింద చిక్కుకున్నారని అధికారులు భయపడుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఎస్‌డీఆర్‌ఎఫ్ బందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భారత సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఐటిబిపి బృందాలు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టి సమీప గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. శిథిలాల కింద దాదాపు 10 నుంచి 12 మంది జలసమాధి అయి ఉండవచ్చని గ్రామస్తుడు రాజేశ్ పన్వర్ పిటిఐకి తెలిపారు. 2025 హోటళ్లు, హోమ్‌స్టేలు కొట్టుకుపోయి ఉండవచ్చని ఆయన అన్నారు. అంతేకాకుండా బార్కోట్ తహసీల్‌లోని బనాలా పట్టి ప్రాంతంలో పొంగిపొర్లుతున్న కుడ్ గధేరా వాగులో దాదాపు 18 మేకలు కొట్టుకుపోయాయి. పెరుగుతున్న వరద నీటి నుంచి తప్పించుకోవడానికి నివాసితులు సురక్షిత ప్రాంతాలకు పరుగెత్తడంతో గ్రామాలలో భయాందోళనలు నెలకొన్నాయి. మరోవైపు గంగోత్రికి వెళ్లే మార్గం భారీ వరదల కారణంగా కొట్టుపోయింది. దీంతో ఆ ప్రాంతంతో రవాణా సంబంధాలు తెగిపోయాయి. అదీకాక పర్వత ప్రాంతాలపై కురిసిన భారీ వర్షం వరదగా మారి జనావాసాలను ముంచెత్తాయి. దీంతో అనేక ఇళ్లు ఆ ప్రవాహ ధాటికి కొట్టుకుపోగా... భారీ వృక్షాలు సైతం నేలకూలాయి. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రహదారులు కొట్టుకుపోవడం వల్ల ఛార్‌ధామ్ యాత్రలో భాగమైన గంగోత్రితో తరువాయి 2లో

42శాతం బిసి కోటా బిల్లు ఆమోదానికి

# జంతర్‌మంతర్ వద్ద నేడు ధర్నా

మూడురోజులపాటు జాతీయస్థాయిలో
కార్యాచరణ చేపట్టాలని టిపిసిసి నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బిసి) కు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. తెలంగాణలో బిసిలకు 42 రిజర్వేషన్ల అమలు కోసం ఢిల్లీలో ఈ నెల 5, 6, 7 తేదీలలో మూడు రోజుల పాటు జాతీయ స్థాయిలో అవసరమైన కార్యాచరణ చేపట్టాలని టిపిసిసి నిర్ణయించింది. దీనిలో భాగంగా మంగళవారం పార్లమెంట్‌లో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. బుధవారం జంతర్‌మంతర్ దగ్గర నిర్వహించే ధర్నా కార్యక్రమంలో తరువాయి 2లో

తక్షణమే తెలంగాణ వాటా

# యూరియా ఇవ్వండి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి
- కేంద్రమంత్రి జెపి నడ్డాకు మరో లేఖ
- యూరియా సరఫరాలో జాప్యం వల్ల పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

ఖరీఫ్ పంటలు పూర్తిగా ఊపందుకోవడంతో ఈ నెలలో యూరియా వినియోగం అత్యధికంగా ఉండనున్ననేపథ్యంలో రాష్ట్రానికి కేటాయించిన యూరియాను తక్షణమే సరఫరా చేయాలి కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్ర మంత్రి జెపినడ్డాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరో లేఖ రాశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తినా పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల తరువాయి 2లో



జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్

## సత్యపాల్ మాలిక్ కన్నుమూత

- రైతులు, పుల్వామా ఉగ్రదాడి అంశాలపై కేంద్ర సర్కార్‌ను నిలదీసిన మాలిక్

**న్యూఢిల్లీ :** దీర్ఘకాల అనారోగ్యంతో ఉన్న జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మంగళవారం ఇక్కడి రామ్‌మనోహర్ లోహియా (ఆర్‌ఎంఎల్) హాస్పిటల్‌లో కన్నుమూశారు. ఆయన వ్యక్తిగత సిబ్బంది వెల్లడించిన ప్రకారం ఆయన వయస్సు 79 సంవత్సరాలు. సత్యపాల్ మాలిక్ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక పదవులు నిర్వర్తించారు. లోక్‌సభ, తరువాయి 12లో

కాళేశ్వరం ప్రాజెక్టుపై

# బేస్‌లెస్ రిపోర్ట్

- కెసిఆర్‌ను హింసించాలన్నదే సిఎం ఉద్దేశం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణ

**కాళేశ్వరం నివేదిక గ్యాస్, ట్రాష్ : కెటిఆర్**

ప్రజాపక్షం /హైదరాబాద్

కాళేశ్వరంపై కమిషన్ ఇచ్చింది బేస్‌లెస్ (నిరాధార) రిపోర్ట్ అని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి వరుస సీరియళ్లు నడుపుతున్నారని, కెసిఆర్‌ను హింసించాలన్నదే రేవంత్ ఉద్దేశమని ఆరోపించారు. కుట్ర పూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్లు కనిపిస్తోందని,అసెంబ్లీలో 665 పేజీల రిపోర్ట్ పెడితే ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని తరువాయి 2లో

సీనియర్ జస్టిస్ ఘోష్‌నే

# అవమానిస్తారా?

- నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పండి
- కెసిఆర్, హరీశ్‌రావులను భయం వెంటాడుతోంది
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాస్వామ్య వ్యవస్థలపై బిఆర్ఎస్ కు చులకనభావం అని, చట్టసభలు, న్యాయస్థానాలంటే కూడా గౌరవం లేదని, న్యాయ వ్యవస్థ మీద నమ్మకం లేదని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో నియమించిన జ్యుడిషియల్ కమిషన్ అంటే కూడా లెక్కలేదన్నారు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదని, తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పుకోవాలనే సోయి కూడా లేకపోయిందని తరువాయి 2లో




13న భారత్ – ఇంగ్లాండ్

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

# కాపీలు దహనం

- ట్రాక్టర్, సైకిల్ మోటార్ ర్యాలీలు నిర్వహిస్తాం
- ట్రంప్, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తాం
- ట్రంప్ బెదిరింపులకు వ్యతిరేకంగా దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించాలని, కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని పెద్ద ఎత్తున నిరసనలు
- సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర నేతల ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

భారతదేశంపై 25 శాతం సుంకాలను విధించడం, రష్యాతో చమురు వాణిజ్య ఒప్పందానికి శిక్షాత్మక పన్నును విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులకు వ్యతిరేకంగా దేశ సార్వభౌధికారాన్ని రక్షించాలని, కార్పొరేట్ దోపిడీని అరికట్టడానికి ఈ నెల 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. నిరసనలో భాగంగా అమెరికా అధ్యక్షులు ట్రంప్, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలు, భారత్–ఇంగ్లండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కాపీల దహనం చేస్తామని, అనంతరం ట్రాక్టర్, సైకిల్ మోటర్ ర్యాలీలు నిర్వహిస్తామని ఎస్‌కెఎం ప్రకటించింది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా తరువాయి 2లో

కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా

# ప్రజలకు సంక్షేమ పథకాలు

మహబూబ్ నగర్ జిల్లా మహాసభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/ మహబూబ్ నగర్




కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే నేడు ప్రజలకు అంతో ఇంతో సంక్షేమ పథకాలు అందుతున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకట్ రెడ్డి అన్నారు. జడ్చర్లలో మంగళవారం నాడు సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా 23 వ మహాసభ జరిగాయి. పట్టణంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభతో మహాసభ ప్రారంభమయ్యాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనర్సింహా ప్రసంగించారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాగా ఉన్న మహబూబ్ నగర్ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం గత దశాబ్దాలుగా సిపిఐ అలుపెరగని పోరాటాలు చేసిందని చాడ అన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమం నుంచి మొదలుకొని దేశాన్ని పునర్నిర్మించే అనేక దశల్లో సిపిఐ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు 100 రోజుల పనిగా పిలుచుకున్నటు వంటి ఉపాధి హామీ చట్టాన్ని, అటవీ హక్కుల చట్టం, ఆహార భద్రత చట్టం వంటివి వచ్చాయని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని చాడ వెంకట్ రెడ్డి తరువాయి 2లో



## అమెరికాతో ఒప్పందం నుండి వైదొలగిన రష్యా

**మాస్కో:** అమెరికా–సోవియట్ యూనియన్ మధ్య 38 సంవత్సరాలక్రితం కుదిరిన భూతలం నుండి ప్రయోగించే మధ్యంతర–స్వల్ప శ్రేణి ఖండాంతర అణ్వస్త్రశక్తుల (ఐ ఎన్ ఎఫ్) క్షిపణి నియంత్రణ ఒప్పందం నుండి రష్యా వైదొలగింది. ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి 12 రోజులు రష్యాకు గడువు విధించడమే కాకుండా, అంతర్జాతీయ జలాలలో రష్యాకు సమీపంలో అణు జలాంతర్గాములను మోహరించాలని మూడు రోజులక్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆదేశాలకు ప్రతిగా రష్యా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యంతర శ్రేణి, తరువాయి 12లో

# ఆర్డర్లీ వ్యవస్థ పునరుజ్జీవం?

- రిటైర్డ్ ఐపిఎస్ అధికారుల ఇండ్లలో 200 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డ్‌లు
- ఈ చర్య కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని పలువురి అభిప్రాయం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పోలీసు శాఖలో 'ఆర్డర్లీ వ్యవస్థ' పునరుజ్జీవనమైనట్లు కనబడుతుంది. హైదరాబాద్‌లో ఉన్న సుమారు 30 మందికి పైగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారుల ఇళ్లలో సుమారు 200 మందికి పైగా కానిస్టేబుల్స్, హోంగార్డులు ఆర్డర్లీ వ్యవస్థలో పనిచేస్తున్నారని తెలిసింది. ఈ విధంగా



పోలీసు అధికారుల ఇళ్లల్లో కానిస్టేబుల్స్ పనిచేయడం కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని పోలీసు శాఖలు చర్చ జరుగుతున్నది. గతంలో "అక్టోపస్ అదనపు డిజి వివేక్ దూబే నోయిడాలోని తన కూతురి ఇంట్లో అర్డర్లీ కింద పనిచేసేందుకు స్పెషల్ అర్మడ్ రిజర్వ్ పోలీసు తరువాయి 12లో

గాజా దాడుల్లో

# గంటకో బిడ్డ మృత్యువాత

యూనిసెఫ్ ప్రకటన



**గాజా:** గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించినప్పటినుండీ గడచిన 22 నెలల్లో కాల్పులు, బాంబుదాడులు, ఆకలిబాధలకు, పోషకాహార లోపం కారణంగా సగటున ప్రతిరోజూ 28 మంది పిల్లలు మరణిస్తున్నారని 'ఎక్స్' వేదికగా మంగళవారంనాడు యూనిసెఫ్ ప్రకటించింది. ఈ విధగా ఇప్పటివరకూ 18,000 మంది పిల్లలు మరణించారు. ఇప్పుడు తాజాగా తొక్కిసలాటల్లో, ఆకలి బాధల కారణంగా ఎక్కువమంది పిల్లలు మరణిస్తున్నారు. గాజాలో లక్షమంది పిల్లలు, మహిళలకు తక్షణం పోషకాహారం లేకపోతే వారి మరణాలు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## నాటో ద్వారా ఉక్రేన్‌కు ఆయుధ సరఫరా ప్రారంభం

బ్రస్సెల్స్: నాటో ద్వారా ఉక్రేన్‌కు ఆయుధ సరఫరా ప్రారంభమైంది. డోనాల్డ్ ట్రంప్ గతనెలలోనే ఈ విషయం ప్రకటించారు. దీనికి అనుగుణంగా నాటో ద్వారా ఉక్రేన్‌కు అనేక రకాల ఆయుధాలు సరఫరా అవుతాయి. వీటిల్లో అమెరికా నుండి వెళ్ళే ఆయుధాలే చాలా ఎక్కువగా ఉంటాయి. ఉక్రేన్‌కు ఆయుధాల సరఫరా అవసరాన్ని ప్రకటించిన ట్రంప్ రష్యా పుతిన్ లొంగి రాకపోవడంతో ఆయుధ సరఫరా పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. ఐతే యూరప్ దేశాల్ ఈ ఆయుధాలకు డబ్బులు చెల్లిస్తాయని కూడా ఆయన చెప్పారు. అమెరికా నుండి కొనుగోలు చేసిన 500 మిలియన్ యూరోలు (578 మిలియన్ డాలర్లు) విలువైన ఆయుధాలను సరఫరా చేస్తామని నెదర్లాండ్స్ ప్రకటించింది. ఉక్రేన్ గగనతల రక్షణ పరికరాలు, ఆయుధ సామాగ్రి, ఇతర సైనిక సహాయ పరికరాలను నెదర్లాండ్స్ తన డబ్బుతో కొనుగోలు చేసి ఉక్రేన్‌కు పంపుతుంది. ఈ నెలలోనే ఈ ఆయుధాలన్నీ ఉక్రేన్‌కు చేరుకుంటాయి. ఉక్రేన్‌కు ఆయుధాలు పుష్కలంగా లభిస్తే ఇకమీదట ఈ రెండు దేశాల్లోని కొత్త ప్రాంతాలలో కూడా యుద్ధం ఉధృతం అవుతుంది.

## అమెరికా చూడాలంటే 15వేల డాలర్ల బాండు చెల్లించాల్సిందే



న్యూయార్క్: అమెరికా చూడాలంటే, ఆ దేశంలోకి ప్రవేశించాలంటే వ్యాపార ప్రయోజనాలనిమిత్తం వెళ్ళాలనుకుంటే ఇకమీదట ఎవ్వరైనా 15,000 డాలర్లు బాండు చెల్లించాల్సిందే. ప్రయోగప్రాతిపదికపై అమెరికా విదేశాంగమంత్రిత్వశాఖ ఈ విధానాన్ని ప్రవేశపెట్టబోతోంది. ఫెడరల్ రిజిస్టర్ వెబ్‌సైటులో ఈ బాండు నోటీసును మంగళవారం నాడు పోస్టు చేశారు. ఈ నోటీసు వెలువడిన 15 రోజుల తర్వాత నుండీ ఈ నిబంధనలు అమలులోకి వస్తాయి. అంటే ఆగస్టు 21వ తేదీ నుండీ వచ్చే ఏడాది ఆగస్టు 26వ తేదీ వరకూ ఈ కొత్త నిబంధనలు అమలులో ఉంటాయి. అమెరి కా సందర్శించాలనుకునే వారి ప్రయోజనాల ఆధారంగా ఈ బాండ్ రేట్లు నిర్దేశిస్తారు. కొన్ని రకాల వ్యాపారాలకు, టూరిస్టుల అవసరాల నిమిత్తం 5వేలు, 10వేలు, 15 వేలు డాలర్ల వంతున పైలట్ ప్రోగ్రాం కింద బాండ్లను కాన్సుల ర్ ఆఫీసర్లకు సమర్పించాలి. బాండ్లను బట్టి వారికి అనుమతులు లభిస్తాయి. ఐతే పర్యాటకుల ఎంపికల విషయంలో లోపభూయిష్టమైన విధానాలు అనుసరించే దేశాలు, వీసా గడువు ముగిసిన సందర్భాలు, సమాచారలోపం ఉండే పరిస్థితుల్లో వచ్చే వారికి ఈ నిబంధనలు చాలా ఎక్కువగా వర్తింపజేసే అవకాశాలు ఉన్నాయి. అమెరికా విదేశాంగశాఖ ద్వారా ఈ విధమైన దేశాలను గుర్తిస్తారు. ఐతే వెబ్‌సైటులో ఇలాంటి ప్రభావిత దేశా ల జాబితాను మాత్రం ఇంకా ప్రకటించలేదు. వీసాకు సంబంధించిన నిబంధనలను ట్రంప్ ప్రభుత్వం గతవారం నుండి మరింత కఠినతరం చేసింది. ఇందులో భాగంగానే ఈ ప్రకటన వచ్చింది.

## బోల్సెనారో హౌస్ అరెస్ట్
### బ్రెజిల్ ప్రజాస్వామ్యం ఖూనీ: అమెరికా ఖండన



బ్రెసిలియా: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారోను గృహనిర్బంధం చేయాలని ఆ దేశ సుప్రీంకోర్టు మంగళవారంనాడు ఆదేశించింది. అమెరికా విదేశీ వ్యవహారాల యంత్రాంగం ఈ తీర్పును తీవ్రంగా ఖండించింది. బోల్సెనారో గొంతు నొక్కకుండా ఆయన నోరు తెరచి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసింది. బోల్సెనారో అధికారంలో ఉన్నప్పటినుండీ ట్రంప్‌కు మంచి మిత్రుడుగా ఉన్నారు. బ్రసిలియాలోని ఆయన నివాసంలోనే నిర్బంధించాలని, కేవలం న్యాయవాదులను, ఆయన సన్నిహిత బంధువులను మాత్రమే ఆ ఇంట్లోకి అనుమతించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. 2022లో ఎన్నికల్లో ఓటమి తీర్పు ను తారుమారు చేసేందుకు ఆయన కుట్ర చేశారని కోర్టు పేర్కొంది. జస్టిస్ అలెగ్జాండీ డీ మారియోస్ ఈ తీర్పు ఇచ్చారు. బోల్సెనారో అనుచరులు, కార్యకర్తలు బ్రెజిల్‌వ్యాప్తంగా ఆదివారంనాడు అనేక నగరాలు, పట్టణాలలో భారీఎత్తున ప్రదర్శనలు జరిపారు. న్యాయస్థానంపై దాడికి వారు యత్నించారని అందుకు భారీ ప్రోత్సాహం ఉందన్న విషయం సోషల్ మీడియా ద్వారా స్పష్టంగా తేటతెల్లమైందని ఈ విషయంలో విదేశీ జోక్యం ఉందనడంలో ఎలాం టి సందేహం లేదని న్యాయమూర్తి మారియోస్ అన్నారు. బోల్సెనారోకు ట్రంప్ మద్దతు ఉందన్న వార్తలు వెలువడిన నేపథ్యంలో న్యాయమూర్తి వ్యాఖ్యలకు ప్రాధాన్యత వచ్చింది. మరోవైపు బోల్సెనారో మద్దతుదారులు వీధుల్లో గుమిగూడి ఆయనకు క్షమాభిక్ష ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అమెరికా విదేశీమంత్రిత్వశాఖ పశ్చిమార్థగోళ వ్యవహారాల బ్యూరో ఒక ప్రకటన చేస్తూ, బ్రెజిల్ న్యాయమూర్తి మారియోస్ ఇప్పుడు అమెరికాపై ఆంక్షలు విధించే మానవహక్కుల దోపిడీదారుగా మారాడని, ఆ దేశంలో ప్రతిపక్షాల నోరు మూయించేందుకు ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఇప్పుడు బ్రెజిల్ ప్రజాస్వామ్యానికి పెద్ద బెడదగా మారారని విమర్శించింది.

# మతమా...ప్రజాస్వామ్యమా?

## బంగ్లాదేశ్‌లో ఇంకా రాజకీయ అనిశ్చితి









ఢాకా: బంగ్లాదేశ్‌లో విద్యార్థుల తిరుగుబాటు తర్వాత షేక్ హసీనా దశాబ్దంన్నర పరిపాలనకు తెరపడి ఆగస్టు ఐదో తేదీనాటికి ఏడాదికాలం పూర్తయింది. హసీనా తన అధికార నివాసాన్ని, ప్రధానమంత్రి పదవిని వదులుకుని ప్రాణ రక్షణకోసం భారత్‌ను ఆశ్రయించి ఏడాదికాలంగా అజ్ఞాతంలో ఉంటున్నారు. ఆమెపై నేరాభియోగాలు మోపిన ప్రాసిక్యూషన్ ఐసిటిలో రెండు రోజుల క్రితమే విచారణ ప్రారంభించింది. హసీనా పదవీచ్యుతురాలైన మూడు రోజులకు నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనుస్ ప్రధాన సలహాదారుడుగా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. బంగ్లాదేశ్‌లో ఈ ఏడాదికాలంలోనే అనేక మార్పులు సంభవించినప్పటికీ సామాన్య ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, భద్రత వారికి లభించలేదు.

ఒకవైపు దేశంలో సంస్కరణలు తీసుకురావాలని కోరుతున్నవారు కొందరైతే, మరోవైపు ఇన్నాళ్ళూ నిద్రాణంగా ఉన్న మతఛాందస శక్తులు తలెత్తి కఠినమైన ఇస్లామిస్ట్ మత క్రమశిక్షణ అమలుచేసేందుకు భవిష్యత్ బంగ్లా నిర్మాణంలో కీలకపాత్ర వహించాలని ఉవ్విళ్ళూరుతూ ఉండటంతో ఆ దేశంలో ప్రజాస్వామ్యం, సుస్థిరత, ప్రజాస్వామ్యబద్ధ ఎన్నికల వ్యవస్థ నిలదొక్కుకుని మనుగడ సాగించే విషయంపై నీలినీడలు ముసుకుంటున్నాయి. తాత్కాలిక పాలకుల మాటున పొరుగుదేశాలు బంగ్లాదేశ్‌పై పట్టుబిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.దేశంలోని పార్టీలు ఈ సంక్లిష్టమైన పరివర్తన దశలో ఐక్యత ప్రదర్శించకుండా పరస్పర విమర్శలు, పరస్పర హింసాత్మక చర్యలతో రోజులు వెళ్ళదీస్తున్నాయి. తాత్కాలిక ప్రభుత్వ చర్యలు కూడా ఛాందస ఇస్లామిస్టులకు అనుకూలంగా మారాయి. దీంతో బంగ్లాదేశ్‌లో తిరిగి ప్రజాస్వామ్య రాజకీయ సుస్థిత నెలకుంటుందన్న విషయం సందిగ్ధంగా మారింది. అనేకమంది ప్రముఖ ఇస్లామిస్టులు జైళ్ళనుండి పారిపోవడమో, విడుదల కావడమో జరిగింది. దేశంలో ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని ఖలీదాజియా నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) డిమాడ్ చేస్తుండగా, తిరిగి తలెత్తి కొత్తగా వేళ్ళూనుకుంటున్న జమాత్–ఏ–ఇస్లామీ పార్టీ బిఎన్‌పిని కూడా హసీనా అవామీలీగ్ పార్టీ లాంటిదే అని పక్కకుగెంటేసే ప్రయ త్నాలు చేస్తున్నది.

బంగ్లాదేశ్ చరిత్రలో మొట్టమొదటిసారి గత ఏడాది విద్యార్థి ఉద్యమం తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరున ఆవిర్భవించిన 'నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్ సి పి) సరికొత్త బంగ్లాదేశ్‌ను నిర్మిస్తామని సోమవారం ఢాకాలో నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా మరోసారి పునరుద్ఘాటించింది. దేశంలో మొదట ప్రధానమైన సంస్కరణలు చేపట్టకుండా ఎన్నికలను అనుమతించబోమని ఎన్‌సిపి చెబుతున్నది. దేశంలో తక్షణం సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని, ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉండాలని బంగ్లాదేశ్ కమ్యూనిస్టులు స్థిరమైన వైఖరి ప్రకటించారు. వచ్చే ఏప్రిల్ నెలలో ఎన్నికలు నిర్వహిస్తామని, ఈ లోపు సంస్కరణలు అమలు చేస్తామని మహ్మద్ యూనస్ ప్రకటించారు. భారత్ వ్యతిరేక విధానం అవలంబించిన మహ్మద్ యూనుస్ పాలనతో బంగ్లాదేశ్‌లో రోజురోజుకూ ప్రతికూల భావనలు పెరుగుతుండగా, ఇదే అదనుగా బలమైనబంధం పెంచుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నం చేస్తున్నది. బంగ్లాదేశ్ తమ తోటి ముస్లిం దేశమేనని పదే పదే ప్రకటిస్తున్నది.

విద్యార్థి ఉద్యమంలో ఇంట్లోకి దూసుకువచ్చిన తూటావల్ల తన కుమార్తెను కోల్పోయిన బంగ్లావాసి మొషారఫ్ హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉద్యమం ప్రభుత్వ మార్పుకోసం మాత్రమేకాదనీ, దేశ ప్రజల్లో వేళ్ళూనుకున్న విసుగు, వ్యతిరేకతలకు చిహ్నమని అన్నారు. "మాకు సరికొత్త బంగ్లాదేశ్ కావాలి...54 సంవత్సరా ల స్వాతంత్ర్యం తర్వాత కూడా మేం సంతోషంగా లేం, మాకు భద్రత కావాలి, చట్టవ్యవస్థలను సజావుగా తమ విధులు నిర్వహించాలి, ఇంతకుముందులాగా హత్యలు, కిడ్నాపులు లేని సుస్థిర ప్రభుత్వం కావాలి, భావప్రకటనాస్వేచ్ఛ కావాలి"అన్నారు.

**హసీనా అధికార నివాసం.. ఇక రివల్యూషన్ మ్యూజియం**

షేక్ హసీనా ఢాకాలో నివసించిన అధికారిక భవనం ఇకమీదట 'రివల్యూషన్ మెమోరియల్ మ్యూజియం'గా మారబోతోంది. ఈ భవంతికి జులై రివల్యూషన్ మెమోరియల్ మ్యూజియంగా నామకరణం చేసే అవకాశాలున్నాయి. 2024 ఆగస్టు ఐదో తేదీన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి హసీనా దేశం వదిలి భారత్‌కు వచ్చి తల దాచుకున్నారు. హసీనాతండ్రి, బంగబంధుగా పేరుగాంచిన బంగ్లాదేశ్ నాయకుడు ముజిబుర్ రెహ్మాన్ నిర్మించిన ఈ భవంతిని తర్వాత హసీనా తన అధికారిక నివాసంగా మార్చుకున్నారు.

ఈ భవంతిని తాత్కాలిక ప్రభుత్వం మ్యూజియంగా మార్చాలని నిర్ణయించింది. పాకిస్థాన్, బ్రిటిష్ పాలకుల కాలంలో ఈ భవంతిని ఎస్టేట్ రాజ్‌బరిగా పిలిచేవారు. వాస్తవానికి ఇది మహారాజా దిఘుపాషియా రాజ భవంతి.

## ప్రజలకు సంక్షేమ పథకాలు
(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. బాలనర్సింహా మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరగడం వల్ల మితిమీరిన కాలుష్యం చోటుచేసుకుందని అన్నారు. ఫలితంగా పేద ప్రజలు అనారోగ్యాలతో ఇబ్బందులు గురవుతున్న సమయంలో పారిశ్రామిక యాజమాన్యాలపై ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి ఆ సమస్యలను పరిష్కరించే దిశగా సిపిఐ ఉద్యమాలు చేసిందని అన్నారు. షెడ్యూల్ పేరుతో ప్రజల భూములను అన్యాయంగా లాక్కునే ప్రయత్నం చేసినప్పుడు వారి పక్షాన నిలబడి వారి గొంతుకగా నిలబడి పోరాడామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సభ్యులందరూ పార్టీ బలంగా ఉన్న గ్రామాల్లో పోటీ చేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు ఎవరి కోసం పోరాడుతుందో ప్రజల మధ్య కెళ్ళి వివరించాలని వారు పిలుపునిచ్చారు. సభలో సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎండి ఫయాజ్, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పి.పరమేశ్‌గౌడ్, జిల్లా కార్యదర్గ సభ్యులు కొండపల్లి రాము, పి.సురేష్, బి.కృష్ణ యాదవ్, అల్వాల్ రెడ్డి, గోవర్ధన్ ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ సి. రాజు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షరాలు భార్గవి, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మహేష్, కే.నరసింహ, సత్యనారాయణ రెడ్డి, శ్రీను, అమర జ్యోతి, జంగయ్య, ఆంజనేయులు, మన్సూర్ ఖలీమ్, రహమతుల్లా బి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చంద్ర గార్డెన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన నేతాజీ చౌరస్తా మీదుగా గౌడ ఫంక్షన్ హాల్‌కి చేరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన సిఐడి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జలప్రళయం
(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. మరోవైపు, ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. ఇక హరిద్వార్‌లోని గంగా, కాళీ నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

**తక్షణ సహాయ చర్యలు: సీఎం ధామీ**

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో ఉన్నతాధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఉత్తరకాశీ ప్రాంతంలోని ధారాలీలో కుండపోత వర్షాల వల్ల భారీ నష్టం జరిగిందనే వార్త చాలా బాధాకరమన్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికార బందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యల్లో నిమగ్నమై పనిచేస్తున్నాయని తెలిపారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నట్లు వివరించారు. బాధిత ప్రజలకు సాధ్యమైనంతగా అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. మరోవైపు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సీఎం ధామీకి ఫోన్ చేసి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్రం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సమీపంలోని మూడు ఐటీబీపీ బందాలను, నాలుగు ఎన్డీఆర్ఎఫ్ బందాలను కూడా సంఘటనా స్థలానికి పంపినట్లు చెప్పారు. కేంద్ర మంత్రి అజయ్ తమ్టా ఈ విపత్తును ధ్రువీకరించారు. నష్టం మేఘావతం వల్ల జరిగిందని పేర్కొన్నారు. భారత సైన్యం ఒక ప్రకటనలో ఇలా పేర్కొంది : 'హర్సిల్ సమీపంలోని ఖీర్ గడ్ ప్రాంతంలోని ధరాలీ గ్రామంలో భారీ బురదతో కూడిన వరద సంభవించింది. దీని వలన శిథిలాలు, నీరు అకస్మాత్తుగా ఇళ్ల గుండా ప్రవహించాయి' అని తెలిపింది. 'ఐబెక్స్ బ్రిగేడ్ దళాలను వెంటనే సమీకరించారు. పరిస్థితిని అంచనా వేయడానికి, సహాయక చర్యలను చేపట్టడానికి ప్రభావిత ప్రాంతానికి చేరుకున్నారు. నష్ట పరిధిని నిర్ధారించడం జరుగుతోంది. సహాయక చర్యలు ముగిసే కొద్దీ మరిన్ని నష్ట వివరాలు అందుతాయి. ఈ ప్రకతి వైపరీత్యం సమయంలో మన పౌరులకు మద్దతుగా సైన్యం దఢంగా నిలబడి ఉంది' అని తెలిపింది. కాగా, మంగళవారం ఉదయమే భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నైనిటాల్, హరిద్వార్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. తీవ్రమైన తుఫానులు, ఆకస్మిక వరదలకు దారితీసే ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాలలో వరదలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. అంతేకాకుండా ఉత్తరాఖండ్‌లోని చంపావత్, బాగేశ్వర్, పౌరి, తెహ్రీ, డెహ్రాడూన్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ సూచన ప్రకారం... భారీ వర్షపాతం ఉంటుందని హెచ్చరించింది.

**పొరుగున్న హిమాచల్ ప్రదేశ్‌లో...**

పొరుగునున్న హిమాచల్ ప్రదేశ్‌లో సైతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో 310 రహదారులతో పాటు అనేక జాతీయ రహదారులను మూసివేశారు. దీంతో రహదారులపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్‌లో భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ వర్షకాలంలో హిమాచల్ ప్రదేశ్‌లో 103 మంది మరణించారు. అలాగే 36 మంది గల్లంతయ్యారని అధికారికంగా ప్రభుత్వ గణాంకాలు పేర్కొన్నాయి.

## స్థానికత కోల్పోతాడా?
(మొదటి పేజీ తరువాయి)

కొందరు విద్యార్థులు తొలుత హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇవ్వకపోవడంతో అసంతృప్తికి గురైన విద్యార్థులు ఈ కేసులో తీర్పు కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు గత ఏడాది సెప్టెంబరు నెల 20వ తేదీన స్టే ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో పుట్టిపెరిగి ఇక్కడే చదువుకున్న విద్యార్థులు కొన్నేళ్ళపాటు ఇతర రాష్ట్రాలలో చదువులకు వెళ్ళారనే కారణం చూపించి వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు అనుమతి నిరాకరించడాన్ని సుప్రీంకోర్టు ప్రాథమికంగా తప్పు పట్టింది. దీని ఆధారంగానే తెలంగాణ శాశ్వత నివాసితులైన విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశార్హతను తిరస్కరించకూడదని ఆదేశిస్తూ స్టే ఉత్తర్వులు ఇచ్చిం ది. తర్వాత కేసు విచారణ ప్రక్రియలో వాద ప్రతివాదనలు సోమవారంనాటితో పూర్తయ్యాయి. ఐతే రాష్ట్ర ప్రభుత్వం 2024లో ఒకసారి ప్రభుత్వం వైద్యవిద్యలో, దంతవైద్య కళాశాలల్లో ప్రవేశాలకు 135 మంది విద్యార్థులకు అనుమతి ఇస్తూ మినహాయింపు ఇచ్చింది. వీరంతా హైకోర్టుకు వెళ్ళి ఈ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. వైద్యవిద్యలో ఉత్తీర్ణులై ప్రవేశాలకు అర్హత సంబంధించిన పాత ఉత్తర్వులను 2024లో సవరించారు. విద్యార్థులు చివరి నాలుగు సంవత్సరాలు అంటే 9,10,11,12 తరగతులు తెలంగాణలోనే చదువుకోవాలని ఆ నిబంధనల్లో పేర్కొన్నారు. ఐతే విద్యార్థులకు అనుకూలంగా కొత్త నిబంధనలు రూపొందించాలని హైకోర్టు ఆదేశించింది. కానీ ఈ తతంగం పూర్తవ్వాలంటే చాలా సమయం పడుతుంది. ఈలోపు విద్యార్థుల కాలం వృథా అవుతుంది. వారు విలువైన సమయం కోల్పోతారు. అందువల్ల విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

చివరి నాలుగు సంవత్సరాలు విద్యార్థులు స్వరాష్ట్రంలోనే చదువులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్థానికతకు నిర్వచనం ఇచ్చిందనీ, ఒకసారి ఈ స్థానికత నిబంధనలు ఏర్పడితే అనివార్యంగా వాటిని అమలు చేయాలని, శాశ్వ త నివాసం ఉండాలి అనే పదాన్ని హైకోర్టు సృష్టించింది తప్ప వాస్తవానికి దీనిని రాష్ట్ర ప్రభు త్వమే అధికారికంగా నిర్వచించాల్సి ఉంటుందని ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వి సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియ జేశారు. ప్రవేశాలకు సంబంధించిన నిబంధనలను కోర్టు తప్పుగా అర్థం చేసుకుని వారికి ప్రవేశం ఇవ్వాలని చెప్పిందని, కానీ చివరి నాలుగు సంవత్సరాలూ స్థానికంగానే చదువుకు న్నవారికే ప్రవేశం ఇవ్వాలని ప్రభుత్వం చెప్పిం దని ప్రభుత్వ వైఖరిని సమర్థించారు. ఐతే ఒక విద్యార్థి చివరి సంవత్సరాల్లో అంటే 10,11 తరగతులు రెండేళ్ళు బయట రాష్ట్రాలకు లేదా కోటా లాంటి ప్రదేశాలకు వెళ్ళి చదువుకుని తిరిగి వచ్చినవారు స్థానికతను కోల్పోయినట్ల వుతుందా? అని ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ ప్రభుత్వ న్యాయవాది అభిషేక్ సింఘ్విని ప్రశ్నిం చారు. ఒక తెలంగాణ ఐఎఎస్ అధికారికి ఢిల్లీలో పోస్టింగ్ ఇచ్చినంత మాత్రాన తెలంగాణలో పుట్టిపెరిగిన ఆయన పిల్లలు స్థానికతను కోల్పోతారా? అని ప్రశ్నించారు.

## బేస్‌లెస్ రిపోర్ట్
(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో మంగళవారం నాడు 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' పేరుతో హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 665 పేజీల నివేదికలో నచ్చిన అంశాలపై బయటపెట్టిందని, అది ఒక వైపే చూసి, విని, నిలబడి ఇచ్చిన రిపోర్ట్ అని, అది బేస్‌లెస్ రిపోర్ట్ అని ఆరోపించారు. దేశంలో ఎన్నో కమిషన్లు వేశారని, అవి న్యాయస్థానాల ముందు నిలబడవు అని చెప్పారు. గతంలోనూ ఎంతో మంది రాజకీయ నేతలపై కమిషన్లు వేశారన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సత్యహరిశ్చంద్రుడికి తమ్ముడి లెక్క మాట్లాడుతున్నారని, ప్రాణహిత–చేవెళ్లలో పెట్టిన ఖర్చు రూ. 3,700 కోట్లు మాత్రమేనని,రూ. 11 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన చెబుతున్నాడని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తీసుకున్నామని, 20–30 పేజీల కేబినెట్ నోట్ ఉంటుందని, ఆ నోట్‌ను ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేబినెట్ కాకుండా అసెంబ్లీ అప్రూవల్ కూడా ఉందని చెప్పారు.గవర్నర్ ప్రసంగంలో కూడా కాళేశ్వరం అంశం ఉందని, గవర్నర్ ప్రసంగాన్ని కేబినెట్ ఆమోదిస్తుందని,అసెంబ్లీలోని ప్రసంగాన్ని గవర్నర్ కూడా ఆమోదించారని, కాబట్టి కేబినెట్ ఆమోదం లేదనడానికి ఏముందని హరీశ్ రావు అన్నారు. ఆర్థికమంత్రి ప్రసంగంలోనూ కాళేశ్వరంపై మాట్లాడారని,ఆర్థిక మంత్రి ప్రసంగంపై కూడా గవర్నర్, కేబినెట్ ఆమోదం ఉంటుందని చెప్పారు. కాళేశ్వరంపై కెసిఆర్‌ది సోలో నిర్ణయమని ఎలా అంటారని, దానిపై ఆయన అసెంబ్లీలోనే చర్చ పెట్టారు కదా అని అన్నారు. డిపిఆర్ లేకుండానే కొడంగల్ పథకానికి సిఎం రేవంత్ రెడ్డి ఎలా శంకుస్థాపన చేస్తారని ప్రశ్నించారు.

**కాళేశ్వరం నివేదిక గ్యాస్, ట్రాష్**

కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్ మాత్రమే తప్ప అందులో ఏమీ లేదని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో వ్యాఖ్యానించారు. 650 పేజీల పూర్తి నివేదిక ఎవరూ చదవక ముందే అడ్డమైన రోత వార్తలను కొన్ని పత్రికలు రాస్తున్నాయన్నారు. ఉద్దేశపూర్వకంగా కెసిఆర్‌పై, బిఆర్‌ఎస్‌పై కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.కాళేశ్వరం కమీషన్ నివేదిక పై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుందని కెటిఆర్ అన్నారు. మైకులు కట్ చేయకుండా తమను అసెంబ్లీలో మాట్లాడనిస్తే ప్రభుత్వంతో ఫుట్ బాల్ ఆడుకుంటామన్నారు.

## యూరియా ఇవ్వండి
(మొదటి పేజీ తరువాయి)

యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో పంటల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందని అన్నారు. గత ఏప్రిల్ 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందన్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతిగా రావాల్సిన యూరియాకు సంబంధించి షిప్ మెంట్ వివరాలు ఇంకా రాలేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా దేశీయ సంస్థలైన పిపిఎల్ నుండి 11,000 మెట్రిక్ టన్నులు, ఎంసిఎఫ్‌ఎల్ నుండి 7వేల మెట్రిక్ టన్నులు ఆగస్టులో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వారు సరఫరా చేయలేమని తెలియజేసినట్టు పేర్కొన్నారు. మరోవైపుఏప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ విషయంలో కేంద్ర రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి జెపి నడ్డా తక్షణ చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా కోరారు. అదేవిధంగా ఈ ఆగస్టులో సరఫరా చేయలేమని చెప్పిన పిపిఎల్, ఎంసిఎఫ్‌ఎల్ వల్ల ఏర్పడిన 18 వేల మెట్రిక్ టన్నుల కొరతను ఆర్‌ఎఫ్‌సిఎల్ ద్వారా భర్తీ చేయడం ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం సాగు అవుతున్న పంటలకు యూరి యా లభ్యత నిరవధికంగా ఉండేలా చూసేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అవమానిస్తారా?
(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన ఎన్‌డిఎస్‌ఎ మీద నమ్మకం లేదని, మేడిగడ్డను కుంగబెట్టిన దుర్మార్గులు ఇప్పుడు ఏకంగా సీనియర్ జస్టిస్ పీసి ఘోష్‌ను అవమానిస్తున్నారా? అని నిలదీశారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అవకతవకలకు పాల్పడింది.. ఎన్ని అక్రమాలకు పాల్పడిందో జ్యుడిషియల్ కమిషన్ విచారణలో బయటపడింది. అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్,ఆనాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు భండారం బట్టబయలైంది. అందుకే తేలు కుట్టిన దొంగల్లా.. హరీష్‌రావు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని మండిపడ్డారు.

వాస్తవాలు దాచిపెట్టి ప్రజలను మభ్యపెట్టిన బిఆర్‌ఎస్ నేతల నిజస్వరూపాన్ని జ్యుడిషియల్ కమిషన్ బయటపెట్టిందని, జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించిందని, అది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి రాసిన రిపోర్టు కాదనే విషయాన్ని హరీశ్‌రావు మరిచిపోయినట్లున్నారని అన్నారు. ఈ నివేదికపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోందన్నారు. అందుకే బిఆర్‌ఎస్ పార్టీ ఆఫీసుకు వెళ్ళి ఏకంగా జ్యుడిషియల్ కమిషన్ ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారని, న్యాయబద్ధ కమిషన్ కు అపార్థాలు అంటగట్టే నీచానికి దిగజారటం కూడా మీకే చెల్లిందని హరీశ్‌రావును ఉద్దేశించి అన్నారు. ఈ నివేదికను చర్చించేందుకు సిద్ధంగా ఉందని, కాళేశ్వరంలో దోషులుగా తేలిన బాధ్యులు.. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కూడా ప్రభుత్వం ఆహ్వానించిందని గుర్తు చేశారు. ఫామ్‌హౌజ్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్టింగ్ ఇకనైనా ఆపాలని, అసెంబ్లీకి వచ్చి చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పుకోవాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. మీరు వేలకోట్ల అవినీతి చేస్తే ఒప్పు,... మేం విచారణ చేసి నిజాలు నిగ్గుతేలిస్తే అది రాజకీయ కక్ష సాధింపా? అని నిలదీశారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్ట్‌కు ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో ఇచ్చారని, తమ ప్రభుత్వం ఒక్క రూపాయి బిల్లు కూడా ఇప్పటి వరకు ఆ ప్రాజెక్ట్ కు ఇవ్వలేదనిన్నారు.

## కాపీలు దహనం
(మొదటి పేజీ తరువాయి)

జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం83వ వార్షికోత్సవం సందర్భంగా పది కేంద్ర కార్మిక సంఘాలు (సిటియు), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జాతీయ కమిటీల సంయుక్త పిలుపు మేరకు రాష్ట్రంలో నిరసన చేపట్టనున్నట్లు ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్‌లు పశ్య పద్మ, టి.సాగర్ చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌కెఎం నిరసన కార్యక్రమం వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. నిరసనలో రైతులు, కార్మికులు, ప్రజలు భాగస్వాములు కావాలని వారు కోరారు. పిలుపునిచ్చారు. భారతదేశం ట్రంప్ సుంకాల బెదిరింపులను తిరస్కరించాలని, రష్యాతో సహా అన్ని దేశాలతో వ్యాపారం చేయడానికి దాని సార్వభౌమ హక్కును నొక్కి చెప్పాలని, భారతదేశంఇంగ్లండ్ సిటాను పార్లమెంటులో ఆమోదించకుండా వెంటనే సమీక్షించి మార్చాలని వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ దోపిడీని నిరోధించడానికి అమెరికా – భారతదేశం వాణిజ్య ఒప్పందం కోసం అన్ని చర్చలను నిలిపివేయాలన్నారు. ఇకపై రహస్య వాణిజ్య ఒప్పందాలు చేసుకోవద్దని, భవిష్యత్తులోని అన్ని ఒప్పందాలు పూర్తి పార్లమెంటరీ పరిశీలన, ప్రజా సంప్రదింపులకు అనుగుణంగా జరగాలన్నారు. పశ్య పద్మ మాట్లాడుతూ వ్యవసాయరంగం నుంచి కార్పొరేట్ కంపెనీలు వైదొలగాలని డిమాండ్ చేశారు. భారతదేశంపై 25 శాతం సుంకాలను, రష్యాతో చమురు వాణిజ్య ఒప్పందానికి పన్ను విధించాలనే అమెరికా అధ్యక్షులు ట్రంప్ బెదిరింపులు గర్హనీయమన్నారు. ఈ దూకుడు చర్యలు అమెరికా వాణిజ్య విధానాల కపటత్వాన్ని బహిర్గతం చేస్తున్నాయన్నారు. అమెరికా ఆంక్షలపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటం దేశ సార్వభౌమధికారాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడమేనని, భారత రైతులు పండించే పంటలు, పాల ఉత్పత్తుల ధరలపై తీవ్ర ప్రభావం చూపేలా ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం– అమెరికా వాణిజ్య ఒప్పందంతో వ్యవసాయరంగం సంక్షోభంతో పాటు ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని, పారిశ్రామికీకరణను, నిరుద్యోగాన్ని పెంచుతుందని చెప్పారు. టి.సాగర్ మాట్లాడుతూ తక్షణమే భారతదేశం, యుకె, యుఎస్ వాణిజ్య ఒప్పందం కోసం జరిగే చర్చలను, ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు జక్కుల వెంకటయ్య, ఆర్.వెంకట్రాములు, కెచ్చల రంగయ్య, మామిడాల భిక్షపతి, నాగిరెడ్డి, రవీందర్‌గౌడ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధర్నా
(మొదటి పేజీ తరువాయి)

ఎఐసిసి అగ్ర నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విర్కమార్క, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొననున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లులను వెంటనే ఆమోదించాలని గురువారం రాష్ట్ర మంత్రివర్గం రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయనుంది. బిసి రిజర్వేషన్ల బిల్లుకు మద్దతునిస్తూ బిసి మేధావులు, బిసి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి రావాలని మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ధర్నా కార్యక్రమం కోసం సిఎం, డిప్యూటీ సిఎంలతో పాటు మంత్రులు, పార్టీ కి చెందిన సీనియర్ నేతలు ఢిల్లీకి చేరుకున్నారు. ఇదిలా ఉండగా, బుధవారం ధర్నా జరిగే ఢిల్లీని జంతర్‌మంతర్ ప్రాంతాన్ని మంగళవారం రాత్రి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, తెలంగాణ శాసనసభలో బిసి బిల్లుకు మద్దతు తెలిపిన బిజెపి, ఢిల్లీకి వెళ్లిన తర్వాత ముస్లింల పేరుతో బిల్లును అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించాలని కోరుతూ, తెలంగాణ కాంగ్రెస్ నేతలు మూడు రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పలువురు ఎంఎల్‌ఎలు, బిసి సంఘాల నేతలు శంషాబాద్ విమానాశ్రయం నుండి ఢిల్లీకి వెళ్లారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానం మేరకు తెలంగాణ ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించి ఎస్ సి, ఎస్ టి, బిసిల లెక్కలు సేకరించిందన్నారు. ఆ తర్వాత సబ్ కమిటీ, కెబినెట్, శాసన సభ ఆమోదంతో గవర్నర్ ద్వారా ఈ బిల్లును రాష్ట్రపతికి పంపించడం జరిగిందని తెలిపారు. అయితే, తెలంగాణ శాసన సభలో బిల్లుకు మద్దతు పలికిన బిజెపి, ఢిల్లీకి వెళ్ళిన తర్వాత ముస్లింల పేరుతో ఈ బిల్లుకు అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సామాజిక న్యాయం కోరుకునే ప్రతి ఒక్కరూ, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుకునే తెలంగాణలోని ప్రతి రాజకీయ పార్టీ నాయకులు ఈ మూడు రోజులు ఢిల్లీకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పేపర్ బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి : కెటిఆర్

**న్యూఢిల్లీ :** ఇవిఎంలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని, తిరిగి బ్యాలెట్ పద్ధతిలోనే అన్ని ఎన్నికలను నిర్వహించాలని భారత ఎన్నికల కమిషన్‌ను కోరామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తెలిపారు. ఎన్నికల సంస్కరణలు, ప్రతిపాదనలు, ప్రవర్తనా నియమావళి సంబంధిత అంశాలపై చర్చించాలన్న ఎన్నికల కమిషన్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సిఇసి గ్యానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్‌లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషిలతో మంగళవారం నాడు బిఆర్‌ఎస్ ప్రతినిధులు కెటిఆర్, బి.వినోద్‌కుమార్, ఎంపి రవిచంద్ర, మాజీ ఎంపి బాల్కసుమన్‌లు సమావేశమయ్యారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన ఎన్నో దేశాలు ఇవిఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేసి, తిరిగి పేపర్ బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహిస్తున్న సంగతిని ఎన్నికల కమిషన్‌కు గుర్తుచేశామని చెప్పారు. నవంబర్‌లో జరిగే బిహార్ ఎన్నికలతోనే పేపర్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టి, తరువాత జరిగే సాధారణ ఎన్నికలనూ బ్యాలెట్‌తోనే నిర్వహించాలని స్పష్టం చేశామన్నారు.

## రైల్వే లాండ్రీ టెండర్‌లో బిడ్ తిరస్కరణపై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైల్వే లాండ్రీ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.434 కోట్ల విలువైన టెండర్‌లో ఒక బిడ్డర్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించిన కేంద్రప్రభుత్వ చర్యపై విచారణ అవసరమని హైకోర్టు అభిప్రాయపడింది. భారత రైల్వేలతో బూట్ మోడల్‌లో వాణిజ్య లాండ్రీ సేవలను పిటిషనర్ సంస్థ అందిస్తోంది. 2025 మే 15న విడుదలైన టెండర్‌కు పిటిషనర్ సంస్థ బిడ్లు సమర్పించింది. అయితే, సుప్రీం లాండ్రీ సర్వీసెస్ జాయింట్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన పత్రాలు పిటిషనర్ సంస్థ ఏఎస్‌జీ సుప్రీం లాండ్రీ సర్వీసెస్, సమర్పించలేదని చెప్పి అధికారులు గత జూలై 26న బిడ్‌ను తిరస్కరించారు. వాటిని సాంకేతిక కారణాల వల్ల అప్‌లోడ్ చేయలేకపోయామని పిటిషనర్ న్యాయవాది ఎ.వెంకటేశ్ వాదించారు. తిరస్కరించిన తర్వాత రోజు పత్రాలను సమర్పించినట్లు వివరించారు. టెండర్‌లో తమ బిడ్ తక్కువ ధరకు కోట్ చేశామని, అయినప్పటికీ పిటిషనర్ బిడ్‌ను అన్యాయంగా తిరస్కరించారని చెప్పారు. దీనిపై కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహాశర్మ ప్రతివాదన చేస్తూ, గడువు ముగిసిన తర్వాత పత్రాలు సమర్పించినట్లు పిటిషనరే అంగీకరిస్తున్నారని, పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. వాదనలపై స్పందించిన హైకోర్టు, టెండర్ ప్రక్రియలో సందిగ్ధత నెలకొంటే కోర్టులు జోక్యం చేసుకోవాలని టాటా మోటార్స్ కేసులో సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేసింది. టెండర్‌ను ఇంకా ఖరారు చేయలేదని కూడా గుర్తు చేసింది. ఈ నెల 18న సమగ్ర విచారణ చేస్తామని జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ ప్రకటించారు.

## యాంత్రికంగా రిమాండ్ ఉత్తర్వులు

### కింది కోర్టు ఆదేశాలను తప్పుపట్టిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిందితుడిని పోలీసులు అరెస్టు చేసిన 24 గంటల వ్యవధిలోగా కోర్టులో హాజరుపర్చలేదని, ఈ విషయాన్ని పట్టించుకోకుండా కిందికోర్టు యాంత్రికంగా రిమాండ్ ఉత్తర్వులను జారీ చేసిందని హైకోర్టు తప్పుపట్టింది. రిమాండ్ ఆదేశాలు చట్టవిరుద్ధమని జస్టిస్ ఎన్. తుకారాం జీ స్పష్టం చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, ఈడీ బజార్‌కు చెందిన సయ్యద్ దస్తగిరి చదువుతూ క్యాబ్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. అతనిపై మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సయ్యద్ దస్తగిరిని గత నెల జూలై 7న రాత్రి 10:15గంటలకు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత రోజు రాత్రి 11:35 గంటలకు అతనిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అంటే, 24 గంటల అనంతరంకోర్టులో హాజరుపరిచారని న్యాయమూర్తి తప్పుపట్టారు.


**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**

**రెవిన్యూ (ఎల్‌ఎ) శాఖ** లేదా

కలెక్టర్ / జాయింట్ కలెక్టర్ / స్పెషల్ కలెక్టర్ (ఎల్‌ఎ) / ఎస్‌డిసి (ఎల్‌ఎ)

**ఫారం VII**

(30/2013 చట్టంలోని 19(1) సెక్షన్, సబ్‌రూల్ -25 చూడుము)

**డిక్లరేషన్**

గజిట్ నెం. జిహెచ్‌ఎంసి-16 తేదీ: 31.07.2025

నెం.సి/72/2025 తేదీ: 30.07.2025

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల గ్రామంలో ప్రజా ప్రయోజనం కోసం మొత్తం **1799.55 చదరపు గజాల** భూమి అవసరమని తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్, ఎల్‌ఎ & కమిషనర్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్ భావిస్తున్నారు. అంటే దేవాన్ దాబా నుండి నర్సాపూర్ రోడ్, రంగ బుజంగా థియేటర్ వరకు ప్రతిపాదిత 80 అడుగుల (24.00 మీటర్లు) వెడల్పు గల రహదారి కోసం రోడ్డు విస్తరణ మరియు ఫాక్స్ సాగర్ సర్‌ప్లస్ నాలా మీదుగా పైప్‌లైన్ రోడ్డుపై 4-లేన్ కాంపోజిట్ స్టీల్ గ్రైడర్ వంతెన నిర్మాణం.

అందువల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల గ్రామంలో పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం, **1799.55 చదరపు గజాల** ప్రామాణిక కొలత కలిగిన భూమిని, దీని వివరాల వివరణ క్రింది విధంగా ఉంది, సేకరణ కోసం ప్రతిపాదించబడింది:

| క్ర. సం. | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం | విస్తీర్ణం చ.గ.లలో | ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు [illegible] | [illegible] | నిర్మాణములు రకం | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| ఎడమ వైపు ఆస్తులు | | | | | | | | | | | | | |
| 1 | 333/4 | పట్టా భూమి | యజమాని | 93.91 | శ్రీనివాస్ ప్రెసిడెంట్ ఆర్.వి. ఆద్విక్ అపార్ట్‌మెంట్స్ బ్లాక్-బి | రోడ్ | యజమానుల ఆస్తి | లీలాదేవి చౌదరి ఖాళీ ప్రదేశం | గ్రాండ్ విల్లా చౌదరి | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 2 | 328/3 | పట్టా భూమి | యజమాని | 204.73 | జి.సుబ్బారామయ్య గ్రాండ్ విల్లా ఇ.నెం.02-092/డి | రోడ్ | యజమానుల ఆస్తి | ఆర్.వి. అద్విక్ అపార్ట్‌మెంట్ బిఎల్‌బి | వంశీ ఆస్తి | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 3 | 328/2 326/5 | పట్టా భూమి | యజమాని | 56.30 185.92 242.22 | శివానంద్ (శ్రీహరి) -- | రోడ్ | యజమానుల ఆస్తి | గ్రాండ్ విల్లా | నాలా | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 4 | 320/3 21/2 | పట్టా భూమి | యజమాని | 113.14 8.33 131.47 | శివానంద్ మారుతి సన్‌సిటీ -- | రోడ్ | యజమానుల ఆస్తి | నాలా | పి.శ్రీమతి ఆస్తి | - | - | (ఎస్+టిపి) ఖాళీ ప్రదేశం | - |
| 5 | 321/3 316/2 | పట్టా భూమి | యజమాని | 151.79 20.00 171.79 | పి.శ్రీమతి (వి.ఆర్.ఇండస్ట్రీస్) -- | రోడ్ | యజమానుల ఆస్తి | శివానంద్ ఆస్తి | దయాకర్ రెడ్డి ఆస్తి | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 6 | 316/3 | పట్టా భూమి | యజమాని | 91.49 | దయాకర్ రెడ్డి -- | రోడ్ | యజమానుల ఆస్తి | పి.శ్రీమతి ఆస్తి | దయాకర్‌రెడ్డి మైక్రోటెక్ ఆస్తి | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 7 | 316/4 | పట్టా భూమి | యజమాని | 172.02 | దయాకర్ రెడ్డి (మైక్రోటెక్) ఇ.నెం.7-2-25/2/ఎ | రోడ్ | యజమానుల ఆస్తి | దయాకర్ రెడ్డి ఆస్తి | 7-025-2 /ఎ/1 | - | - | ఖాళీ ప్రదేశం | - |
| కుడి వైపు ఆస్తులు | | | | | | | | | | | | | |
| 8 | 328/7 | పట్టా భూమి | యజమాని | 89.11 | ఎం.హర నేత్రయ్య టిటూస్ ఇన్‌ఫ్రా | రోడ్ | యజమానుల ఆస్తి | హరనేత్రయ్య ఓం టైల్స్ | 02-92/2/ 3/ఎస్ఆర్ | - | - | 1జెడ్(ఆర్. షట్టర్స్) | - |
| 9 | 326/4 | పట్టా భూమి | యజమాని | 37.4 | తరుణ్‌కుమార్ జిందాల్ ఇ.నెం. 02-92/2/3 /ఎస్ఆర్ | రోడ్ | యజమానుల ఆస్తి | ఎం.హర నేత్రయ్య ఆస్తి | 02-092/2/ 2/20/1/ ఎస్ఆర్ | - | - | 1జెడ్ (ఆర్. షట్టర్స్) | - |
| 10 | 326/3 | పట్టా భూమి | యజమాని | 31.57 | వర్ధారాం చౌదరీ ఇ.నెం. 2-92/2/2/20 | యజమానుల ఆస్తి | రోడ్ | 02-92/2/ 3/ఎస్ఆర్ | 2-092/2/ 2/20/1/ ఎస్ఆర్ | - | - | 1జెడ్ (ఆర్. షట్టర్స్) | - |
| 11 | 326/2 | పట్టా భూమి | యజమాని | 71.40 | జి.నర్సింహా ఇ.నెం. 02-92/2 /2/20/1/ఎస్ఆర్ | యజమానుల ఆస్తి | రోడ్ | 92-2/2 /20 | నాలా | - | - | Iపి+జెడ్+ ఖాళీ ప్రాంతం | - |
| 12 | 320/2 | పట్టా భూమి | యజమాని | 140.00 | ఆనంద్ -- | యజమానుల ఆస్తి | రోడ్ | నాలా | ఆనంద్ ఆస్తి | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 13 | 321/4 | పట్టా భూమి | యజమాని | 138.33 | ఆనంద్ -- | యజమానుల ఆస్తి | రోడ్ | బాలకృష్ణ ఆస్తి | రోడ్ | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 14 | 321/5 | పట్టా భూమి | యజమాని | 128.33 | ఆనంద్ -- | యజమానుల ఆస్తి | రోడ్ | రోడ్ | మురళి ఆస్తి | - | - | ఖాళీ ప్రదేశం | - |
| 15 | 316/9 | పట్టా భూమి | యజమాని | 55.78 | మురళి 7-5-583/1/1 | యజమానుల ఆస్తి | రోడ్ | ఆనంద్ ఆస్తి | మురళి ఆస్తి | - | - | ఖాళీ ప్రదేశం | - |
| మొత్తం: | | | | 1799.55 | | | | | | | | | |

2013 నాటి భూసేకరణ పునరావాస చట్టం 30 క్రింద న్యాయబద్ధమైన దాపరికం లేని నష్ట పరిహార హక్కు సెక్షన్ 15 క్రింద ఎటువంటి అభ్యంతరాలు లేనందువల్ల ఈ ప్రకటన చేయబడింది. భూసేకరణ కారణంగా పునరావాసం పొందే కుటుంబాలు **ఏమీ లేవు**.

పేర్కొన్న భూమి లేదా పేర్కొన్న భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం కింద ఉన్న బొగ్గు, ఇనుప రాయి, స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు, ప్రాజెక్ట్ నిర్మాణ దశలో భూమిని సేకరించే ఉద్దేశ్యంతో తవ్వాల్సిన లేదా తొలగించాల్సిన లేదా ఉపయోగించాల్సిన గనులు మరియు ఖనిజాల భాగాలు తప్ప, అవసరం లేదు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్‌ఎ, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్.

సం/- స్పెషల్ కలెక్టర్ (ఎల్‌ఎ) & కమిషనర్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్.

DIPR RO NO. 443/LA/PP/ADVT/AGENCY/2025-26




## బిసి రిజర్వేషన్ బిల్లుకు బిజెపి అడ్డుకట్ట

భారతదేశంలో మొట్టమొదటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ

బడా పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాస్తున్న ప్రధాని

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**ప్రజాపక్షం/ములుగు:** భారతదేశంలో మొట్టమొదటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, బిసి రిజర్వేషన్‌ను చట్టం కాకుండా బిజెపి అడ్డుకుంటుందని, బడా పారిశ్రామిక వేత్తలకు కొమ్ము కాస్తూ దేశ సంపదను వారికి దోచి పెడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు.. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో సిపిఐ తృతీయ మహాసభలు జరిగాయి. ఏరియా హాస్పటల్ నుండి డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిపిఐ నాయకులు జంపాల రవీందర్, సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో జరిగిన సిపిఐ తృతీయ మహాసభలకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని మొట్టమొదటిగా ఏర్పడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, అలాగే ఎర్రజెండా పుట్టిందే పేదరికం కోసమని బడుగు బలహీన వర్గాల కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేస్తుందని పోరాటాల వీరుల రక్తంతో ఏర్పడిన ఎర్రజెండా అని అందరికి తెలిసిన విషయమేనని ఆయన అన్నారు. ములుగు జిల్లాలో పేదరికం బాగా ఉందని ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఇప్పటి వరకు కూడా పేద కుటుంబాలకు ఎలాంటి న్యాయం జరగలేదని ప్రభుత్వాలు మారుతున్న పేదరికం మారలేదని ములుగు జిల్లాలో అభివృద్ధి లేక జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడా పారిశ్రామిక వ్యక్తులు బ్యాంకులలో నుండి వందలాది కోట్లు అప్పు తీసుకొని కట్టకుండా విదేశాల్లో తల దాచుకున్నారని ఆరోపించారు. ఇలా జరిగినప్పటికి నరేంద్రమోడీ కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. బిజెపి రాజకీయాలు చేస్తూ అంబానీ అతని ఆస్తులు పెంచడానికి మతం పేరుతో వాడుకుంటుందన్నారు. దేశంలో బిజెపి కొంత మంది ఆస్తులు పెంచడానికి పనిచేస్తుందని ఆరోపించారు. దేశంలో కమ్యూనిస్టులు ఉండొద్దు, ముస్లింలు, క్రిస్టియన్స్ ఉండద్దనేది బిజెపి సిద్ధాంతమని హిందూ మతం పేరు చెప్పి ఓట్లు దండుకునేది అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలను ఇబ్బంది పెడుతు ఉన్నారన్నారు. బిసి రిజర్వేషన్ల బిల్లులపై బిజెపి ద్వంద వైఖరి అవలంభిస్తుందని, బిల్లును చట్టం కాకుండా అడ్డుకుంటుందని అన్నారు. సిపిఐ పార్టీ డిసెంబర్ 26 వరకు 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ఆ రోజున 26 దేశంలో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులందరూ పెద్దయెత్తున కలుసుకొని ఆ రోజు జరిగే సభను విజయవంతం చేస్తామని అన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి ములుగు జిల్లాలో అభివృద్ధి పనులు చేసి పేద కుటుంబాలను ఆదుకోవాలని వారన్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికారులను బలిచేసుడు సరికాదు..**

గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి పది సంవత్సరాల పరిపాలన కొనసాగించింది. అందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్నో తప్పులు చేసినప్పటికి అది అధికారులపై బురద జల్లుడు సరికాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ లిఫ్ట్ ద్వారా గోదావరి నీటిని పంపించడం అలాగే గోదావరికి అడ్డుకట్ట వేసి గోదావరి నీటిని ఆపడం జరిగింది. అందువలన కొన్ని నదులకు గోదావరి నీరు చేరలేక పోతుంది. లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో గోదావరికే అడ్డుకట్ట వేయడం సరికాదని ఆయన అన్నారు. అలాగే వందల కోట్ల ఖర్చు చేసి కుటుంబ సమేతంగా డబ్బులు సొమ్ము చేసుకొని ఆ తప్పుడు మాటలతో అధికారులు తప్పు చేశారని అంటున్నారన్నారు. ఇది ఎంత వరకు నిజమని తప్పు చేసిన వారిని శిక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సలహాదారు తక్కళ్ళపల్లి శ్రీనివాస రావు, ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, ములుగు జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, కరె హమ్మద్ భాషా, బిక్షపతి, రాజు, కుమ్మరి సాగర్, బండి నరసయ్య, కొమురయ్య, స్వరూప, రజిత, శంకర అక్క, సిపిఐ మండలాధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణాలు త్వరలో పూర్తి చేయండి

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాపూర్ నుంచి విజయవాడ (అమరావతి) వరకు 4 వరుసలుగా ఉన్న హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిని 6 వరుసలు గా విస్తరించడంతో పాటు సర్వీస్ రోడ్లను నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో భేటీ అయినమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర ఎంపిలు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై చర్చించారు.

ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడతూడెత్ రోడ్డుగా పిలిచే హైదరాబాద్‌విజయవాడ రహదారిపై (ఎన్‌హెచ్65) జూలై 27 న జరిగిన ప్రమాదంలో ఎపికి చెందిన ఇద్దరు డీఎస్పీల మృతి చెందిన విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకువచ్చారు. 5 సార్లు ఎంఎల్‌ఎ, ఎంపిగా, మంత్రిగా, ప్రతీరోజు ప్రమాదాల వార్తలను వినడం, కొన్నిసార్లు ప్రత్యక్షంగా చూడటం బాధ కలిగిస్తుందని కేంద్రమంత్రి ముందు తన ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తిపై సానుకూలం గా స్పందించిన కేంద్ర మంత్రిగడ్కరీ.. ఈనెల 15 వ తేదీన నిర్వహించే ఫైనాన్స్ మీటింగ్‌లో ఎన్.హెచ్65 విస్తరణను ఆమోదిస్తామని.. త్వరితగతిన అంచనాలు రూపొందించి పంపాలని, వెంటనే టెండర్లు పిలుస్తామని మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆర్ఆర్ఆర్‌కు సంబంధించి 'సంగారెడ్డి టూ చౌటుప్పల్: రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ పూర్తి చేసిన విషయాన్ని గడ్కరీకి మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు. 4 వరుసలుగా నిర్మించాలనుకున్న రీజినల్ రింగ్ రోడ్డు ను భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 6 వరుసలుగా నిర్మించేందుకు ఎస్టిమేషన్లు మాడిఫై చేస్తున్నామని, టెండర్లను సైతం అందుకు అనుగుణంగా ఫైనలైజ్ చేస్తమని గడ్కరీకి తెలిపారు.

రివైజ్ ఎస్టిమేషన్ తో 3 నెలల్లో ఉత్తర భాగం పనులు మొదలు పెట్టాలని, అంతేకాకుండా ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం కూడా యుద్ధప్రతిపాదికన ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని గడ్కరీని కోరిన మంత్రి.కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.



కమ్యూనిస్టు సిద్ధాంత కర్త ఫ్రెడరిక్ ఎంగెల్స్ 130వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం.



## పత్రికలు నిష్పక్షపాతంగా ఉండాలి

### నిర్భీతిగా జరిగిన విషయాన్ని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత పాత్రికేయులదే

'విలీనం-విభజన, గతం-స్వగతం: మన ముఖ్యమంత్రులు' పుస్తకావిష్కరణలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజానికి పత్రికలు దర్పణం లాంటివని, సమాజంలో ఏమి జరుగుతుందో నిష్పక్షపాతంగా, నిర్భీతిగా ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత పాత్రికేయులదేనని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు అన్నారు. స్వేచ్ఛగా ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలన్నా, అర్థవంతంగా ఉండాలన్నా పత్రికలు నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. ఇందుకు పాత్రికేయులు అనునిత్యం అణుకువగా ఉంటూ మెలుకువతో జరుగుతున్న విషయాలతో ప్రజలను మేల్కొల్పే విధంగా వార్తలు రాయాలని సూచించారు. సీనియర్ సంపాదకులు ఇనగంటి వెంకట్రావు రాసిన 'విలీనం విభజన, గతంస్వగతం: మన ముఖ్యమంత్రులు' పుస్తకాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారకభవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సమాచార హక్కు కమిషన్ మాజీ చైర్మన్ కట్టా శేఖర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పుస్తకంలో ఉమ్మడి రాష్ట్ర చరిత్ర, రాజాకీయలు, వాటిని ప్రభావితం చేసిన నాయకులు, ముఖ్యమంత్రులకు సంబంధించిన విశ్లేషణ చేయడం, రెండవది పుస్తక రచయిత నిష్పాక్షికంగా తన వృత్తిని నిర్వర్తించిన జర్నలిస్టు కావడం గర్వపించదగ్గ విషయమన్నారు. 'విలీనం విభజన' పుస్తకం నవతరానికి విషయ దీపిక లాంటిదని, నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. తన జీవితంలో రెండు సంఘటనలు గుర్తుకు వచ్చినప్పుడు కన్నీళ్లు వస్తాయని భావోద్వేగానికి గురయ్యారు. ఒకటి చనిపోయిన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు, మరొకటి ఉప రాష్ట్రపతి పదవి చేపట్టాల్సి వచ్చిన సందర్భంలో తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేకపోయిన అమ్మ తర్వాత అమ్మలాంటి పార్టీకి రాజీనామా చేయడమని తెలిపారు. తాను రాజీనామా చేసిన నాటి నుంచి పార్టీ కార్యాలయం గడప తొక్కలేదని వెల్లడించారు. ప్రస్తుత రాజకీయ నాయకుల భాష తీరుపై అసహనం వ్యక్తం చేశారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని వెంకయ్య నాయుడు సూచించారు. తాము గతంలో నాయకుల ప్రసంగాలు వినడానికి ముందుగానే ఛార్జీల డబ్బులు జమ చేసుకుని మరీ వెళ్లి వచ్చేవారమన్నారు. కానీ ఇప్పుడు ప్రజలు బహిరంగ సభలకు రావాలంటే బస్సు, బత్తా, బాటిల్, బిర్యాని ఈ నాలుగు 'బి పాలసీ' అమలు చేస్తే తప్ప రాని పరిస్థితి ఏర్పడిందని, రాజకీయ నాయకుల పట్ల ప్రజలకు విలువ తగ్గడమే ఇందుకు కారణమని వెంకయ్యానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అంశాలను నిర్భీతిగా ఉన్నది ఉన్నట్లుగా సరైన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందన్నారు. అయితే ఇప్పుడు మరో కొత్త ట్రేండ్ వచ్చిందని రాజకీయ నాయకులే పత్రికలు పెట్టుకుని ఎదుటివారిపై దుమ్మెత్తి పోస్తూ వారి గురించి వారే సొంత డబ్బా కొట్టుకుంటున్నారని, ఇది ఎంతమాత్రం మంచిదికాదని తెలిపారు. మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అతి అరుదుగా రాసే ప్రతిభ ఉన్న వాళ్లలో సీనియర్ సంపాదకులు వెంకట్రావు ఒక్కరన్నారు. వెంకట్రావ్ జర్నలిస్టుగా పనిచేసిన కాలంలో ఉన్న ముఖ్యమంత్రుల పనివిధానాలను ఎప్పటికప్పుడు తన కథనాల ద్వారా ఎండగట్టడం అందరికీ తెలిసిందేనన్నారు. కట్టా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహాభారతంలో కౌరవ, పాండవుల యుద్ధ ఘటనను నిష్పక్షపాతంగా సంజయ్ ధృతరాష్ట్రుడికి వినిపించిన విధంగా 'విలీనం విభజన' పుస్తకంలో రచయిత వెంకట్రావు సైతం ఏ పక్షం తీసుకోకుండా నిజాయితీగా రాశారని ప్రశంసించారు. బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాన్యాసాలకు ట్రేడ్ మార్క్ వెంకయ్యనాయుడు అయితే పుస్తక రచయిత వెంకట్రావు ప్రత్యేక కథనాలకు పెట్టింది పేరు అన్నారు. పుస్తక రచయిత వెంకట్రావు మాట్లాడుతూ పుస్తకావిష్కరణకు అన్నివిధాలుగా సహకరించిన మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## జూనియర్లకు మంత్రి పదవా?

- కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**ప్రజాపక్షం/మునుగోడు:** తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం మోసంచేసి ఇతర పార్టీల నుంచి వచ్చిన జూనియర్లకు మంత్రి పదవి ఇచ్చి తెలంగాణ కోసం కాంగ్రెస్ ఎంపిగా పార్లమెంట్‌లో పోరాడిన, ఎన్నికల ముందు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జిగా తీసుకొని ఎంపి పదవి గెలిపించిన తనను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంగళవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్ పార్టీ లో చేరి సీనియర్ నాయకుడైన నన్ను కాదని తనకంటే జూనియర్లకు ఇస్తే ఊరుకుంటానా? అని అవసరమైతే మునుగోడు నియోజకవర్గ ప్రజలకోసం మరోసారి పదవీ త్యాగం కోసమైనా సిద్ధమైతానని నియోజకవర్గం కేంద్రంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని రోజులుగా సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలకు దీటుగా అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ పరస్పర వరుసగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. **మునుగోడును అభివృద్ధి చేస్తాం :** మునుగోడు నియోజకవర్గంని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొరటికల్ గ్రామంలో 33/11 కె.వి విద్యుత్ ఉప కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడా రు. మునుగోడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఉమ్మడి జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, విద్యుత్ అధికారులు ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఎడిఇ అన్న య్య, ఎఎడి ఈ అశోక్, నాయకులు మాజీ జెడ్పిటిసి నారాయణ రవి, మాజీ ఎంపిపి కర్నాటి స్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, బొలుగురి నరసింహ, మండల కార్యదర్శి చాపల శ్రీను, మందుల పాండు, దయాకర్ పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, మందుల బీరప్ప, తదితరులు పాల్గొన్నారు.



## 25 వరకు ప్రభాకర్ రావుని అరెస్ట్ చేయొద్దు

### సుప్రీంకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్‌బి మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్ వ్యవహారంలో విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 25కు వాయిదా పడింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు దర్యాప్తుకు సహకరించడం లేదని..అతనిని అరెస్టు చేయరాదంటూ ఇచ్చిన ఆదేశాలు రద్దు చేయాలని సిట్ పిటిషన్ వేసింది. ఓ వైపు ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే మరోవైపు సిట్ అధికారులు విచారణ పేరుతో వేధిస్తున్నారనిముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రభాకర్ రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ నెల 25 వరకు ప్రభాకర్ రావుని అరెస్ట్ చేయరాదంటూ సుప్రీం కోర్టు సిట్‌ను ఆదేశించింది. అదేవిధంగా ఈ పిటిషన్ల విచారణలో భాగంగా స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే కేసు దర్యాప్తు కొనసాగుతోందని సుప్రీంకోర్టు ధర్మాసనానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా స్టేటస్ రిపోర్టు దాఖలు చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని కోరారు.


**పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి**

ఫైలు నెం. ఇ1/12/2025-26, (టెండరు మరియు కొటేషన్ నోటీసు ప్రకటన) తేది: 05.08.2025

**పనుల సంఖ్య : 1, అంచనా వ్యయం:** రూ. 5.00 లక్షలు, **బిడ్ దాఖలు ప్రారంభ తేది:** 06.08.2025, ఉ. 11-30 గం.లు, **బిడ్ దాఖలు ముగింపు తేది:** 07.08.2025 మ.3-30 గం.లకు వివిధ అభివృద్ధి పనులు మరియు ఇతర నిర్వహణ పనులకు అవసరమగు Non-SSR Item లకు ధరలు ఏజెన్సీలు/ కాంట్రాక్టర్ల నుండి పై తేదీలలో కొటేషన్లు కోరనైనది. పూర్తి వివరముల కొరకు **మున్సిపల్ ఇంజనీర్ : 9581853956** ను సంప్రదించగలరు.

సం/- కమీషనర్, భువనగిరి మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 6080-PP/CL/ADVT/1/2025-26, Date: 05-08-2025

**మున్సిపాలిటీ కార్యాలయము - జల్పల్లి :: రంగారెడ్డి జిల్లా**

లేఖ నెం. E1/JLPM/Quotations/2025-26, (కొటేషన్ కొరకు ప్రకటన) తేది: 05.08.2025

జల్పల్లి మున్సిపాలిటీలో వివిధ పనుల రేట్ల సరఫరా మరియు డెలివరీ కోసం కాంట్రాక్టర్లు/ కన్సల్టెంట్లు/ ఏజెన్సీ నుండి సీల్ కొటేషన్లు ఆహ్వానించడమైనవి. తేది: 12-08-2025న లేదా అంతకు ముందు మధ్యాహ్నం 3.00 గంటల వరకు కింది స్పెసిఫికేషన్‌తో మరియు అదే కొటేషన్ అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు కొటేషన్‌దారు సమక్షంలో తెరవబడుతుంది. కమిషనర్ జల్పల్లి మున్సిపాలిటీకి ఎటువంటి కారణం లేకుండా ఏదైనా ఒక లేదా అన్ని కొటేషన్లను తిరస్కరించే హక్కు ఉంది.

షెడ్యూల్

**పని పేరు:** జల్పల్లి మున్సిపాలిటీలో వివిధ పనుల రేట్ల సరఫరా మరియు డెలివరీ

| క్ర.సం. | పని పేరు |
|---|---|
| 1. | పారిశుద్ధ్య సామగ్రి సరఫరా మరియు డెలివరీ |
| 2. | ఫాగింగ్ యంత్రాలు, మలాథిన్ ఆయిల్, ఆయిల్ బాల్స్ మరియు మొదలైన వాటి సరఫరా మరియు డెలివరీ |
| 3. | రెయిన్ కోర్టులు, సేఫ్టీ గేర్లు మరియు పరికరాలు మొదలైన వాటి సరఫరా మరియు డెలివరీ |
| 4. | టెంట్ హౌస్ మెటీరియల్స్ సరఫరా మరియు డెలివరీ |
| 5. | స్టేషనరీ & కంప్యూటర్ మెటీరియల్స్ సరఫరా మరియు డెలివరీ |
| 6. | ఫ్లెక్సీలు, బ్యానర్లు & ఆర్ట్ వర్క్స్ సరఫరా మరియు డెలివరీ |
| 7. | జాతీయ ఉత్సవ సామగ్రి సరఫరా మరియు డెలివరీ |
| 8. | గల్ఫర్ యంత్రాన్ని కార్మికులతో నిమగ్నం చేయండి |
| 9. | ఏదైనా ఇతర పదార్థాల సరఫరా మరియు డెలివరీ |

సం/- కమిషనర్ జల్పల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 6102-PP/CL/ADVT/1/2025-26, Date: 05-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## 16న పంచ జ్యోతిర్లింగ దర్శనానికి భారత్ గౌరవ్ రైలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచ జ్యోతిర్లింగ దర్శనం పర్యాటకుల కోసం భారత్ గౌరవ్ పేరుతో ప్రత్యేక పర్యాటక రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పి అర్ ఓ ఎ. శ్రీధర్ తెలిపారు.ఈ నెల 16న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనుంది. ఈ రైలు ద్వారా 9 రోజులు, 8 రాత్రులతో కూడిన పంచ జ్యోతిర్లింగ దర్శన యాత్ర కల్పిస్తున్నట్లు చెప్పారు. యాత్రలో భాగంగా మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్,త్రయంబకేశ్వర్, భీమశంకర్, గృష్ణే శ్వర్ ఉన్నాయి. 16న మధ్యాహ్నం2 గంటలకు రైలు సికింద్రాబాద్ నుంచి కామారెడ్డి ,నిజామాబాద్, ధర్మాబాద్, ముద్కేడ నాందే పూర్ణా మీదుగ ఉజ్జ యినికి ప్రయాణం కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ టికెట్ ధరలు ఎస్ ఎల్ రూ.14,700లు, 3 ఎసికి రూ.22,900లు, 2 ఎసి కి రూ.29,900ల నిర్ణయించారు. ప్యాకేజీలో రోజుకు మూడు భోజనాలు, వసతి, పర్యాటక రవాణా సౌకర్యాలతోపాటు ప్రతి బోగీలో ఐ అర్ సిటిసి సిబ్బంది అందుబా టులో ఉంటారని వెల్లడించారు.. హైదరాబాద్ వాసులు ఈ అవకాశం విని యోగించుకోవాలి ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



## ఇసి మొట్ట మొదట రద్దు చేయాల్సింది బిఆర్ఎస్ పార్టీనే

### కెటిఆర్‌పై ఎంపి మల్లు రవి ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని రాజకీయ పార్టీల గుర్తింపును రద్దు చేయాలనే అంశంపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటే మొట్ట మొదట రద్దు చేయాల్సింది బిఆర్ఎస్ గుర్తింపునేనని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయని రాజకీయ పార్టీల గుర్తింపును రద్దు చేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేయడంపై డాక్టర్ మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ, నీళ్లు, నిధులు, నియామకాలు, యువతకు ఉద్యో గాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెక రాల భూమి తదితర ఎన్నో హామీలను బిఆర్ఎస్ అమలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడి యాతో మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. కానీ ఇది ఒక్క బిఆర్ఎస్ పార్టీకి కనిపించడంలేదు. రూ.10 లక్షల బీమా, మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు, 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ, రైతు భరోసా రూ.12 వేలు, ఒకటిన్నర ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కూడా త్వరలో భర్తీ చేస్తాం. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, సోలార్ కరెంట్ ప్రాజెక్టులు ఇస్తున్నాం. మహిళలను కోటీశ్వ రులుగా చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారు. 90 శాతం హామీలు అమలు చేశాం. ఇలాంటి పార్టీపై మాట్లాడే అర్హత బిఆర్ఎస్ పార్టీకి లేదు' అని మల్లు రవి అన్నారు.

## జయశంకర్ సేవలు గుర్తుచేసుకున్న సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా జీవిత పర్యంతం గడిపిన ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన నిర్వి రామ కృషిని, సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని, ఆయన ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రొఫె సర్ జయశంకర్ స్వరాష్ట్ర కలల జెండాను భవిష్యత్ అజెండాను ఎన్నడూ వదలిపెట్టలేదన్నారు. తెలంగాణే శ్వాసగా, ధ్యాసగా, లక్ష్యంగా బతికారని, కోట్లాది సకల జనుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని సిఎం కొనియా డారు. తన జీవితం తెలంగాణకు అంకితం చేసిన గొప్ప పోరాటయోధు డని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఏవి ధంగా నష్టపోయారో గణాంకాలతో సహ ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ప్రొఫె సర్ జయశంకర్‌దేనని ముఖ్యమంత్రి కొనియాడారు.

## బిజెపి, బిఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలు

### సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విమర్శ

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ విషయంలో బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు అవకాశ రాజకీయాలకు పాల్పడుతున్నాయని, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటి విమర్శించింది. నేటికి బిజెపి పాలిత రాష్ట్రాలైన బీహార్ ఇతర రాష్ట్రాల్లో బిసిలు రిజర్వేషన్లను అనుభవిస్తున్నారని, రాష్ట్రంలో మాత్రం ఈ రెండు పార్టీలు ముస్లింలను చూపిస్తు కుంటి సాకులు చెపుతున్నాయని , ఆ పార్టీ అధికార ప్రతినిధులు సాదినేని వెంకటేశ్వర రావు, జె.వి.చెలపతిరావు విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లు,ఎస్ వర్గికరణ బిల్లులను ఆమోదానికి రాజ్యాంగ సవరణతో 9వ షెడ్యూల్ లో చేర్చి బేషరతుగా అమలు చేయాలని వారు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడులో 9వ షెడ్యూల్ అమలులో ఉంది, ఇబిసిలకు 10 శాతం రిజర్వేషన్ అమలులో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ద్వారా 9వ షెడ్యూల్‌ను వర్తింప జేసిన విషయాన్ని వెంకటేశ్వరరావు,చలపతిరావులు గుర్తు చేశారు. ఇప్పటికైనా బిసి సంఘాలు,వ్యక్తులు కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడికి ఐక్య ఆందోళనలను చేపట్టాలని వారు పిలుపునిచ్చారు.

## భారత్‌కు ట్రంప్ 24 గంటలు డెడ్‌లైన్

**న్యూయార్క్ :** ఉక్రేన్‌పై యుద్ధానికి ఆజ్యం పోస్తున్న భారత్‌పై రాబోయే ఇర వైనాలుగు గంటల్లో అతి భారీస్థాయిలో సుంకాలు పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. సిఎన్‌బిసి స్క్వాక్ బాక్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంగళవారంనాడు ట్రంప్ ఈ విషయం చెప్పారు. కొద్ది గంటల తేడాలో ట్రంప్ ఇలా చెప్పడం ఇది రెండోసారి. కానీ తాజా ప్రకటనలో 24 గంటలు డెడ్‌లైన్ విధించడమే మరో కొత్త విషయం. భార త్‌ను తమ ప్రయోజనాలకు మరింత అనుకూలంగా లొంగదీసుకోవడానికే ఆయన ఈ హెచ్చరిక జారీ చేస్తున్నారన్నది సుస్పష్టం. ''భారతదేశం ఒక మంచి వాణిజ్య భాగస్వామిగా ఉండటంలేదు, వారు మాతో చాలా వ్యాపారం చేస్తున్నారు, కానీ మేం ఆ దేశంతో వ్యాపారం చేయడం లేదు. అందువల్ల వారిపై 25 శాతం సుంకాలు విధించాం, కానీ రాబోయే 24 గంటల్లో ఈ సుంకాలను అతిభారీగా, అత్యధికంగా పెంచుతానని అనుకుం టున్నాను. ఎందుకంటే, ఆ దేశం రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తోంది, వారు ఉక్రేన్‌లో యుద్ధానికి ఆజ్యం పోస్తున్నారు. వారు అలాగే చేస్తూ పోతుంటే నేను ఎంతమాత్రం సంతోషంగా ఉండలేను'' అన్నారు. ''భారతదేశం గురించి ప్రజలు చెప్పడానికి ఇష్టపడని విషయం ఏమిటంటే, ఆ దేశం అత్యధికంగా టారిఫ్‌లు విధించే దేశం. ప్రపంచంలో ఏ దేశం కూడా వాళ్ళంత ఎక్కువగా టారిఫ్‌లు విధించదు, మేం వాళ్ళతో చాలా చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నాం, ఎందుకంటే అమెరికా సరుకులు దిగు మతి చేసుకున్నందుకు వారు విధించే సుంకాలు చాలా చాలా ఎక్కువ కాబట్టి..'' అని ట్రంప్ ఆరోపించారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై జరు గుతున్న చర్చల గురించి ప్రశ్నించగా, ఆ ఒప్పందం అనివార్యంగా జరుగు తుందనిపిస్తోంది, కానీ వారి టారిఫ్‌లు చాలా ఎక్కువ అని ఆయన దృఢంగా ఒకేమాట పదే పదే చెప్పారు. ''ఇప్పుడు నేను చెబుతు న్నాను...భారతదేశం ఇప్పటివరకూ అత్యధిక సుంకాల నుండి బయట పడింది, వారు మాకు జీరో టారిఫ్‌లు ఇవ్వొచ్చు...కానీ అది మాకు ఎంత మాత్రం సరిపోదు, ఎందుకంటే వారు రష్యాతో చమురు వ్యాపారం చేస్తు న్నారు, మొన్న బ్రెజిల్‌పై అతిభారీస్థాయిలో 50 శాతం సుంకాలను ట్రంప్ విధించారు. ఆ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ట్రంప్ తాజా ఆరోపణలు చేశారు. అదేవిధంగా భారత్‌పైన కూడా తీవ్ర ఆరోపణలు చేస్తూ సుంకాల హెచ్చరిక జారీ చేశారు. ఉక్రేన్‌లో వందలమంది మరణిస్తు న్నాగానీ భారత్‌కు పట్టడంలేదని, రష్యా నుండి ముడి చమురు కొనుగోలు చేసి శుద్ధిచేసి దానిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి రష్యాకు లాభాలు చేకూరుస్తుంటే రష్యా ఆ ధనంతో ఉక్రేన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తోందని ఈ విధంగా ఉక్రేన్‌లో యుద్ధానికి భారత్ ఆజ్యం పోస్తోందని ట్రంప్ సోమ వారం ఆరోపణలు చేశారు.

# అర్హులైన వారందరికీ కార్డులు

### రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### కార్డుల పంపిణీలో బిఆర్ఎస్ కాంగ్రెస్ మధ్య వాగ్వివాదం




**ప్రజాపక్షం/రంగారెడ్డి/మేడ్చెల్ మల్కాజ్‌గిరి :** రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన వారం దరికీ కార్డులు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్ర మలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మల్లాపూర్‌లోని వైఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,తెలంగాణ అర్బన్ ఇన్ ఫ్రస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర సింహారెడ్డి లతో కలిసి నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం పాలన సాగు తోందని, అందులో భాగంగా అర్హులైన పేదలకు రేషన్ కార్డులు జారీ చేయాలనే లక్ష్యంతో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో నెలకు రూ.61 కోట్ల 15 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ, పేదలకు అందించాలనే ఉద్దేశ్యంతో పెద్ద ఎత్తున రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలి పారు. జిల్లాలో 12 వేల కొత్త రేషన్ కార్డుల జారీతో సగ టున 50 వేల మందికి సన్నరకం బియ్యం అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు రేషన్ కార్డులు అందించడం నిరంతర ప్రక్రియ అని,ఇంకా అర్హులైన వారిని కూడా త్వరలో గుర్తించి కార్డులు ఇస్తామని,వడ్డీ లేని రుణాల పథకంతో మహిళ లకు కోట్ల రూపాయలు కేటాయించి,వారికి వ్యాపార నైపు ణ్యాలలో శిక్షణ అందించి ఇందిర మహిళా శక్తి ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ఆ తర్వాత నియోజకవర్గంలోని మహేశ్వరం,బాలాపూర్ మండలాల వారికి మంత్రి రేషన్ కార్డులు పంపిణీ చేసి,లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య, కందు కూరు ఆర్‌డిఓ రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**కార్డుల పంపిణీలో బిఆర్ఎస్ కాంగ్రెస్ మధ్య వాగ్వివాదం**

కాగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులను స్టేజి పైకి ఆహ్వా నించడాన్ని బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయ కులు అభ్యంతరం వ్యక్తం చేయగా...బిఆర్ఎస్ పార్టీ అధి కారంలో ఉన్నప్పుడు ఇదేవిధంగా వ్యవహరించారని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు ప్రతి వాదనకు దిగడంతో కొద్దిసేపు గందరగోళ వాతావ రణం నెలకొన్నది.

**మాది చేతల ప్రభుత్వమే, ఆరు గ్యారంటీలు అమలు చేసాం : మంత్రి దుద్దిళ్ల**

రాష్ట్రంలో అధికారం చేపట్టిన అనంతరం ఎన్నికల సమ యంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా నరవేర్చ టంలో తమ ప్రభుత్వం సఫలీకృతమైందని, వీటితో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయనున్నామని రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వం కాదన్న విషయం ప్రజలకు స్పష్టమైందన్నారు. మేడ్చల్ మండలం అత్వెల్లిలోని జిఎన్‌ఆర్ కన్వెన్షన్ హాలులో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి,జిల్లా కలె క్టర్ మనుచౌదరిలతో కల్సి మంగలవారం జిల్లాలో మంజూ రైన నూతనరేషన్ కార్డులను అందచేసారు.ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కార ణంగా రేషన్ కార్డుల కోసం దశాబ్ద కాలం పాటు పొంద లేక పోయారని, తమ ప్రభుత్వం రాగానే ముందస్తు హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టిందని, దీనిలోని భాగంగా మేడ్చల్ జిల్లాలో 40082 కొత్త రేషన్ కార్డులతో పాటు గతంలో ఉన్న రేషన్ కార్డుదారుల అభ్యర్థనల మేరకు కొత్త సభ్యుల జోడింపు లతో కూడిన 82 వేల సరికొత్త కార్డులను పంపిణీ చేసారు. రాజకీయాలకు అతీతంగా మేడ్చల్ జిల్లాలో త్వరలో 2 లక్షల రేషన్ కార్డులను లబ్దిదారులకు ఇవ్వనున్నామ న్నారు. గ్రేటర్ మహానగరంలో నీటి ఇబ్బందులు తలెత్త కుండా గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించేం దుకు పక్కా ప్రణాళికతో ముందుకు పోతున్నామనారు. డ్రైనేజితో పాటు పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించేం దుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ పథకం లోనూ రాజీ పడకుండా అర్హులను గుర్తించటంలో పారద ర్శకంగా వ్యవహరిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌ దరి మాట్లాడుతూ నూతన రేషన్ కార్డులతో పాటు పాత కార్డుల్లో మార్పు చేర్పుల కోసం జిల్లాలో అధిక మొత్తంలో ధరఖాస్తులు వచ్చాయని, ప్రతి నెలా జిల్లాలో 618 రేషన్ కార్డుల ద్వారా 15 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ప్రతి నెలా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొను గోలుకు ఐకెపి మహిళా సంఘాలకు అప్పచెప్పటం ద్వారా ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. అనంతరం కోటి రూపాయల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజ యేందర్‌రెడ్డి,కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ అధికారి శ్రీనివాసరెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరి రెడ్డి తదితర అధికారులు, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ తది తరులు పాల్గొన్నారు.



## తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన అగ్రగణ్యుడు గద్దర్

### సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్థంతిని పురస్కరించుకుని ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని, ఆయ నతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్య సించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారిం చకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభిం చాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని ముఖ్యమంత్రి కొని యాడారు. పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని, పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని సిఎం అన్నారు. గద్దర్ చేసిన సాంస్కృతిక, సాహితీ సేవలకు గుర్తింపుగా జూన్ 14వ తేదీన గద్దర్ పేరిట తెలంగాణ ఫిల్మ్ అవార్డులను సినీ కళాకారులకు, సినీ ప్రముఖులకు అందించామన్నారు. గద్దర్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, ఆయన ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.




## కూచారం పారిశ్రామికవాడలో కెమికల్ గ్యాస్ పైప్ లీకేజీ

### అస్వస్థతకు గురైన 8 మంది కార్మికులు

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కూచారం పారిశ్రామిక వాడలో ఉన్న శ్రేయన్స్ ల్యాబ్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం ఉదయం ఒక్కసారిగా కెమికల్ పైపు లీక్ కావడంతో 8 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మి కులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కాగా,ఇది గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై కార్మికులను అంబులెన్స్ సహాయంతో ఆస్పత్రికి తర లించా రు. పరిశ్రమ యాజమాన్యం గ్యాస్ లీక్ అయిన పైపును వెంటనే సరి చేసి ఎవరికి ఎలాంటి ప్రాణహాని కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలి పా రు. ఇది ఇలా ఉండగా గత కొన్ని రోజులుగా పరిశ్రమలో ఇదే సమస్య కొనసాగుతుండడంతో పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న చెట్లు పూర్తిగా దెబ్బ తి న్నాయని, కెమికల్ దుర్వాసన వల్ల పరిసర ప్రాంత ప్రజలు కూడా శ్వాస సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలిపారు.సంబం ధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎలా జోక్యం చేసుకుంటారు?

### భూదాన్ ల్యాండ్ వివాదంలో కానిస్టేబుల్‌ను నిలదీసిన హైకోర్టు : ఇలాగే ఉంటే సస్పెన్షన్‌కు ఉత్తర్వులు ఇస్తామని హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా నాగారంలోని భూదాన్ భూముల వ్యవహారాల్లో ఎలా జోక్యం చేసుకుంటాని పోలీసులను హైకోర్టు నిలదీసింది. ఇదే తీరుగా మళ్లీ జోక్యం చేసుకుంటే సస్పెన్షన్‌కు ఆదేశిస్తామని హెచ్చరించింది. పిటిషనర్‌ను బెదిరించడం, హైకోర్టులోని పిటిషన్‌ను వాపస్ తీసుకోవాలని ఒత్తిడి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని నొక్కి చెప్పింది. కేసు ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తేవడం చేస్తే కఠిన నిర్ణయాలు ఉంటాయంది. నాగారంలోని భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అక్రమంగా తమ పేరిట పట్టా పొందారని, ఈ దీనిపై ఎంక్వయిరీ కమిషన్‌తో విచారణకు ఆదేశించాలంటూ పడమటి తండాకు చెందిన రాములు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును వాపస్ తీసుకోవాలంటూ పోలీసులు తనను పోలీసులు బెదిరిస్తున్నారంటూ



తాజాగా మరో పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ కె.లక్ష్మ ణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్‌కు ఫోన్ చేసిన మహేశ్వరం పోలీస్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును కోర్టుకు స్వయంగా హాజరుకావాలని ఆదేశించారు. మంగళవారం జరిగిన విచారణకు కానిస్టేబుల్ స్వయంగా హాజరయ్యారు. పిటిషనర్ రాములుకు ఫోన్ చేశావా.. ఎవరు చేయమంటే చేశావు.. పిటిషన్‌ను వాపస్ తీసుకోవాలని బెదిరించావా.. అని కానిస్టేబుల్‌ను హైకోర్టు ప్రశ్నించింది. విలేజీ హిస్టరీ రికార్డు నమోదులో భాగంగా రాములుకు ఫోన్ చేశారని కానిస్టేబుల్ బదులిచ్చారు. ఎస్‌హెచ్‌వో ఆదేశాల మేరకే ఫోన్ చేసినట్లు చెప్పారు. కోర్టులోని పిటిషన్ గురించి ఏమీ మాట్లాడలేదన్నారు. దీనిపై హైకోర్టు, మరోసారి బెదిరించినట్లు తెలిస్తే సస్పెన్షన్ ఉత్తర్వులు ఇస్తామని హెచ్చరించింది. సుమారు 25 మంది ఐఏఎస్/ఐపీఎస్ అధికారులకు చెందిన వ్యవహారమని, ఇది దేశవ్యాప్తంగా చర్చ సాగుతోందని, ఈ విషయంలో పోలీసులు తలదూరిస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని కూడా హెచ్చరించింది. ఇక మీద పోలీసులు పిటిషనర్ విషయంలో జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలని లాయర్ విజయలక్ష్మి కోరగా, తామిచ్చిన హెచ్చరికలు సరిపోతాయని, రాతపూర్వక ఆదేశాలు అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. బెదిరింపులకు సంబంధించిన పిటిషన్‌పై విచారణను ముగించింది.

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ

# పార్లమెంటులో చట్టం చేయాలి




### ఇందిరాపార్కు వద్ద సిపిఐ(ఎం) మహాధర్నా


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ అధ్వ ర్యంలో మంగళవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి జాన్‌వెస్లీ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేప థ్యంలో బిసి రిజర్వేషన్ల బిల్లును తక్షణమే సభలో పెట్టి చట్టం చేయాలని డిమాండ్ చేశాడు. బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదా నికి కేంద్రంపై, ప్రధాని మోడీపై ఒత్తిడి తేవాలనీ, లేదంటే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఒత్తిడి తేవాలని లేకపోతే వారంతా రాజీనామా చేసి ఇంట్లో కూర్చో వాలని డిమాండ్ చేశారు.బిజెపి చేరిన ఆర్ కృష్ణయ్య, సామా జిక న్యాయం కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగ స్పందించాలనీ, కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. బిసి లకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుతోపాటు ఆర్డినెన్స్ ను సమర్థిస్తున్నామని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మి నేని వీరభద్రం చెప్పారు. ఢిల్లీకి అన్ని శక్తులనూ తీసుకెళ్లి కేంద్రంపై రాజకీయ ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను న్యాయ వరిశీలన పేరుతో కావాలనే నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నా రని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య విమర్శిం చారు.తెలంగాణకు చెందిన ఎనిమిది మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్రమంత్రులు బిసి రిజర్వేషన్ల బిల్లుపై ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి ప్రశ్నిం చారు.ఈ ధర్నాలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంఎ ల్‌ఎ జూలకంటి రంగారెడ్డి , టి సాగర్, మల్లు లక్ష్మి, బందారు. రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, ఆర్ శ్రీరాంనాయక్, ఆర్.అరుణజ్యోతి, అశయ్య, ఉడుత రవీం దర్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, రంగారెడ్డి జిల్లా కార్య దర్శి పగడాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి ఏర్పాట్లు

### కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నంగు నూర్‌మండలం నర్మెట్టలో నిర్మించిన అయిల్‌ఫా మ్ ఫ్యాక్టరీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ హైమావతి తె లి పారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ న ర్మెట్ట 300 కోట్లతో నిర్మిస్తున్న అయిల్‌ఫామ్ ఫ్యాక్ట రీని సందర్శించి, ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరి శీలించారు. అనంతరం ఉద్యానవన శాఖ, అయిల్ ఫెడ్, రెవెన్యూ, విద్యుత్ ఆర్‌అండ్‌బి, పం చాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమా వేశం నిర్వహించి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు త్వరగా పూ ర్తి చేయాలని సూచించారు. టెంపవరీ హెలిప్యా డ్ నిర్మించాలని, ముంద్రాయి నుండి నంగునూర్ వరకు రోడ్డు కు ఇరువైపుల చిన్న చిన్న పొదలను తొలగించి క్లియర్ చేయాలన్నారు. ఫ్యాక్టరీ అప్రో చ్ రోడ్డు, ఫ్యాక్టరీ లోపల రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఫ్యాక్టరీలో భూమిని చదును చేసి రో డ్డు వెంట మొక్కలను నాటాలని, బహిరంగ సభ ఏర్పాటు కోసం వాహనాల పార్కింగ్ ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం అతిథుల ఆహ్వానం, స్టేజీ డెకరేషన్, స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అయిల్ ఫామ్ రైతుల విజయగాథలు, అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ని ర్మాణం పైన వీడియోల ప్రదర్శన, నిరంతర వి ద్యుత్ సరఫరా విఐపిలకు సభకు వచ్చే రైతులకు వసతులు తదితర ఏర్పాట్లను పక్కాగా వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా ఉద్యానవన శా ఖ అధికారి సువర్ణ,అయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, పామాయిల్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా వ్య వ సాయాధికారి స్వరూప, ఎస్ఐ ఎలక్ట్రిసిటి, ఇఇ పంచాయతీరాజ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి డిఈ, నంగునూర్ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కశ్మీర్‌లో భారీగా ఆయుధాల పట్టివేత

**కశ్మీర్:** జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు ఎడతెరిపి లేకుండా ఆపరేషన్లు చేపడుతున్నాయి. తాజాగా కుప్వారా ప్రాంతంలో ఉగ్ర స్థావరాన్ని గుర్తించాయి. దీనిలో పెద్దసంఖ్యలో ఆయుధాలు ఉన్నాయి. ఈ ఆపరేషన్‌కు నాగ్నిటాప్ అని పేరుపెట్టారు. పక్కా సమాచారం మేరకు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, బీఎస్ఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. ఇక్కడ ఒక తుపాకీ, 12 గ్రనేడ్లు, రెండు మ్యాగ్జైన్‌లు, ఇతర పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నాయి. కుల్గాంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆపరేషన్ అఖాల్‌లో ఇప్పటివరకు ముగ్గురు ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టిన విషయం తెలిసిందే. ఐదో రోజు కూడా ఇది కొనసాగుతోంది. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో పహల్గాం నరమేధానికి పాల్పడిన ఉగ్రమూకను మట్టుపెట్టిన కొన్ని రోజుల్లోనే ఈ సైనిక చర్యలు చోటుచేసుకోవడం గమనార్హం. జులై 30వ తేదీన ఆపరేషన్ శివశక్తిలో ఇద్దరు చొరబాటుదారులను భద్రతా దళాలు హతమార్చాయి. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ ఆయుధ డంప్ దొరకడం గమనార్హం.

## భారత్-ఫిలిపీన్స్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

### ఇరు దేశాల నడుమ తొమ్మిది ఒప్పందాలపై సంతకం



**న్యూఢిల్లీ :** భారత్ – ఫిలిప్పీన్స్ దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యం ఖరారైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్ మధ్య ఢిల్లీలో జరిగిన చర్చల తర్వాత మంగళవారం దీనిపై ప్రకటన వెలువడింది. ఒక రోజు ముందు రెండు దేశాల నావికాదళాలు ఫిలిప్పీన్స్ తీరం వద్ద సంయుక్త విన్యాసాలు నిర్వహించాయి. రెండు దేశాలు తొమ్మిది ఒప్పందాలపై సంతకాలు చేశాయి. వీటిలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించడం, అమలుచేయడం, రెండు దేశాల సైనిక, వాయుసేన, నావికాదళాల మధ్య చర్చలకు సంబంధించిన నియమ నిబంధనలు మరియు అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం వంటి అంశాలపై సహకారం వంటివి ఉన్నాయి. భాగస్వామ్యంపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ ఇరు దేశాలు ఒకరికొకరు స్వచ్ఛందంగా ఎంచుకున్న మిత్రులు అని, విధి నిర్ణయించిన భాగస్వాములు అని పేర్కొన్నారు. ఉభయ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని, దీంతో సాయుధ బలగాల మధ్య పరస్పర సహకారంపై మరింత దృష్టి సారించనున్నాయని తెలిపారు. హిందూ మహాసముద్రం నుంచి పసిఫిక్ మహాసముద్రం వరకు, తాము ఉమ్మడి విలువలతో ఐక్యంగా ఉన్నామని, ఇది కేవలం గతం నుంచి వచ్చిన స్నేహం కాదు, భవిష్యత్తుకు ఒక వాగ్దానమని మార్కోస్ జూనియర్‌తో వెంట ఉండగా మోదీ పేర్కొన్నారు.

ఫిలిప్పీన్స్ భారత్ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ', 'మహాసాగర్' (ప్రాంతాలవ్యాప్తంగా భద్రత,అభివృద్ధి కోసం పరస్పర సంపూర్ణ ముందడుగు) దృష్టిలో ఒక ముఖ్యమైన భాగస్వామి అని ప్రధానమంత్రి అన్నారు. 'ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, శ్రేయస్సు, నియమాల ఆధారిత వ్యవస్థకు మేము కట్టుబడి ఉన్నాము. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నావిగేషన్ స్వేచ్ఛకు మేము మద్దతు ఇస్తున్నాము' అని మోదీ చెప్పారు. భారత్, ఫిలిప్పీన్స్ దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఇరు దేశాల నాయకులు ఒక తపాలా బిళ్లను విడుదల చేసి ఈ సందర్భాన్ని స్మరించుకున్నారు. ఏప్రిల్ 22న 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు, ఉగ్రవాదంపై పోరాటంలో భారత్కు మద్దతు ఇచ్చినందుకు ఫిలిప్పీన్స్ ప్రభుత్వానికి మోదీ ధన్యవాదాలు తెలిపారు.'ఈ రోజు, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు భారత్‌లో ఉన్నప్పుడు, భారత నౌకాదళానికి చెందిన మూడు నౌకలు మొదటిసారిగా ఫిలిప్పీన్స్‌లోన్లి ఒక నావికా విన్యాసంలో పాల్గొంటున్నాయి' అని మోదీ అన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం నిరంతరాయంగా పెరుగుతోందని,3 బిలియన్‌ల డాలర్‌లను దాటిందని ప్రధానమంత్రి చెప్పారు.

# ఉభయసభలను కుదిపేసిన ఆందోళనలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయసభలను మంగళవారంనాడు కూడా ప్రతిపక్షాల ఆందోళనలు కుదిపేశాయి. బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇతర అంశాలపై చర్చ చేపట్టాలని విపక్ష ఎంపిలు పట్టుబట్టారు. అదే కాకుండా రాజ్యసభలో గత వారం సిఐఎస్ఎఫ్ బలగాలను వినియోగించడంపై తీవ్రంగా మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఆందోళనకు దిగారు. ఈ ఆందోళన నేపథ్యంలో ఉభయసభల్లోనూ వాయిదాల పర్వ కొనసాగింది. పరిస్థితిలో ఏ మాత్రం మార్పు కనిపించకపోవడంతో సభలను బుధవారానికి స్పీకర్, చైర్మన్ వాయిదా వేశారు. లోక్‌సభ మంగళవారం ఉదయం ప్రారంభం కాగానే బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఇతర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు చేసిన తీవ్ర నిరసనల కారణంగా లోక్‌సభ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు, స్పీకర్ ఓం బిర్లా మొదట సోమవారం మరణించిన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్‌తో సహా ముగ్గురు మాజీ సభ్యులకు నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష ఎంపిలు తమ స్థానాల్లో నుంచి లేచి నిలబడి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. నిరసనల మధ్య, స్పీకర్ సభను నడపడానికి ప్రయత్నించారు. లడాఖ్‌లోని ప్రత్యక్ష ప్రయోజన పథకాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించిన రెండు ప్రశ్నలను ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడగడానికి అనుమతించారు. నిరసనలు తీవ్రమవడంతో, ప్రతిపక్షం తన మాట వినడం లే దని, పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ తమ నిరసనలను కొనసాగిస్తున్నట్లు స్పీకర్ చెప్పారు. సభ సజావుగా సాగడానికి ప్రతిపక్షాలకు ఆసక్తి లేదని, వారి ప్రవర్తన, కార్యకలాపాలు సభ గౌరవాన్ని తగ్గించాయన్నారు. అయితే, ప్రతిపక్షం స్పీకర్ విజ్ఞప్తిని పట్టించుకోలేదు, దాదాపు 25 నిమిషాల పనివేళల తర్వాత మధ్యాహ్నం 2 గంటల వరకు సభను వాయిదా వేశారు.

### సిఐఎస్ఎఫ్ సిబ్బంది మోహరింపుపై ప్రతిపక్షాల నిరసన

రాజ్యసభలో గత వారం సిఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరింపజేశారని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. అయితే ప్రతిపక్షాల వాదనను చైర్మన్, ప్రభుత్వం రెండూ తీవ్రంగా తిరస్కరించాయి. సిబ్బంది పార్లమెంటరీ భద్రతా సేవలకు చెందినవారని అన్నారు. ఉదయం సెషన్ (జీరో అవర్) సమయంలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు చేసిన నిరసనలు మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేయడానికి దారితీశాయి. జీరో అవర్ (ఉదయం సెషన్) సమయంలో ఎజెండాను ప్రవేశపెట్టిన వెంటనే, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే తనకు రాసిన లేఖను మీడియాతో పంచుకున్నారని విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం నాటి లేఖలో, సిఐఎస్ఎఫ్ సిబ్బందిని సభలో మోహరించారని, ప్రతిపక్ష నాయకులు తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించకుండా నిరోధిస్తున్నారని ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే లేఖను ప్రస్తావిస్తూ, అటువంటి సమాచారాలు ప్రత్యేక హక్కుల వర్గంలోకి వస్తాయని, దానిని మీడియాతో పంచుకున్నారని హరివంశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ప్రతిపక్ష నాయకుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఖర్గే, సభ్యుల ప్రయోజనం కోసం ఈ లేఖపై ప్రెస్ నోట్ విడుదల చేసినట్లు చెప్పారు. ప్రతిపక్షం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతోందని, దానిని కొనసాగిస్తుందని ఖర్గే స్పష్టం చేశారు. సిఐఎస్ఎఫ్‌ను సభలోకి తీసుకువస్తున్నారని, తాము ఉగ్రవాదులమా అని ఖర్గే ప్రశ్నించారు. కోలాహలం మధ్య, సమావేశాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ముందుగా, సభ నియమం 267 కింద 34 వాయిదా నోటీసులను డిప్యూటీ చైర్మన్ తిరస్కరించారు.

## సువేందు అధికారి కాన్వాయ్‌పై దాడి

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి కాన్వాయ్‌పై కొందరు దుండగులు మంగళవారం దాడి చేశారు. రాష్ట్రంలోని కూచ్ బిహార్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సమయంలో కొందరు దుండగులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు విసిరారు. ఇటీవల తమ పార్టీ నాయకులపై జరిగిన దాడులకు సంబంధించిన నివేదికలను జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో సమర్పించేందుకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఇదే సమయంలో ప్రభుత్వానికి చెందిన నేతలు ఇక్కడ నిరసనలు వ్యక్తం చేశారు.

## పార్లమెంటు ఆవరణలో 'సర్'పై ఇండియా కూటమి నిరసన




కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో సహా ఇండియా కూటమిలోని పలు పార్టీల ఎంపిలు మంగళవారం పార్లమెంటు ఆవరణలో నిరసన చేపట్టారు. బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా సవరణపై నిరసన వ్యక్తం చేస్తూ, దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)కు వ్యతిరేకంగా బ్యానర్లు, పోస్టర్లతో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంటులోని మకర ద్వార్ సమీపంలో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ మరణం కారణంగా సోమవారం ఒక రోజు విరామం మినహా, మంగళవారం విపక్షాలు సర్‌కు వ్యతిరేకంగా చేసిన నిరసనలు వరుసగా పదవ రోజుకు చేరుకున్నాయి.

## రాహుల్‌పై సుప్రీం అనవసర వ్యాఖ్యలు: ఇండియా



సుప్రీం కోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఇండియా కూ టమి నేతలు అండగా నిలిచారు. సైన్యంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల గురించి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు 'అవసరం లేనివి' అని ఇండియా కూటమి పార్టీలు పేర్కొన్నాయి. జాతీయ ప్రయోజనాలపై వ్యాఖ్యానించడం రాజకీయ పార్టీల బాధ్యత అని నొక్కి చెప్పాయి. ఇండియా కూటమికి చెందిన పలు పార్టీల ఫ్లోర్ లీడర్లు ఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. 'రాజకీయ పార్టీల ప్రజాస్వామిక హక్కులపై ప్రస్తుత న్యాయమూర్తి చేసిన అసాధారణ వ్యాఖ్యలు అనవసరమని ఇండియా కూటమిలోని అన్ని పార్టీల నాయకులు ఏకీభవించారు' అని కాంగ్రెస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ భేటీలో సుప్రియా సూలే(ఎన్‌సిపి ఎస్‌పి), కనిమొళి (డిఎంకె), పి.సందోశ్‌కుమార్ (సిపిఐ), జా న్ బ్రిట్టాస్(సిపిఐ(ఎం), సంజయ్ రౌత్ (శివసేన యుబిటి), తదితరులు పాల్గొన్నారు.

**రాహుల్‌కు భద్రత బలగాలపై గౌరవం : ప్రియాంక**

రాహుల్‌కు భారత భద్రతా బలగాలపై గొప్ప గౌరవం ఉందని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఆయనకు ఉందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యల గురించి పార్లమెంటు ఆవరణలో విలేకరులు అడిగినప్పుడు ఆమె స్పందిస్తూ' సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు గౌరవంతో చెబుతున్నాను, ఎవరు నిజమైన భారతీయుడో వారు నిర్ణయించరు. ప్రశ్నలు అడగడం, ప్రభుత్వాన్ని సవాలు చేయ డం ప్రతిపక్ష నాయకుడి పని, అది ఆ యన కర్తవ్యం' అని పేర్కొన్నారు.

## మనీలాండరింగ్ కేసులో విచారణ కోసం.. ఇడి ముందు రిలయన్స్ గ్రూప్ చైర్మన్ హాజరు

### రూ. కోట్ల విలువైన బహుళజాతి రుణమోసం కేసులలో మనీలాండరింగ్ అభియోగాలు నమోదు

### ఉదయం 10-55 గంటలకు ఎలక్ట్రానిక్ వాహనంలో 'ఇడి ఆఫీస్'కు చేరుకున్న అనిల్ అంబానీ



**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ కేసులో విచారణ కోసం మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ముందు రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ హాజరయ్యారు. కోట్లాది రూపాయల విలువైన బహుళజాతి రుణ మోసం కేసులలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న అభియోగాలు నమోదు అయ్యాయి. దాదాపు ఉదయం 1050గంటలకు ఎలాక్ట్రానిక్ వాహనంలో సెంట్రల్ ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి అనిల్ అంబానీ విచారణ కోసం హాజరయ్యారు. 66ఏళ్ల వ్యాపారవేత్త స్టేట్‌మెంట్‌ను ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) కింద రికార్డు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. జులై 24న 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంగణాలలో అతని వ్యాపార గ్రూప్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్స్ సహా 25మంది వ్యక్తులపై ఇడి సోదాలు జరిపిన తర్వాత సమన్లు జారీ చేసింది. పెద్ద బ్యాంక్ మోసం కేసులలో ప్రామాణిక ఆపరేటింగ్ విధానం ప్రకారం అనిల్ అంబానీపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఒసి)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటిఫై చేసింది. ఈ దర్యాప్తులో భాగంగా ఈ వారం విచారణకు హాజరు కావాల్సిందిగా అంబానీ గ్రూప్‌లోని ఎగ్జిక్యూటివ్‌లకు కూడా సమన్లు జారీచేశారు. సంబంధిత కేసులో అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీకి రూ.68కోట్ల ఫేక్ బ్యాంక్ గ్యారెంటీని అందించారనే ఆరోపణలపై ఒడిశాకు చెందిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సారథి బిస్వాల్‌ను ఇడి ఇటీవల అరెస్ట్ చేసింది. అంబానీని ప్రశ్నించే సమయంలో బిస్వాల్ కూడా ఎదుర్కొనే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. ఆర్థిక అవకతవకలు, సామూహిక రుణ మళ్లింపు రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా అనిల్ అంబానీకి చెందిన బహుళ గ్రూప్ కంపెనీలకు రూ.17,000 కోట్ల మేరకు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి అంబానీకి వ్యతిరేకంగా ఇడి చర్యలో భాగంగా ఈ విచారణ జరుగుతోంది. 2017నుంచి 2019మధ్య అంబానీ గ్రూప్ కంపెనీలకు 'యెస్' ('వైఇఎస్) బ్యాంక్ ఇచ్చిన రుణం దాదాపు రూ.3,000కోట్లు అక్రమ రుణ మళ్లింపు చేశారన్నది మొదటి అభియోగం. మంజూరు చేయడానికి ముందు యెస్ బ్యాంక్ ప్రమోటర్లు వారి కంపెనీల నుంచి డబ్బు తీసుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనుమానిస్తున్నదని సంబంధిత వర్గాలు తెలిపాయి. లంచం, రుణం మధ్య ఉన్న సంబంధాన్ని ఇడి దర్యాప్తు చేస్తోంది. ఈ కంపెనీలకు 'యెస్' బ్యాంక్ ఆమోదాలకు సంబంధించి 'స్థూల ఆరోపణలపై' కూడా ఇడి దర్యాప్తు చేస్తున్నదని ఆ వర్గాలు తెలిపాయి. ఈ రుణాలను అనేక గ్రూప్ కంపెనీలకు , నకిలీ కంపెనీలకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మనీలాండరింగ్ కేసు కనీసం రెండు సిబిఐ ఎఫ్ఐఆర్‌ల నుంచి వచ్చింది.నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజెస్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెబీ),నేషనల్ ఫైనాన్సింగ్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఇడితో నివేదికలను షేర్ చేసుకున్నట్లు వారు చెప్పారు. బ్యాంక్‌లు, వాటాదారులు, పెట్టుబడిదారులు ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేయడం ద్వారా ప్రభుత్వ డబ్బును మళ్లించడానికి లేదా స్వాహా చేయడానికి బాగా ప్రణాళికాబద్ధంగా, ఆలోచనాత్మకంగా పథకం రూపొందించినట్లు ఈ నివేదికలు సూచిస్తున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. రిలయన్స్ (ఆర్)ఇన్‌ఫ్రా ఇంటర్ కార్పొరేట్ డిపాజిట్లుగా మారురూపంలో ఉన్న నిధులను సిఎల్‌ఇ కంపెనీ పేరుతో రిలయన్స్ గ్రూప్స్ కంపెనీలకు మళ్లించినారన్న సెబీ నివేదిక ఆధారంగా ఇడి మరొక ఆరోపణపై దర్యాప్తు చేసున్నదని అధికారవర్గాలు వెల్లడించాయి.

## రాష్ట్ర హోదా కోసం జమ్మూకశ్మీర్‌లో భారీ ప్రదర్శనలు

### రోడ్డెక్కిన కాంగ్రెస్, ఎన్‌సి, పిడిపి శ్రేణులు

**జమ్మూ:** జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఆర్టికల్ 370 కింద పూర్వ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను రద్దు చేసి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఈ నిరసనలు జరిగాయి. 2019లో రాష్ట్ర హోదాను రద్దు చేయడాన్ని ఖండిస్తూ, జమ్మూకు చెందిన వివిధ సామాజిక, రాజకీయ పార్టీల సమూహం ఆల్ పార్టీస్ యునైటెడ్ మోర్చా (ఎపియూఎం) తో పాటు మూడు పార్టీలు ఆగస్టు 5ను 'బ్లాక్ డే'గా పాటించాయి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్ భల్లా, మాజీమంత్రి లాల్ సింగ్, తరంజిత్ సింగ్ టోనీతో కలిసి నగరం నడిబొడ్డున ఉన్న తావి వంతెన వద్ద చివరి డోగ్రా పాలకుడు మహారాజా హరి సింగ్ విగ్రహానికి పూలమాల వేయడానికి క్రేన్‌ను ఉపయోగించారు. ఈ నిరసనకు నాయకత్వం వహిస్తున్న భల్లా విలేకరులతో మాట్లాడుతూ 'ఈ రోజు బ్లాక్ డే నిరసన 'హమారీ రియాసత్ హమారా హక్' అధ్వర్యంలో జరుగుతున్న ప్రచారంలో భాగంగా ఉంది. దీనిని ఆగస్టు 5, 2019న బీజేపీ నాశనం చేసిన ఈ చారిత్రాత్మక డోగ్రా రాష్ట్రం గౌరవం, కీర్తిని పునరుద్ధరించాలని కోరుతూ' అని తెలిపారు. బీజేపీ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికయిన ప్రభుత్వాన్ని అణగదొక్కిందని, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కార్యాలయం నుంచి 'రిమోట్ కంట్రోల్' ద్వారా వ్యవహారాలను నడుపుతోందని ఆ పార్టీ జమ్మూకశ్మీర్ ముఖ్య ప్రతినిధి రవీందర్ శర్మ అన్నారు. 'గత సంవత్సరం సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కానీ ప్రజాదరణ పొందిన ప్రభుత్వాన్ని పని చేసేందుకు అనుమతించడం లేదు. వారు ఎన్నికల్లో ఓడిపోయారు. కానీ ఇప్పటికీ ఎల్జీ కార్యాలయం ద్వారా ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ద్వంద్వ పాలన ఫలితంగా, ప్రజలు బాధపడుతున్నారు' అని అన్నారు. సుప్రీం కోర్టు 'వీలైనంత త్వరగా' జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆదేశించిందని, అయితే ఆ ఉత్తర్వు వెలువడిన 10 నెలల తర్వాత కూడా కేంద్రం రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ఇష్టపడటం లేదని ఆయన అన్నారు. 'హమారీ రియాసత్ హమారా హక్' అధ్వర్యంలో పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలనే మా డిమాండ్ బీజేపీకి మద్దతును కూడగట్టడానికి, దానిని బహిర్గతం చేయడానికి కొనసాగుతుంది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో బీజేపీ కారణం తెలుసుకుని జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరిస్తుందని ఆశిస్తూ ఆగస్టు 9 నుంచి 21 వరకు మేము నిరాహార దీక్షకు దిగుతున్నాము' అని చెప్పారు. కాంగ్రెస్ అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలలో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించింది. రాజౌరిలో ర్యాలీని నిర్వహించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ఇఫ్తిఖర్ అహ్మద్, అనేక మందిని కొద్దిసేపు అదుపులోకి తీసుకున్నారు. ప్రావిన్షియల్ అధ్యక్షుడు రత్తన్ లాల్ గుప్తా నేతత్వంలోని పాలక నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) కార్యకర్తలు జమ్మూలోని రెసిడెన్సీ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం వెలుపల నిరసన చేపట్టారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో నిరసనకారులు తమ ప్రదర్శనను విరమించుకుని పార్టీ కార్యాలయానికి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. నగరంలోని గాంధీ నగర్ ప్రాంతంలోని పార్టీ ప్రధాన కార్యాలయం వెలుపల పీడీపీ కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించే తీర్మానానికి పార్లమెంట్ మంగళవారం ఆమోదం తెలిపింది. బీహార్‌లో ఎస్ఐఆర్‌పై చర్చ జరపాలంటూ ప్రతిపక్షాల ఆందోళనల మధ్య గతవారం లోక్‌సభ ఈ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కోర్టు తీర్పు కారణంగా మణిపూర్‌లో రెండు జాతుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయని చెప్పుకొచ్చారు. మతహింస అని కొందరు పేర్కొంటున్నారని, అది తప్పని అన్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించి ఎనిమిది నెలలు అవుతోందని, ఈ సమయంలో ఒకే ఒక్క హింసాత్మక ఘటన మాత్రమే నమోదైందని అన్నారు. అనంతరం రాజ్యసభ మూజువాణి ఓటుతో తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ఆమోదించడం 'రాజ్యాంగ బాధ్యత' అని చైర్మన్ హరివంశ్ తెలిపారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు విధించిన ఎనిమిది నెలల గడువు ఆగస్ట్ 13తో ముగియనుంది.

## ట్రంప్‌మోదీ స్నేహానికి తప్పని మూల్యం: జైరాం రమేశ్

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ప్రత్యేకమైనదిగా ఆర్భాటం చేసిన స్నేహం కారణంగా భారత్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం మండిపడ్డారు. కేంద్ర విదేశాంగ శాఖ తాజా ప్రకటనతో అమెరికాభారత్ మధ్య సంబంధాలు క్షీణించాయని స్పష్టమైందని అన్నారు. క్యాప్ చైనా, అమెరికా, పాకిస్థాన్ దేశాలు భారత్‌కు పెద్ద సవాల్‌గా మారాయని వ్యాఖ్యానించారు. 'దోస్త్ దోస్త్ నా రహా' అన్న పాత హిందీ పాటను ప్రధాని మోదీకి ఎక్స్ మాధ్యమంగా జైరాం రమేశ్ గుర్తుచేశారు. ట్రంప్‌తో మోదీ మైత్రిపై వ్యంగాస్త్రాలు సంధించారు.

## క్రిమినల్ కేసుగా సివిల్ కేసా?

### అలహాబాద్ హైకోర్టుపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ:** అలహాబాద్ హైకోర్టుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల ఓ సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మారుస్తూ... అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తప్పులతడకగా పేర్కొంది. సివిల్ కేసు పరిష్కారానికి సమయం పడుతుందనే కారణంతో సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలను హైకోర్టు సమర్థించడం పట్ల అసహనం వ్యక్తం చేసింది. ఈ చర్యలు న్యాయస్థానం తనకున్న హక్కులను దుర్వినియోగం చేయడమేనని అభిప్రాయపడింది. సివిల్ సమస్యలను పరిష్కరించడానికి క్రిమినల్ చట్టాలు ఉపయోగించలేమనే చట్టపరమైన నిబంధనలను, రెండు కేసుల మధ్య ఉన్న వ్యత్యాసాలను హైకోర్టు అర్థం చేసుకుంటుందని తాము ఆశించినట్లు ధర్మాసనం పేర్కొంది. ఇకపై న్యాయమూర్తులు తీర్పులు ఇచ్చే సమయంలో ఇలాంటి అతిక్రమణలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని అలహాబాద్ హైకోర్టును సుప్రీం కోర్టు ఆదేశించింది. సంబంధిత న్యాయమూర్తి ఆ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించింది. అంతేకాకుండా ఆ తీర్పు వెలువరించిన న్యాయమూర్తి పదవీ విరమణ చేసే వరకు ఆయనకు ఎటువంటి క్రిమినల్ కేసులు కేటాయించకుండా చూసుకోవాలని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది.

**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా, వేలేరు మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి సంబంధించిన పట్టా భూమి పాస్ బుక్ గత జూన్ నెలలో **శివరాత్రి కృష్ణస్వామి** మల్కాపూర్ నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా పట్టాభూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఖాతా నెంబర్: 60227, **పట్టా పాసు బుక్ నెం. T21100060721** కు సంబంధించిన భూమి డాక్యుమెంట్స్ పోయినవి. సంబంధిత డాక్యుమెంట్స్ దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు:
**శివరాత్రి కృష్ణస్వామి,**
**తండ్రి వెంకటయ్య,**
ఇంటి నెంబర్: 4-85
గ్రామం: మల్కాపూర్, మండలం: చిల్పూర్,
జిల్లా: జనగామ, పిన్: 506145.
ఫోన్ నెం: 9640653353, 9701888483.

## గోవా శాసనసభలో.. ఎస్‌టిలకు రిజర్వేషన్ల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్

### ప్రస్తుతం 40మంది ఎమ్మెల్యేలు ఉన్న గోవా అసెంబ్లీలో ఎస్‌సికి మాత్రమే 'ఒక సీటు రిజర్వ్' అమలు

**న్యూఢిల్లీ :** గోవా శాసనసభలో షెడ్యూల్డ్ తెగ(ఎస్‌టి)లకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. ఇదిలా ఉండగా బిహార్ ఓటర్ల జాబితా సవరణపై (ఎస్ఐఆర్)పై చర్చకు డిమాండ్‌చేస్తూ ప్రతిపక్షాల నిరసనలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. 'గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు 2025'ను న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టారు. అయితే ఈ చట్టం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించబడింది. యాదృచ్ఛికంగా ఈ బిల్లును 2024 ఆగష్టు 5న దిగువసభలో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఈ బిల్లు పెండింగ్‌లో ఉన్నది. బిహార్‌లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ సహా వివిధ అంశాలపై ప్రతిపక్షాలు ఆటంకాలు కలిగించిన ప్రస్తుత వర్షాకాల సమావేశంలో లోక్‌సభ ఆమోదించిన మొదటి బిల్లు ఇది. బిల్లు ఆమోదించిన తర్వాత ప్రతిపక్షాల నిరసనలు ఆగకుండా కొనసాగడంతో సభకు అధ్యక్షత వహించిన సంధ్యారాయ్ సభా కార్యక్రమాలను ఒక రోజుకు వాయిదావేశారు. బిల్లు ప్రకారం, 2011లో గోవాలో జనాభా లెక్కల ప్రకారం..2011 జనాభాలెక్కల గణాంకాల ప్రకారం షెడ్యూల్ తెగల జనాభా గణనీయంగా పెరిగింది, 2011 జనాభా లెక్కల సారాంశం ప్రకారం అక్కడ ఉన్న జనాభాతో పోలిస్తే ఎస్‌టిల జనాభా గణనీయంగా అధికంగా ఉన్న స్థితిలో విచిత్రమైన పరిస్థితి తలెత్తిందని అది గుర్తించింది.కాగా గోవాలో మొత్తం జనాభా 14, 58, 545. ఇందులో ఎస్‌సిల జనాభా 25,449 అయితే ఎస్‌టిల జనాభా 1,49,275 మందిగా ఉన్నది. కానీ ఎస్‌టిలకు స్థానాలు రిజర్వ్ చేయకపోవడం వల్ల వారికి రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగపరమైన ప్రయోజనం పొందలేకపోతున్నారు. ప్రస్తుతం 40మంది సభ్యులు ఉన్న గోవా శాసనసభలో ఎస్‌టికి ఏ ఒక్క స్థానం కూడా లేదు. ఎస్‌సిలకు ఒక సీటు రిజర్వ్ చేయబడింది.

## పిఎం కిసాన్ సాయం పెంపు, కౌలు రైతులకు వర్తింపుపై కేంద్రం క్లారిటీ

**ఢిల్లీ:** పీఎంకిసాన్ పథకం పరిధిని విస్తరించడం, అందించే ఆర్థిక సాయం పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనా ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. రైతులకు ఏటా ఒక్కో విడత రూ.2 వేలు చొప్పున మూడు విడతల్లో రూ.6 వేల సాయం అందించే పీఎం కిసాన్ పథకాన్ని కేంద్రం 2019లో ప్రారంభించింది. ఈ మొత్తాన్ని నగదు బదిలీ కింద అందిస్తోంది. ఇప్పటివరకు రైతులకు 20 వాయిదాల్లో రూ.3.9 లక్షల కోట్లకు పైగా అందజేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పీఎంకిసాన్ పథకం పరిధిని విస్తరించడం గానీ, లేదా అందించే సాయాన్ని పెంచే అంశంపై ఎలాంటి ప్రతిపాదనా పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కౌలు రైతులు, భాగస్వామ్య సాగు రైతులను ఈ పథకంలో చేర్చే అంశంపై వచ్చిన మరో ప్రశ్నకూ సమాధానం ఇచ్చారు. ఈ పథకం ప్రయోజనాలు పొందాలంటే రైతులు సాగు భూమి కలిగి ఉండడమే ప్రధాన అర్హత అని మంత్రి తెలిపారు. తమిళనాడులో అమలవుతున్న తరహాలో రైతులకు వాతావరణ సమాచారం, మార్కెట్ వివరాలు, సలహాలు అందించే విధంగా కేంద్రం ఏదైనా యాప్‌ను ప్రవేశపెట్టనుందా? అని అడిగిన ప్రశ్నకు.. ప్రస్తుతం అటువంటి ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదన్నారు. అయితే, వ్యవసాయానికి సంబంధించిన సందేహాలు, సలహాలకు 'కిసాన్ కాల్ సెంటర్'ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సేవల కోసం రైతులు 18001801551 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చెయొచ్చని, ప్రాంతీయ భాషల్లోనే సమాధానాలు లభిస్తాయని పేర్కొన్నారు.

ప్రజాపక్షం
బుధవారం, 06 ఆగస్టు

# రాహుల్‌పై అసంబద్ధ వ్యాఖ్యలు

''2000 కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందని మీకెలా తెలుసు. మీరక్కడ ఉన్నారా? మీవద్ద విశ్వసించదగిన సాక్ష్యాధారం ఉందా? మీరు నిజమైన భారతీయుడు అయినట్లయితే ఇవన్నీ మాట్లాడరు... మీరు ఏమి చెప్పదలుచుకున్నా పార్లమెంటులో చెప్పండి. ఇవి పార్లమెంటులోని అంశాలు. వాటిని సోషల్ మీడియా పోస్టులో ఎందుకు చెబుతారు''? ఇవి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి సుప్రీం కోర్టు జడ్జీ దీపాంకర్ దత్తా సోమవారం చేసిన వ్యాఖ్యలు. జడ్జీగారు రాహుల్‌గాంధీ దేశభక్తిని ప్రశ్నించారు. ఏది పార్లమెంటులో మాట్లాడాలో, బయట మాట్లాడకూడదో ఆయన భావ ప్రకటన స్వేచ్ఛపై ఆంక్ష కూడా విధించారు. దేశద్రోహం కేసులాంటిదేదీ ఆయన బెంచీ ముందు లేదు. 2020 జూన్‌లో తూర్పు లధాక్‌లోని గాల్వన్ లోయలో భారత–చైనా సైనికుల మధ్య జరిగిన ముష్టి యుద్ధంలో 20 మంది భారత సైనికులు చనిపోయిన విషాదం తెలిసిందే. ఇరు దేశాల మధ్య సంబంధాలలో మళ్లీ ఉద్రిక్తలు ముంచెత్తిన చాలా సున్నితమైన అంశం ఇది. అప్పుడు చెడిన సంబంధాలను చాలా మేరకు పునరుద్ధరించుకోవటానికి కనీసం నాలుగేళ్లు పట్టింది. మోదీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టటానికి రాహుల్ చైనా విషయంలో అతిగా మాట్లాడుతున్నాడన్న అభిప్రాయం లేకపోలేదు. అయితే పార్లమెంటులో ప్రశ్నలను మౌనంతో దాటవేస్తున్న మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాహుల్ అటువంటి వ్యాఖ్యలు చేసి ఉండవచ్చు. సున్నితమైన అంశాల్లో ఏమి మాట్లాడినా దాన్ని చూసే వారి కోణం నుంచి అర్థాలు, అపార్థాలు రావటం సహజం. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంలో 2022 డిసెంబర్ 16న భారత్–చైనా సరిహద్దు ఉద్రిక్తతలపై మీడియా పృచ్ఛకులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చైనా 2000 కిలోమీటర్లు మన దేశ భూభాగాన్ని ఆక్రమించుకుందని, దీనిపై మోదీ ప్రభుత్వం నోరు మెదపటం లేదని ఒక రాజకీయ ప్రకటన చేశారు. ఇందులో భారత సైన్యాన్ని కించపరిచిందేమి లేదు. అయితే సరిహద్దు రహదారుల సంస్థ రిటైర్డ్ అధికారి ఉదయ్ శంకర్ శ్రీవాస్తవకు అది కనిపించింది. ఆయన 2023 ఆగస్టులో లక్నో మేజిస్ట్రేట్ కోర్టులో రాహుల్‌పై క్రిమినల్ పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఆ కోర్టు ఫిబ్రవరిలో రాహుల్‌కు సమన్‌లు జారీ చేయగా వాటిపై స్టే కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దాని విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్తాపై వ్యాఖ్యలు చేశారు. ఆయన లక్నో కోర్టు సమన్‌లను స్టే చేస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. ఈ బెంచిలో జస్టిస్ ఎ.జి.మాసిహ్ కూడా ఉన్నారు. అందువల్ల జస్టిస్ దీపాంకర్ వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయనవచ్చు. కొందరికి భలే నచ్చవచ్చు. రాజకీయ ప్రత్యర్థులు–బిజెపి, సంఘ్ పరివార్ నేతలు రాహుల్ దేశద్రోహి అని సుప్రీం కోర్టు చెప్పిందని టాంటాం వేయవచ్చు.

జస్టిస్ దత్తా ప్రకారం పార్లమెంటు సభ్యులు ఏమి చెప్పాలనుకున్నా పార్లమెంటులోనే చెప్పాలి, బయట చెబితే వాక్ స్వాతంత్ర్యం దుర్వినియోగం అవుతుంది. దీనికేమన్నా రాజ్యాంగ నిబంధన, నిషేధం ఉందా? అటువంటిది ఉంటే బయట నిత్యం రాజకీయ నిందారోపణలు వినిపించవు, ప్రజలకు ప్రశాంతత చేకూరుతుంది. పార్లమెంటులో ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పకపోతే, దాన్ని బలవంతపెట్టి చెప్పించే నిబంధన ఏదీ లేదు. గాల్వాన్ ఘటన తదుపరి అసలు ఏం జరిగిందో తెలుసుకోవాలని దేశ ప్రజలు కోరుకున్నారు. కానీ ప్రభుత్వం మౌనం వహించింది.

ఇకపోతే భారత–చైనా సరిహద్దు సమస్య ఈనాటిది కాదు.బ్రిటిష్ వలసపాలన వదిలిపెట్టి వెళ్లిన సమస్య. భూభాగాలపై ఇరుపక్షాల క్లెయింలు, కౌంటర్ క్లెయింలు ఉన్నాయి. పాకిస్థాన్ చైనాకు అప్పగించిన 5180 చ.కిలోమీటర్లు సహా 43,180 చ.కి.మీ భారత భూభాగం చైనా ఆధీనంలో ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సరిహద్దు వివాదానికి సామరస్య పరిష్కారం కోసం ఇరు దేశాల ప్రభుత్వాలు దీర్ఘకాలంగా కృషి చేస్తున్నాయి. సున్నితమైన సమస్యలను రాజకీయం చేయటమూ విజ్ఞత అనిపించుకోదు. జడ్జీలు కూడా రాజకీయ అంశాలపై సంయమనం పాటించడం మేలు.

# నరేంద్రమోదీ ఆరాటానికి ముందున్నది అసలు పరీక్ష!



ఎం.కోటేశ్వరరావు

నాటకీయ పరిణామాలు జరగకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందాల కోసం వెంపర్లాడిన నరేంద్ర మోదీ బృందానికి ప్రస్తుతానికి డొనాల్డ్ ట్రంప్ తగిన పాఠమే చెప్పాడు. మనదేశం నుంచి తాము దిగుమతి చేసుకొనే వస్తువులపై 25శాతం పన్నులు, రష్యా నుంచి మనం ముడిచమురు, ఆయుధాలు, ఇతర వస్తువులను దిగుమతి చేసుకొంటున్న కారణంగా అదనంగా జరిమానా విధిస్తున్నట్లు గత బుధవారం నాడు ప్రకటించాడు. మనసార్వభౌమత్వాన్నే కించపరిచాడు. పుండు మీద కారం చల్లినట్లుగా పాకిస్తాన్‌తో ఒప్పందం కుదుర్చుకొని అక్కడ నిల్వచేసే చమురును భారత్‌కు అమ్మిస్తానని కూడా చెప్పాడు. ఇది మరీ అవమానం. రష్యా, భారత్ రెండూ మృత ఆర్థిక వ్యవస్థలు, కలసి ఏం చేస్తాయో చేసుకోండి అంటూ ఎద్దేవా చేశాడు. ట్రంప్ ప్రకటించిన మేరకు ఆగస్టు ఒకటి నుంచి మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న వివిధ సరకులపై కనిష్టంగా 25 గరిష్టంగా 193శాతం పన్నులు విధిస్తారు. వీటికి జరిమానా అదనం. ఇవి ఇలానే ఉండేట్లయితే ఏ రంగం ఎలా ప్రభావితం అవుతుందో ఆచరణలో తెలుస్తుంది. ఔషధాలు, సెల్‌ఫోన్లు వంటి వాటిని ప్రస్తుతానికి మినహాయించారు. అవి పేకాటలో తురుపు ముక్కల వంటివి, మనదేశాన్ని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడలో భాగం తప్ప మరొకటి కాదు. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటామంటూ కేంద్ర ప్రభుత్వం ఒక సాదాసీదా ప్రకటన విడుదల చేసింది. మహా వ్యూహవేత్త అంటున్నారు గనుక మామూలుగానే ప్రధాని నరేంద్రమోదీ, ఇతర మంత్రులు నోరు విప్పలేదు, సమాచార శాఖ(పిఐబి) ద్వారా మొక్కుబడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. పరిస్థితిని అన్ని విధాలుగా మదింపు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా చర్యలకు ప్రతిగా చైనా మాదిరి మన ప్రభుత్వం కూడా ప్రతి సుంకాలు విధిస్తుందా లేదా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. అమెరికాతో ఇప్పుడున్న 130 బిలియన్ డాలర్ల లావాదేవీలను మరో ఐదు సంవత్సరాల్లో 500 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచుతామని రంగుల కలను జనం ముందించిన నేతలు ఇప్పుడేం చేస్తారో చూడాల్సి ఉంది. ఈ నెల 25వరకు భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతాయని, తమ ప్రతినిధి వర్గం ఢిల్లీ సందర్శించనున్నదని అమెరికా అధికారులు చెప్పినదాన్ని బట్టి ఇప్పటికీ మన మీద ఒత్తిడి తెచ్చే యత్నాలను ట్రంప్ మానుకోలేదని, తాజా సుంకాల ప్రకటన బెదిరింపుల్లో భాగమే అని చెప్పవచ్చు. మోడీ లొంగుతారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఇప్పటి వరకు జరిగింది ఒక ఎత్తయితే అసలు అగ్ని పరీక్ష ముందుంది. ఫిబ్రవరి నుంచి జరుగుతున్న చర్చల గురించి రకరకాల కథనాల లీకులు, ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ రంగంలో పెద్ద మొత్తంలో చైనా పెట్టుబడులను ఆకర్షించేందుకు మనదేశం సానుకూల సంకేతాలను పంపిందంటూ తాజాగా ఒక వార్త. ఇలాంటి పరోక్ష సందేశాలు చైనాను చూపి అమెరికా నుంచి రాయితీలు రాబట్టుకొనే ఎత్తుగడగా కూడా చెప్పవచ్చు. గతంలో అమెరికాను చూపి సోవియట్, దాన్ని చూపి వాషింగ్టన్‌తో బేరసారాలాడిన మన పాలకవర్గం ఇలాంటి వాటిలో ఆరితేరింది. ఇప్పటి వరకు ఈ ఎత్తుగడ ఫలించినట్లు లేదు. నిజంగానే మనదేశం చైనా ఎలక్ట్రానిక్ కంపెనీలు, వాటి పెట్టుబడులను అనుమతిస్తే అమెరికా మరింత శత్రుపూరితంగా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. జిగినీ దోస్తుతో సంబంధాలను నరేంద్రమోదీ అంత తేలికగా వదులుకుంటారా అన్నది చూడాల్సి ఉంది.

మన జిడిపి పదిలక్షల కోట్ల డాలర్లకు చేరాలంటే చైనాతో సయోధ్య తప్పనిసరని కొందరి సూచన, డ్రాగన్‌తో పెట్టుకుంటే మృత్యుఘంటికలే అని కొం దరి హెచ్చరిక. ఏది సత్యం! ఏదసత్యం ఓ మహా త్మా, ఓ మహర్షీ!! గాల్వన్ లోయ ఘర్షణ సందర్భంగా ఇంక చైనాతో మాటల్లేవ్, మాట్లాడుకోవటం లేదు, పోరే శరణ్యం అంటూ ఊగిపోయిన



దృశ్యాలు మన కళ్ల ముందే ఉన్నాయి. చైనా కమ్యూనిస్టు పార్టీతో ఒప్పందం, రాయబారి నుంచి పాఠాలు నేర్చుకున్నట్లు రాహుల్ గాంధీని ఎద్దేవా చేసిన వారు తమ కింది నలుపు చూసుకుంటున్నట్లు లేదు. రాహుల్ ఒప్పందానికి ముందే 2001లోనే జానా కృష్ణమూర్తి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బిజెపి చైనా కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు పెట్టుకుంది. గాల్వన్ ఉదంతాలు జరిగి ఐదేండ్లు గడచిన తరువాత చూస్తే మూసిన తలుపులను మనమే తెరుస్తున్నాం. చైనా తలపులతో మునిగిపోతున్నాం. ఆశ్చర్యంగా ఉంది కదూ! అప్పుడెందుకు మూశారు, ఇప్పుడెందుకు తెరిచారు, ఇన్నేండ్లు ఎందుకు ఆలస్యం చేశారు అని ఎవరైనా అడిగారో దేశద్రోహ ముద్రవేస్తారు జాగ్రత్త. బిజెపి నందంటే నంది పందంటే పంది అంతే! త్వరలో షాంఘై సహకార సంస్థ సమావేశాలకు గాను ప్రధాని నరేంద్రమోదీ బీజింగ్ సందర్శనకు వెళతారని అంటున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే షీ జింపింగ్ కూడా ఢిల్లీ రావచ్చు. ఏదీ అసాధ్యం కాదు, షీ జింపింగ్ రమ్మనాలే గానీ వెళ్లటానికి అన్నీ సర్దుకొని ఉన్నా అన్నట్లుగా ట్రంప్ ఉన్నాడు. ఎవరి ఎత్తుగడలు వారివి, ఎవరి ప్రయోజనాలు వారికి ముఖ్యం.

త్వరలో చైనాను అధిగమించేందుకు ముందుకు పోతున్నామని కొందరు చెబుతుంటారు. ఆ చైనీయులేమో అమెరికాను దాటేస్తాం చూడండి అన్నట్లుగా సందడి లేకుండా తమపని తాము చేసుకుపోతున్నారు. మన సంకల్పం మంచిదే, ఆరోగ్యకరమైన పోటీ ప్రతిదేశంతోనూ ఉండాల్సిందే. మధ్యలో చైనా ఎందుకు ఏకంగా అమెరికాతోనే పోటీ పడాలి. ఆశ, ఆకాంక్షల్లో కూడా పిసినితనం అవసరమా ! అయితే పేచీ ఎక్కడ అంటే ఎవరికి వారు మేమే ముందుండాలి, అగ్రస్థానం మాకే దక్కాలి అనుకుంటే ఫలితం, పర్యవసానాలు ప్రతికూలంగానే ఉంటాయి. ఎవరి సంగతివారే చూసుకోవాలి అనుకున్నపుడు మన అభివృద్ధిని మరొకరు ఓర్వలేకుండా ఉన్నారని ఏడిస్తే ప్రయోజనం లేదు. 1970 దశకం వరకు కమ్యూనిస్టు చైనాకు ఐరాసలో, 2001వరకు ప్రపంచ వాణిజ్యసంస్థలో సభ్యత్వమే లేదు. అడ్డుకున్నది ఎవరంటే అమెరికా, దాని కనుసన్నలలో నడిచే దేశాలే అన్నది తెలిసిందే. చిత్రం ఏమిటంటే అదే అమెరికా తరువాత కాలంలో తన కంపెనీల పెట్టుబడులను చైనాలో అనుమతించింది, తన అవసరం కోసం పరిమితంగా, ఫరవాలేదు పాతబడిందే కదా అనుకున్న సాంకేతిక పరిజ్ఞాన బదిలీని అనుమతించింది. లాటిన్ అమెరికా దేశాల మాదిరి వస్తు ఎగుమతి ఆధారిత దేశంగా ఉంటూ తనకు లాభాలను అందిస్తుంది అనుకున్న ఆశలను చైనా వమ్ము చేసింది. లాటిన్ అమెరికా దేశాలు పెట్టుబడిదారీ పాలనలో, చైనా కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉందనే వాస్తవాన్ని పశ్చిమదేశాల వారు అర్థం చేసుకోలేకపోయారు. చేయి అందిస్తే ఏకంగా అల్లుకుపోతుందని అమెరికా కార్పొరేట్ మేథావులు నాలుగుదశాబ్దాల క్రితం గుర్తించలేకపోయారు. చైనా నేడు అనేక రంగాలలో సవాలు చేస్తున్నది. అడ్డుకొనేందుకు అడుగడుగునా అమెరికా కూటమి చూస్తున్నది.ఆధునిక చిప్స్ అందుబాటులో లేకుండా చేయాలని ఆంక్షలు పెట్టిన సంగతి తెలిసిందే. తన కోడి కూయకపోతే చైనాలో తెల్లవారదని అది భావిస్తున్నది.

ఇలాంటి ఆటంకాలు మనకు లేవు. నిజంగానే ''కమ్యూనిస్టు నియంతృత్వ'' చైనా మనకు అడ్డుపడుతున్నది అనుకుంటే మనవారు కీర్తించే ''ప్రజాస్వామ్య'' అమెరికా, ఇతర పశ్చిమదేశాల మిత్రులు, భాగస్వాములే, అయినా సాయం చేసేందుకు ఎందుకు ముందుకు రావటం లేదు. బీజింగ్‌కు పోటీగా మనలను ఎందుకు నిలబెట్టటం లేదు ? మనదేశంలోని కొందరు మేధావులు చైనా మాత్రమే మనలను అడ్డుకుంటున్నదని తమ దాడిని ఎందుకు ఎక్కుపెడుతున్నట్లు ? జనం ఆలోచించాలి ! అమెరికాతో మనదేశ వాణిజ్య ఒప్పందాల గడువు జూలై తొమ్మిది, ఆగస్టు ఒకటి రెండూ మురిగిపోయాయి. చైనాతో వాణిజ్యం మీద లేని ఒప్పందం అమెరికాతో ఎందుకు అన్నది సామాన్యులకు అర్థం కావటం లేదు. చైనాతో1954లో కుదిరిన ఒక సాధారణ ఒప్పందం మాత్రమే అమల్లో ఉంది.పరిస్థితులకు అనుగుణ్యంగా దాన్ని నవీకరించటం లేదా నూతన ఒప్పందాన్ని కుదుర్చుకోవటానికి ఎలాంటి చొరవా రెండువైపుల నుంచి లేదు. కానీ భారీ మొత్తంలో వాణిజ్య లావాదేవీలు జరుగుతున్నాయి.

అసలు వాణిజ్య ఒప్పందాలు ఎందుకు ? వివాదాలు లేకుండా ఒక పద్దతిగా నడుద్దామని రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 23దేశాల మధ్య (భారత్, చైనాలతో సహా) వాణిజ్యం, పన్నులపై సాధారణ ఒప్పందం (జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్–గాట్) 1947లో కుదిరింది, దీన్నే జెనీవా ఒప్పందం అని కూడా అంటారు. తరువాత అది 1995 జనవరి ఒకటి నుంచి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ)గా మారింది. గాట్ దేశాల్లో చైనా ఉన్నప్పటికీ అది కమ్యూనిస్టుల ఏలుబడిలోకి వచ్చిన తరువాత తిరుగుబాటు రాష్ట్రమైన తైవాన్ పేరుతో ఉన్న చైనానే గుర్తించారు తప్ప మిగతా దేశాల మాదిరి సభ్యత్వం ఇవ్వలేదు. అనివార్యమైన స్థితిలో 2001లో చైనాను చేర్చుకున్నారు. ప్రపంచీకరణను ముందుకు తెచ్చిన దేశాలే నేడు దానికి భిన్నంగా డబ్ల్యుటివోను పక్కన పెట్టి విడివిడిగా ఒప్పందాలు చేసుకోవటం తెలిసిందే.

మన ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉన్న దేశాలలో అమెరికా, చైనా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. ప్రతిదేశం తన దగ్గర మిగులుగా ఉన్న సరకులను అమ్ముకొనేందుకు గతంలో ఏకంగా బలహీన దేశాలను ఆక్రమించుకోవటం, అందుకోసం యుద్ధాలకు దిగటం తెలిసిందే. ఆ రోజులు గతించాయి గనుక వాటి స్థానంలో మార్కెట్ల ఆక్రమణకు ఒప్పందాలు వచ్చాయి. పన్నులు ఎలా వేయాలో, ఎగుమతి, దిగుమతులు ఎలా జరగాలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఒక విధానాన్ని రూపొందించింది. అది ఉండగా విడివిడిగా ఒప్పందాల కోసం ప్రయత్నించటం చూస్తున్నాం. ఐక్యరాజ్యసమితి(ఐరాస) మాదిరి డబ్ల్యుటిఓ కూడా విఫలమైందా ? అలాగే కనిపిస్తున్నది, దాని నిబంధనలను పక్కన పెట్టి కొన్ని దేశాలు కొన్ని వస్తువుల మీద ఎక్కువ పన్నులు విధిస్తున్నాయి. ప్రతి చర్యలతో వివాదాలు, వాటిని పరిష్కరించే ట్రిబ్యునల్‌కు న్యాయమూర్తుల నియామకం జరగకుండా అమెరికా అడ్డుకుంటున్నది, పోటీ పడలేక వాణిజ్య దందాకు దిగి చైనా మీద కత్తి గట్టింది. దాని వైఖరిని మిగతా దేశాలు అప్పుడే ప్రతిఘటించి ఉంటే ఇప్పుడు అన్నిదేశాల మీద దాడికి దిగేది కాదు.నష్టపోయేది చైనాయే గదా అని భావించిన దేశాలకు ఇప్పుడు తెలిసి వస్తోంది.

# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత

తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిరంతర కృషిని, ఆయన ధృడ సంకల్పాన్ని తెలంగాణ రాష్ట్రం ఎప్పటికీ మరచిపోదు.తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిది. తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ గుర్తిండిపోయే వ్యక్తి జయశంకర్ సార్. ఉద్యమకారుడి నుండి మహోపాధ్యాయుడి దాకా ఆయన తెలంగాణకు దిక్సూచిగా నిలిచారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలను తెలంగాణ ప్రజలు, భవిష్యత్ తరాలు గుర్తుంచుకునే విధంగా వారి సంకల్ప బలం రాష్ట్ర సాధనకు చేసిన నిర్విరామ కృషి అంచ లంచలుగా ఆశయ ఆలోచనలకు పదును పెడుతూ, రాష్ట్ర సాధనకు ఆయువుపట్టు అయినారు. అందరి హృదయాలలో చిరకాలం పాటు నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్..



నేడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

విశ్వబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కొత్తపల్లి జయశంకర్ వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలంలోని అక్కంపేట అనే గ్రామంలో తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత్‌రావు అనే పుణ్యదంపతులకు 1934 ఆగస్టు 6న జన్మించారు. ఆయనకు ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. జయశంకర్ తల్లి దండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్ ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. బెనారస్, అలీగఢ్ విశ్వవిద్యాలయాలనుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశాడు. 1975 నుంచి 1979 వరకు వరంగల్‌లోని సికెఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. 1979 నుండి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజస్ట్రార్‌గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్‌గా, 1991 నుంచి 1994 వరకు అదే యూనివర్శిటీకి ఉపకులపతిగా పనిచేశాడు.

అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమ్జన్సీ కాలంలో ఆయన సికెఎం కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. సికెఎం కళాశాల అంటేనే జిల్లాలో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుండి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవడం సర్వసాధారణమే కానీ ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని పేరుపెట్టి పిలవడం ఒక్క జయశంకర్‌కే సాధ్యం. జయశంకర్ సార్ విద్యార్థుల్లో అనేక మంది దేశవిదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ కె.సీతారామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్ సార్. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1952లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఆయన 1954లో ఫజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చాడు. కెసిఆర్‌కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించాడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాసాడు. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేసాడు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశాడు. 'అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్‌నా ఔర్ మర్‌జానా' (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి, తర్వాత మరణించాలి) అని అనేవాడు. విదేశాల్లో తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుండి ఢిల్లీదాకా, ఢిల్లీ నుండి అమెరికా దాకా వ్యాప్తి చేయడంలో ఆయన పాత్ర మరవలేనిది. విద్యార్థి దశ నుండే తెలం'గానం'ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుండే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ ఉద్యమంలోకి ఉరికి ఆనాటి నుండి సమరశీల పాత్రను పోషించారు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి ఆచరించే మహనీయుడు. తెలంగాణ డిమాండ్‌ను 1969 నుండి సునిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసాడు. తెలంగాణలోని ప్రతిపల్లె ఆయన మాటతో పోరాట గుత్ప అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం అంటూ లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికలమీద, విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణ నినాదాన్ని వినిపించిన పోరాట శీలి.

ఉస్మానియా విద్యార్థుల గురించి 'ఉస్మానియాను తలుచుకుంటే తెలంగాణ వాడినైనందుకు గర్వంతో ఛాతి పొంగిపోతుంది. ఎన్నెన్ని పోరాటాలకు, ఆరాటాలకు అది వేదికైంది. అందరికీ ఉస్మానియా యూనివర్శిటీ అంటే చెట్లు కనిపిస్తాయి. కానీ మొన్నటికి మొన్న తెలంగాణ కోసం అమరులైన అనేక మంది విద్యార్థులు ఆ చెట్ల సాక్షిగా నాకు కళ్లముందే కదులుతు కనిపిస్తారు... వారు గుర్తుకొస్తే దు:ఖమొస్తది అనేవారు. అయితే నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచే అదృష్టం ఎంతమందికి దక్కుతుంది. వాళ్లకు మరణం లేదు. అదే ఉస్మానియాలో డిసెంబర్ 9 ప్రకటన తర్వాత పిల్లలు జరుపుకున్న సంబరం నా జీవితంలో మర్చిపోలేని గొప్ప జ్ఞాపకం. కానీ వారి భవిష్యత్ కలలతో ఆడుకున్నది ఎవరు? వారి ఆశలతో ఆడుకుని... వారి శవాలపై ప్రమాణం చేసిన రాజకీయనాయకులకు వాళ్ల ఉసురు తగలకుండా పోతుందా' తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కాంక్ష గురించి మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుండి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి అనే వారు.60 ఏళ్ల ఆకాంక్ష నెరవేరడానికి కారణమైన వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్. తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడుకున్నా, రాష్ట్ర సాధన గురించి చెప్పుకున్నా... ఆయన ప్రస్తావన లేకుండా ఉండదు. తొలిదశ ఉద్యమం నాటి నుండి... 60 ఏళ్ల ఆకాంక్ష నెరవేరే వరకూ.. తెలంగాణ ఉద్యమ ప్రతి అడుగులో సార్ ముద్ర కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు. అంతటి మహనీయుడు అనారోగ్య సమస్యతో రెండేళ్ల పాటు గొంతు క్యాన్సర్‌తో బాధపడి 2011 జూన్ 21న తుదిశ్వాస విడిచారు. తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ పితామహుడు జయశంకర్‌సార్ జయంతి సందర్భంగా తెలంగాణ జాతి యావత్తు వారి చిరస్మరణీయమైన స్మృతులను తలచుకుంటూ ఈరోజు ఆ మహానుభావుడి జయంతిని ఘనంగా జరుపుకుంటుంది.

– నరేశ్ జాటోతు

## ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు లేని పరిమితి


# బిసి రిజర్వేషన్లకు ఎందుకు?

ఆగస్టు 7 భారత సమాజంలో తరతరాలుగా విద్యకు, భూమికి దూరం చేసి వెనకబడవేయబడ్డ వర్గానికి స్వతంత్ర భారతదేశంలో సుమారు 50 సంవత్సరాల తర్వాత రిజర్వేషన్లు కల్పించబడ్డ రోజు. సామాజిక న్యాయం కోసం 40 సంవత్సరాలు వెనకబడ్డ వర్గాల పోరాటానికి గుర్తింపు లభించిన రోజు. లోక్‌సభలో వి.పి.సింగ్ ఇతర వెనకబడ్డ వర్గాల కోసం ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ప్రకటన జారీ చేసిన రోజు. నేడు దేశవ్యాప్త బిసి రిజర్వేషన్ల ఉద్యమానికి నాంది పలికిన రోజు. అదే ఆగస్టు 5,6,7 తేదీల్లోనే బిసిల 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదించాలని జంతర్‌మంతర్ దగ్గర తెలంగాణ బిసి సమాజం ధర్నా చేస్తుండడం యాదృచ్ఛికమే కావచ్చు కాని విశేషమే. బిసిల 42శాతం రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఢిల్లీలో జంతర్ మంతర్‌కు చేరింది. తెలంగాణనే కాదు యావత్ భారతదేశం బిసిల 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయా, కావా? అనే మిలియన్ డాలర్ల ప్రశ్నతో వెయ్యికండ్లతో ఎదురుచూస్తుంది.

2019 జనవరి నెలలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం, రెండు సభలలో ఆమోదించడం, రాష్ట్రపతి సంతకం చేయడం, గెజిట్‌లో ప్రచురించడం, అమలు కావడం చకచకా జరిగిపోయాయి. కానీ బిసిలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్రం రెండు బిల్లులు పంపి ఆరు నెలలు గడుస్తున్నా నిర్ణయం తీసుకోవడంలో జాప్యం ఎందుకు?. స్థానిక సంస్థలలో బిసిల 42% రిజర్వేషన్లు అమలు చేయాలని 2018 చట్టంలో సెక్షన్ 285 Aకి సవరణ చేసి గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపిస్తే మళ్లీ ఆర్డినెన్స్ ఢిల్లీకి(రాష్ట్రపతి సలహా కోసం) చేరింది. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు లేని అగ్ని పరీక్ష బిసిల 42% రిజర్వేషన్లకు ఎందుకు? అసలు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు లేని 50% పరిమితి నిబంధన బిసి రిజర్వేషన్లు ఎందుకు?. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్థించింది, బిసి 42శాతం రిజర్వేషన్లను సమర్థించదా?.

### ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు

జనహిత్ అభియాన్ వర్సెస్ ఇండియా కేసులో 2022 నవంబర్ 7న ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు 3:2 మెజార్టీ ద్వారా సమర్థించింది. ముఖ్యంగా ఈ కేసులో సుప్రీంకోర్టు స్పష్టపరిచిన అంశాల్లో ఆర్టికల్ 15(4), 16(4) కింద రిజర్వేషన్లు అసాధారణ పరిస్థితులలో తప్ప 50% మించకూడదు‘ అనే తీర్పు సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు (ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిలు వంటివి) వర్తిస్తుంది ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు కాదు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను విడిగా పరిగణిస్తారు. ఇడబ్ల్యుఎస్ కోటా (10%) ఇప్పటికే ఎస్‌సి, ఎస్‌టి లేదా ఒబిసి రిజర్వేషన్ల పరిధిలోకి రాని వారికి, ఎందుకంటే ఇది అదనంగా కలిపిస్తున్న రిజర్వేషన్లు. 103వ రాజ్యాంగ సవరణ ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కోసం ఆర్టికల్స్ 15(6), 16(6)లను రాజ్యాంగానికి చేర్చింది కాబట్టి ఆమోదిస్తున్నాం. ఇది రాజ్యాంగంలో భాగం కాబట్టి, సుప్రీంకోర్టు




గతంలో న్యాయపరంగా రూపొందించిన 50% నియమాన్ని అధిగమిస్తుందని తీర్పు ఇచ్చింది

### గత అనుభవాలు ఏం నేర్పుతున్నాయి

తమిళనాడు వెనుకబడిన తరగతులు, ఎస్‌సిలు, ఎస్‌టిల చట్టం, 1993ను ఆమోదించింది, ఇది 69% రిజర్వేషన్లను కల్పిస్తుంది. న్యాయసమీక్ష నుండి రక్షించడానికి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో ఈ చట్టం చేర్చబడింది. 2018లో మహారాష్ట్ర SEBC (సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు) వర్గం కింద మరాఠాలకు 16% రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక చట్టాన్ని ఆమోదించింది. ఇది మొత్తం రిజర్వేషన్లను 70%కి పెంచింది. మే 2021లో సుప్రీంకోర్టు 50% పరిమితిని ఉల్లంఘించడానికి ఎటువంటి అసాధారణ పరిస్థితులు లేవని దానిని కొట్టివేసింది. రాజస్థాన్ గుజ్జర్లకు 5% రిజర్వేషన్లు, ఇతర ఒబిసిలకు 21% రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రయత్నించింది, దీనితో మొత్తం రిజర్వేషన్లు 70% కంటే ఎక్కువ అయ్యాయి. రాజస్థాన్ హైకోర్టు, సుప్రీంకోర్టు 50% పరిమితిని ఉల్లంఘించాయి, అసాధారణ పరిస్థితులను సమర్థించడానికి తగినంత డేటా లేదు అని ఈ చట్టాన్ని కొట్టివేసాయి. బిహార్ ప్రభుత్వం నవంబర్ 2023లో బీహార్ కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్లను 75%కి పెంచుతూ చట్టాన్ని ఆమోదించింది. పాట్నా హైకోర్టు అసాధారణ పరిస్థితులు ఉంటే తప్ప రిజర్వేషన్ 50% మించకూడదనీ, కుల సర్వే డేటాలో అసాధారణ పరిస్థితులు నిరూపించబడలేవనీ, అదనపు రిజర్వేషన్లను సమర్థించడానికి తగినంత బలమైన సామాజిక ఆర్థిక సూచికలు దీనికి లేవు అని కొట్టివేసింది. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, కృష్ణమూర్తి కేసులలో ఇచ్చిన ట్రిపుల్ టెస్ట్ తీర్పును, వివిధ రాష్ట్రాల్లో బిసి రిజర్వేషన్లపై హైకోర్టులు, సుప్రీంకోర్టు తీర్పులను ఇతర రాష్ట్రాల అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు (బిసి లు) 42% రిజర్వేషన్లను అమలు చేయడానికి నవంబర్, డిసెంబర్ 2024లో తెలంగాణ సామాజిక ఆర్థిక, కుల సర్వే (SEEEPC)ని నిర్వహించింది, ఇది 96.9% గృహాలను కవర్ చేసింది. జనాభాలో బిసిలు 56.33% ఉన్నారని తేల్చింది. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా డేటాను విశ్లేషించడానికి, రిజర్వేషన్ సంస్కరణలను సిఫార్సు చేయడానికి ఒక బిసి కమిషన్ ఏర్పరచింది. మార్చి 2025లో, తెలంగాణ శాసనసభ విద్య మరియు ప్రభుత్వ ఉద్యోగాలలో బిసి రిజర్వేషన్లను 42%కి పెంచడం (29% నుండి), పంచాయతీలు, మునిసిపాలిటీలు వంటి స్థానిక సంస్థలకు 42% కోటాను పెంచడం కోసం (18% ఎస్‌సి మరియు 10% ఎస్‌టి కోటాలతో పాటు మొత్తం 70%కి తీసుకురావడం) రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించింది. పార్లమెంట్ అనుమతి కోసం ఢిల్లీకి పంపింది. 2025 జులైలో తెలంగాణ మంత్రివర్గం తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285Aని సవరించడానికి ఆర్డినెన్స్ జారీ చేయడానికి ఆమోదం తెలిపింది. గవర్నర్ ఈ ఆర్డినెన్స్‌ను 2025 ఆగస్టు 1న రాష్ట్రపతికి పంపారు.

### ప్రస్తుతం ఏం చేయాలి?

బిసిల 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సవరణ అవసరం. 50% పరిమితిని అధిగమించాలంటే అసాధారణ పరిస్థితుల్లో అధిగమించవచ్చు. 50 శాతం పరిమితి అనేది న్యాయపరమైన మినహాయింపే కాని రాజ్యాంగపరమైన మినహాయింపు కాదు. కాబట్టి 56.36% ఉన్న బిసిలకు తగినంత ప్రాతినిధ్యం లేదని డెడికేటెడ్ కమిషన్ ద్వారా రిపోర్టును సమర్పిస్తూ సమగ్ర సర్వే, శాస్త్రీయ డేటాను ముందు ఉంచే ప్రయత్నం చేయాలి. తమిళనాడు మాదిరిగా 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి కోర్టుల నుంచి మినహాయింపు పొందవచ్చు (తొమ్మిదవ షెడ్యూల్లోని చట్టాలను న్యాయ సమీక్ష చేయవచ్చు). రాజ్యాంగ సవరణ కోసమే తెలంగాణ సమాజం ఢిల్లీలో జంతర్‌మంతర్ దగ్గర ధర్నా చేస్తుంది. ఇంత జరుగుతున్న బిసి రిజర్వేషన్లకు మోక్షం లభించడం లేదంటే యావత్ భారతదేశం, తెలంగాణ సమాజం దానికి కారకులు ఎవరో నిర్ణయించుకోవాలి.

– జుర్రు నారాయణ యాదవ్
9494019270

# రేపు బిజినేపల్లిలో మండల్ డే

ప్రజాపక్షం/బిజినేపల్లి : రేపు బిజినేపల్లి మండలకేంద్రంలో గురువారం ఉదయం 10గంటలకు మండల్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు బిసి సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల్ దినోత్సవం అంటే 40 ప్రతిపాదనలతో కూడినటువంటి నివేదిక మండల్ కమీషన్ సిఫారసులలోని ఒక అంశం బిసిప్రజలకు 44శాతం రిజర్వేషన్‌ను 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధానమంత్రి విశ్వనాథప్రతాప్‌సింగ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం 27శాతం రిజర్వేషన్‌ను భారత పార్లమెంట్‌లో ఆమోదించిన రోజు అన్నారు. బిసిసంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే, అంబేద్కర్‌చౌరస్తాలో మండల్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున బిజినేపల్లి మండలంలోని అన్నిగ్రామాల బిసిసంఘం నాయకులు, బిసి విద్యావేత్తలు, మేధావులు, ఉద్యోగులు, బిసిలు, పెద్దఎత్తున హాజరుకావాలన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



ప్రజాపక్షం/వెల్దండ : మండలపరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు సిఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.60వేల చెక్కును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణవారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, మాద్గుల వెంకటయ్య, శివధనుసు, సైదులు, రాములు, కృష్ణయ్య, మల్లేష్, ఆనందం, విజేందర్‌రెడ్డి, పాపయ్య, అంజి, అనిల్, సుధాకర్, మహేష్, ప్రశాంత్, బన్ని పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డులు పంపిణీ



ప్రజాపక్షం/కృష్ణ: కృష్ణ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడెబల్లూర్‌లో విద్యార్థులకు మంగళవారం పాఠశాల గుర్తింపు కార్డులు, బెల్టులు ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్ విద్యార్థులందరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు దీటుగా ఫలితాలు సాదించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు, దుస్తులు నోట్ పుస్తకాలు పాటు ఐఎఫ్‌బిల ద్వారా విద్యాబోధన కంప్యూటర్ ల్యాబ్స్ ఏఐ టెక్నాలజీ ల్యాబ్స్ తీసుకువచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందన్నారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ గుర్తింపు కార్డులు, బెల్టులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం అర్జున్ తిరుమలరావు, చంద్రశేఖర్, రాజన్న, శ్రీనివాసులు, నర్మద్, ఆనంద, రవి, భాగ్య విద్యార్థులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/కృష్ణ: మంగళవారం మండల కేంద్రంలోని పరిషత్ ప్రాథమిక పాఠశాల మూడుమాల్ యందు భవిత కేంద్రాన్ని మండల విద్యాధికారి నిజాముద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాటలు రాని, చెవులు వినపడని, మానసికంగా వైకల్యం కలిగిన, చదువులో పూర్తిగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వారికి తక్షణ ఇచ్చే కార్యక్రమమే భవిత కేంద్రం ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మూడుమాలలో మొత్తం 281 మంది విద్యార్థులకు గాను దాదాపు 18 మంది విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వీరిందరిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్, పీఆర్టియూ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.


## సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

ప్రజాపక్షం/మద్దూర్/ కొత్తపల్లి : 2025–26 వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయడం జరుగుతుందని మంగళవారం వ్యవసాయ అధికారులు రామకృష్ణ, కే.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యస్సి, యస్టి, మహిళ, చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీ ఉంటుందని, పెద్దకారు రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యవసాయం చేస్తు ఇప్పటివరకు యాంత్రీకరణలో లబ్ది పొందని రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సబ్సిడీపై బ్యాటరి/చేతి పంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, రోటవేటర్స్, బ్రష్ కటర్, కల్టివెటర్, కేజ్‌వీల్స్ తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అప్లికేషన్ ఇవ్వదలచిన లబ్దిదారులు మద్దూర్, కొత్తపల్లి వ్యవసాయ కార్యలయాల్లో ఇవ్వొచ్చన్నారు. దీనికి గాను కావల్సిన పత్రాలు అప్లికేషన్ ఫారం, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ అర్‌సి అన్ని కూడా జిరాక్స్ ఇవ్వాలన్నారు. లబ్దిదారుల ఎంపిక తరువాత సంబంధిత పరికరం సరాఫరా చేసే కంపని పేరుపై డిడి తీయాల్సి ఉంటుందన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ యువనేత జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/వెల్దండ : మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ యువనేత మూడవత్ హరికిషన్ నాయక్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూడవత్ మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. కాంగ్రెస్ నాయకులు కేక్ తినిపించి హరికిషన్ నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలనివారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్, కిసాన్‌సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్లకృష్ణ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తక్కెళ్లపల్లి శేఖర్, మాజీసర్పంచులు రామచంద్రారెడ్డి, భక్య నాయక్, రాములు, కాంగ్రెస్ నాయకులు ఎర్రశ్రీనుముదిరాజ్, కదారి శ్రీనివాస్ యాదవ్, పుల్లయ్య, వెంకట్ నాయక్, తిరుపతిరెడ్డి, హమీద్, అంజయ్య, లక్ష్మణ్‌నాయక్, నర్సింగ్ నాయక్, భరత్‌గౌడ్, గోపాల్ నాయక్, రాచూర్‌తండా గ్రామస్తులు పాల్గొన్నారు.

## తులాభారంలో శక్తిపీఠం స్వామీజీ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/నారాయణపేట్: శక్తి పీఠం ఆధ్వర్యంలో ఘనంగా అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం 5వ వార్షికోత్సవం, స్వామిజీ 46వ జన్మదిన వేడుకలు తులాభారంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శక్తి పీఠం శ్రీ సంత్ మర మూల మహా సంస్థానంలో అత్యంత వైభవంగా స్వామీజీ 46వ జన్మదినోత్సవ వేడుకలు భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా.స్వామి శాంతనంద పురోహిత్ జన్మదినోత్సవ సందర్భంగా బెల్లం, బియ్యంతో తులభార కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం 5వ వార్షికోత్సవ సందర్భంగా అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం సేవలకు సైతం ఘనంగా సన్మానించారు. అనంతరం శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా.స్వామి శాంతనంద పూరోహిత్ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠం కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యత

### కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : రైతులు ఆయిల్‌పాం సాగుకు ప్రాధాన్యత ఇస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం భూత్పూర్ మండల తాటికొండ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆయిల్‌పాం తోటలను సందర్శించారు. గ్రామంలో 4.5 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న మహిళా రైతు ఆర్.మంజుల తోటలో గెలలు కోతకు వచ్చిన సందర్భంగా కత్తిరింపులు ద్వారా వస్తున్న దిగుబడి పరిశీలించారు. ఇప్పటి వరకు 29 మెట్రిక్ టన్నుల తాజా ఆయిల్‌పాం గెలలను కోసి కంపెనీకి విక్రయించినట్లు తద్వారా 4 లక్షల 32 వేల ఆదాయం లభించిందని కలెక్టర్‌కు రైతు తెలిపారు. ఫ్రీ యూనిట్ కంపెనీ వారు ఈ గెలలను ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం కోనుగోలు చేసి రైతులకు పేమెంట్ చేస్తారు. అక్కడే సందర్శనకు వచ్చిన హస్నాపూర్ గ్రామానికి సంబంధించిన ముగ్గురు, లేత ఆయిల్‌పామ్ తోటల కలిగిన రైతులతో సాగు వివరముల గురించి కలెక్టర్ చర్చించారు. శేఖర్‌రెడ్డి నరసింహరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ముగ్గురు రైతులతో కలెక్టర్ ఆయిల్‌పాం సాగుపై చర్చించారు. ఇదే గ్రామంలోని ఆయిల్‌పాం సాగు మూడో సంవత్సరం సాగు చేస్తున్న ఎగ్గని నరసింహులు 25 ఎకరాలు ఆయిల్‌పామ్ చేస్తున్న రైతు తోటను, కొత్త ములగర గ్రామంలో 2.25 ఎకరాలు ఆయిల్‌పాం సాగు చేస్తున్న చింతకాయల రాములు తోటను సందర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో, 4298 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పాం తోటలు సాగు చేసినట్లు తెలిపారు. ఇట్టి తోటల్లో 39 రైతులకు చెందిన 255 ఎకరాల నుండి, 50 మెట్రిక్ టన్నుల ఆయిల్ పామ్ తాజా గెలల ఉత్పత్తి జరిగిందని ఉద్యాన శాఖ అధికారి వేణు గోపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి వేణుగోపాల్, ఉద్యాన అధికారులు అనిల్ కుమార్, స్వప్న, ఫ్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ ఫామ్ కంపెనీ తరపున జోనల్ మేనేజర్ రాకేష్, జిల్లా ఏరియా మేనేజర్ బాలరాజ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

**స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు**

ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో స్వాతంత్రం దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేదిక, విఐపిలు, అధికారులు, మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. పరేడ్ మైదానంలో తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ముఖ్య అతిథి సందేశం రూపొందించేందుకు ఆయా శాఖల సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని అన్నారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాలంకరణతో అలరించాలని అన్నారు. అటవీ, వ్యవసాయ, ఉద్యాన, జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ, మెప్మా, మిషన్ భగీరథ, పశు సంవర్ధక శాఖ, విద్యా శాఖ, ఐసిడిఎస్, మత్స్య శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, చేనేత జౌళిశాఖల స్టాళ్లు, వ్యవసాయ శాఖ, నగర పాలక సంస్థ, అటవీ శాఖ, పౌర సరఫరాల శాఖ, ఆర్‌టిసి, పోలీస్, గృహ నిర్మాణం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అగ్నిమాపక శాఖ శకటాలు ఆయా శాఖలు సాధించిన ప్రగతిని తెలుపుతూ ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏనుగు నర్సింహా రెడ్డి, డిఎస్‌పి. వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, డిఈఓ ప్రవీణ్ కుమార్, డిఫ్‌ఓ సత్యనారాయణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, డిఎస్‌ఓ గంప శ్రీనివాస్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాపక్షం/నారాయణపేట్: నారాయణపేట్ జిల్లాలోని ఉట్కూర్ మండలంలోని బిజ్వర్ గ్రామంలో జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాంజెంబర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలో విద్యార్థులులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వాలంటీర్ లక్ష్మీ కాంత్, మాట్లాడుతూ ఈ డ్రగ్స్ అనేది మన దేశానికి పట్టిన రోగం అని, గంజాయి వాడటం వల్ల కలిగే నష్టాల గురించి, వాటిని తీసుకుంటే జీవితాలు నాశనం అవుతాయని డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని అన్నారు. యువత మీదే టార్గెట్ చేస్తున్నారని యువత ఈ మాదక ద్రవ్యాలకు బానిస అవ్వకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మంచిగా చదివి మంచి స్థాయిలో ఉండాలని ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీస్కోని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్ కుమార్, రమేష్, గోపాల్, నాగరాజు, మనోహర్, హర్షద్, నష ముక్త్ భారత్ అభియాన్ వాలంటీర్, లక్ష్మీ కాంత్, సంధ్య, స్టాఫ్, పిల్లలు పాల్గొన్నారు.



## ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి



ప్రజాపక్షం/జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని చర్లపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్‌తో కరిగేట చేస్తు నసురుల్లాబాద్ గ్రామానికి చెందిన ఎరుకలి మల్లేష్ 40 సం అనే ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ రివర్స్‌గా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నసరుల్లాద్‌కు చెందిన మల్లేష్ పోలీసులు చుట్టు పక్కన వాళ్ళు అందించిన సమాచారం ఇలా ఉంది. మంగళవారం నాడు ఉదయం మల్లేశ్ ఇతరుల కరిగేట చేసేందుకు చర్లపల్లి గ్రామానికి వచ్చి కరిగేట చేస్తుండగా అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడిందని. మల్లేశ్ తల స్టీరింగ్‌లో ఇరుక్కొని పోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జడ్చర్ల పోలీసులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ప్రజాపక్షం/మక్తల్/కృష్ణ: జిల్లా కేంద్రంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో జూలై 26 శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో జడ్‌పిహెచ్‌ఎస్ కున్సీ విద్యార్థులు 60 మీ, 600 మీ లాంగ్ జంప్‌లో శివాని, మల్లికార్జున్ ప్రథమ స్థానం ఎండీ.సన, స్వప్న ద్వితీయ స్థానం పొంది, శివాని, మల్లికార్జున్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోషి వారిని అభినందించారు. 6,7 హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సంతోషి ఉపాధ్యాయులు నర్సింములు, నరేందర్, ఖాసీం ఆలీ, ఉష, సౌమ్య, నర్సిములు, భారతి అభినందించారు.

# తల్లిపాలే పిల్లలకు అమృతం



ప్రజాపక్షం/ఊర్కొండ : తల్లిపాలే పిల్లలకు అమృతంలాంటిదని కల్వకుర్తి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. రెండేళ్ల వరకు బిడ్డలకు అమ్మపాలు పట్టాలన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఊర్కొండ మండలం జగబోయినపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సంతోష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి హాజరై గర్భిణీలు, బాలింతలకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను, ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఆమె సూచించారు. పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యం, జీవనరక్షణకు ప్రభావితం చేస్తుందన్నారు. నియోనియా వంటి వ్యాధలనుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. అధిక బరువు, మధుమేహం వంటి సమస్యలను తగ్గిస్తుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆయా లక్ష్మమ్మ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## మందు పూసే పద్ధతితో చీడపీడల నివారణ సాధ్యం



ప్రజాపక్షం/బిజినేపల్లి : కృషి విజ్ఞాన కేంద్రం పాలెంలో మంగళవారం పత్తిలోరసం పీల్చే పురుగుల యాజమాన్య నివారణ పద్ధతులు కాండానికి మందు పూసే పద్ధతి ద్వారా తుమ్మలసూగుర్, వసంతాపూర్ గ్రామాలలో పత్తి సాగు చేసిన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీదేవి మాట్లాడుతూ పత్తిపంటపై ఆశించే రసం పీల్చు ఇతర చీడపీడలు, తెగుళ్ల నివారణ పద్ధతులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పంటలపై కాకుండా చీడపీడలపై ప్రత్యేకంగా దృష్టి సాధించాలన్నారు. దీనిలో భాగంగా మొక్కజొన్న, వరి ఇతర పంటలపై చీడపీడలు ఆశించినప్పుడు నివారణ పద్ధతులు ఏవిధంగా పరిష్కరించుకోవాలో రైతన్నలకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



ప్రజాపక్షం/బిజినేపల్లి : పాలిచ్చే తల్లులను అర్థం చేసుకోవడం సంరక్షణ చేయడం కోసం శిక్షణా వేడుకల సందర్భంగా పాలిచ్చే తల్లుల పోషక అవసరాలు సంరక్షణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీదేవి మాట్లాడుతూ పుట్టిన వెంటనే తల్లిపాలను మొదటి చుక్కతో ప్రారంభించడం బిడ్డకు కొలోస్ట్రమ్ అందేలా చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. శిశువులకు సరైన తల్లిపాలు ఇచ్చే పద్దతులను కూడా తెలిపారు. ఆరు నెలల తర్వాత ఆహారాన్ని ప్రారంభించాల్సిన అవసరాన్ని కనీసం రెండు సంవత్సరాలు, వీలైనంత ఎక్కువకాలం తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కూరగాయల ఆకు కూరలు, పాలు, గుడ్లు, మాంసం, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల నుండి తయారుచేయగల వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులపై ఆమె సమాచారాన్ని అందించారు. వాటి పోషక విలువలు పాలిచ్చే తల్లులకు వాటి ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో మొక్కల సంరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ టి.సాయిలి, వ్యవసాయ విస్తరణ నిపుణురాలు పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, రాజయ్యబేగం, 21మంది పాలిచ్చే తల్లులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి




ప్రజాపక్షం/వెల్దండ : బడి ఈడు పిల్లలను బడిలోచేర్పించాలని యుపిఎస్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ అన్నారు. మండలపరిధిలోని కొట్రలో యుపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం 1050 పాఠశాలల్లో నూతనంగా ఎల్‌కెజి, యుకెజి తరగతులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభు త్వం నిర్ణయించిందని, నాలుగు సంవత్సరాలు నిండిన బాలబాలికలకు పాఠశాలలో ప్రవేశం కల్పించుటకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయబృందం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహనర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శోభన్‌బాబు, ఫర్జానా బేగం, అహమాది, సమత, మాజీ ఎంపిటిసి రాములు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగంగా పూర్తి

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజాపక్షం/నారాయణపేట్/కృష్ణ/మక్తల్:నారాయణపేట్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. టిజి ఎంఎస్‌ఐడిసీ ప్రాజెక్టు పరిధిలో రూ.26 కోట్ల వ్యయంతో నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి వద్ద గల ప్రభుత్వ మెడికల్ కళాశాల/జిల్లా ఆస్పత్రి పక్కన కొనసాగుతున్న నర్సింగ్ కాలేజ్, రూ.40కోట్ల నిధులతో చేపట్టనున్న ఎంసీహెచ్ (మెటర్నిటీ చైల్డ్ హెల్త్) సెంటర్ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ముందుగా నర్సింగ్ కాలేజ్ నిర్మాణ పనులను చూసిన కలెక్టర్ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. నర్సింగ్ కాలేజ్ భవనంతో పాటు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేయాలన్నారు. అయితే కాలేజ్‌కి అటు వైపు కొంత స్థలం ఆక్రమణకు గురువుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కలెక్టర్ వెంటనే సర్వే చేయించి కాలేజ్‌కి కేటాయించిన స్థలాన్ని పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ అమరేంద్ర కృష్ణను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లిన కలెక్టర్‌ను మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్‌కుమార్, మిగతా ప్రొఫెసర్లు, వైద్యులు ఆస్పత్రికి తాగునీటి వసతి, ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రి వరకు వీధిదీపాలు అవసరమని కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యతో మాట్లాడి ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారీ నుంచి ఆసుపత్రి ఆవరణలోకి బస్సులను నడిపించాలని సూచించారు. చివరగా సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రం పక్కన దాదాపు పూర్తి కావస్తున్న హ్యాండ్ లామ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. రూ.8.50 కోట్లతో చేపట్టిన హ్యాండ్ లూమ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఇంకా మిగిలిపోయిన డోర్స్, కిటికీలు, ఇతక ఎలక్ట్రికల్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సెంటర్ చుట్టూ ప్రహరీ, నిర్మాణం సీసీ రహదారి నిర్మాణం, టాయిలెట్ బ్లాక్ పనులు కోసం అదనంగా రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని, ఆయా నిర్మాణ పనులను తొందరంగా ప్రారంభించి పూర్తి చేసి హ్యాండ్‌లూమ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ టీజీ ఎంఎస్‌ఐడీసీ అధికారులు సూచించార. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, టీజీ ఎంఎస్‌ఐడీసీ ఈ ఈ వేణుగోపాల్, డీఈ కృష్ణమూర్తి, తహసీల్దార్ అమరేందర్ కృష్ణ, ఏ ఈ సాయి మురారి తదితరులు పాల్గొన్నారు.

**ఆసుపత్రి నిర్మాణ పనుల పర్యవేక్షణ**

కృష్ణ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రగతి నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. రెండు ఎకారల ప్రభుత్వ స్థలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ ఆసుపత్రి నిర్మాణ పనులను, ఆదేవిధంగా ప్లాస్టరింగ్ దశలో ఉన్న పిహెచ్‌సీ భవనం లోసల కొనసాగుతున్న మెడికల్ ఆఫీసర్ గది, స్టాఫ్ రూమ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ గదులను పరిశీలించి నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశ్నించగా మరో మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తవుతాయని వారు తెలిపారు. పిహెచ్ సీ చుట్టూ ప్రహరీ నిర్మాణం ప్రతిపాదనల్లో ఉందా లేదా? అడిగి తెలుసుకున్నారు.జింకల పార్కు ఏర్పాటు కోసం ముడుమాల్ శివారులో గల ప్రభుత్వ స్థలాన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించారా?లేదా? అని రెవెన్యూ అధికారులను అడిగి కలెక్టర్ వెంటనే అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, టీజీ ఎంఎస్‌ఐడీసీ ఈ ఈ వేణుగోపాల్, డీ.ఈ కృష్ణమూర్తి, ఏ.ఈ సాయి మురారి, కృష్ణ తహసీల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**ప్రగతి నిర్మాణ పనులను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్**

మక్తల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రగతి నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. మక్తల్ సమీపంలో 916/2,917/2 సర్వే నంబర్‌లోని పదెకరాల ప్రభుత్వ స్థలంలో రూ.34 కోట్ల వ్యయంతో చేపట్టిన 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే ఉన్నాయని, పనుల్లో వేగం పెంచాలని ఆమె సూచించారు. మైల్డ్ స్టోన్ ప్రకారం నిర్మాణ పనులు త్వరగా జరగాలని ఆదేశించారు. ఆస్పత్రి భవన నిర్మాణ సమూనా ప్లాన్ ను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, టీజీ ఎంఎస్‌ఐడీసీ ఈ ఈ వేణుగోపాల్, డీ.ఈ కృష్ణ మూర్తి, ఏ.ఈ సాయి మురారి, మక్తల్, కృష్ణా తహసీల్దార్లు సతీష్ కుమార్, శ్రీనివాస్ ఎంపీడీఓ రమేష్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 35వ వార్డు గాంధీనగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను స్థానికులకు అందించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మనస్సును గెలుచుకుందన్నారు. మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, దైద కాశయ్య, గూడపూరి శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

## భూభారతి అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలన



ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్: భూభారతి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం సూర్యాపేట మండలం తహసిల్దార్ కార్యాలయంను అకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి అర్జీలపై అధికారులు, బృందాలు గ్రామాల వారిగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హులకు నూతన రేషన్‌కార్డులు కూడా త్వరగా పంపిణీ చేయాలని అదేశించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ భూ భారతి రెవిన్యూ సదస్సుల ద్వారా 1758 అర్జీలు వచ్చాయని, 369 అర్జిలను విచారణ చేయనైనదని, వాటిలో 34 అర్జిలను పరిష్కరించడం జరిగిందని, మిగిలినవి వివిధ దశలో ఉన్నాయని అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణయ్య, డిటి లావణ్య, సీనియర్ అసిస్టెంట్ కపిల్, అధికారులు పాల్గొన్నారు.



## కార్మిక, కర్షక పేద వర్గాల పక్షాన పోరాడిందే కమ్యూనిస్టు పార్టీ

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/కోదాడ: ఈనెల 19 నుండి 22 వరకు తెలంగాణ రాష్ట్ర సిపిఐ మహాసభలను మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లో జరుగుతున్నాయని ఈ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ మండల కార్యదర్శి జిల్లా సమితి సమావేశం కోదాడ సిపిఐ కార్యాలయంలో భూపేస్‌భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన వహించగా బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 100 సంవత్సరాల పోరాట చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ దేశ స్వతంత్ర్యం కోసం నాటి నుండి నేటి వరకు కార్మిక, కర్షక పేద వర్గాల పక్షాన పోరాడింది సిపిఐ పార్టీ అని అన్నారు. రాష్ట్ర మహాసభల గత మూడు సంవత్సరాల కాలంలో పోరాటంపై చర్చించి భవిష్యత్ ప్రణాళిక ప్రజల పక్షాన పోరాటం చేయడానికి తగిన కార్యచరణను రూపొందించబడుతున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు దొడ్డ పద్మ సంతాపం వ్యక్తం తెలిపి ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త ప్రతిన భూనాలని పార్టీ జెండాను ప్రజల ముందుకు తీసుకవెళ్లాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షేక్ లతీఫ్, బద్దం కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, సాయిబెల్లి, రెడిమాల రాజు, దొడ్డ వెంకటయ్య, చేపూరి కొండలు, ఎరసాని రవి, పిల్లుట్ల కనకయ్య, దొడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు?

## పోలీస్‌శాఖకు మంచిపేరు తేవాలి

### రాష్ట్ర పోలీస్ డ్యూటీమీట్‌లో పతకాలు సాధించిన సిబ్బందిని అభినందించిన ఎస్‌పి కె.నర్సింహ్మా



ప్రజాపక్షం/సూర్యాపేట: వరంగల్ జిల్లా మామూనూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 1, 2 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ యాదాద్రి జోన్ తరుపున సూర్యాపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతికత దర్యాప్తు నందు నిర్వహించిన పోటీల్లో హెడ్ కానిస్టేబుల్ కళ్యాణచక్రవర్తి తృతీయ స్థానంలో మెడల్ సాధించారు. అలాగే నార్కోటిక్ డాగ్ రోఫిక్ ఉత్తమ ప్రతిభ చూపి మత్తు పదార్థాల తనిఖీ నందు డ్రాగ్ ట్రైనర్ సతీష్ ఉత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా హెడ్ కానిస్టేబుల్ కళ్యాణచక్రవర్తి, డాగ్ ట్రైనర్ సతీష్ లను జిల్లా ఎస్‌పి కె.నర్సింహా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ డ్యూటీమిట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన వారిని అభినందించారు. పుణే పట్టణంలో జరగనున్న జాతీయ పోలీస్ మీట్‌లలో కూడా పాల్గొని అక్కడ తమ ప్రతిభను కనబర్చి పతకాలు సాధించి జిల్లా పోలీస్‌శాఖకు మంచిపేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, ఎఆర్ డిఎస్‌పి నర్సింహచారి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

### మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి అన్నారు. అమృత మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్ ఆధ్వర్యంలో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పుల్లారెడ్డి చెరువు వద్ద నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవసరమన్నారు. మొక్కలు మన భవిష్యత్‌కు పుత్రులకు ఆస్తి అన్నారు. ప్రతి ఇంటి ఎదుట, ప్రతి విభాగంలో కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. వర్షభావం పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు చెట్ల కొరతే మొదటి కారణమన్నారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక చెట్టైన నాటితే భవిష్యత్ ప్రాణవాయువుతో నిండి ఉంటుందనే సందేశంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరి ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టిఎంసి శ్వేత, శివప్రసాద్, వసుందర, విజయ్, వసీమ్, అమృత మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్ సభ్యులు పాల్గొన్నారు.

## కృష్ణానదిలో యువకుడు అదృశ్యం

**గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు..**

ప్రజాపక్షం/నందికొండ: సాగర్ ప్రాజెక్టు అందాలు తిలకిద్దామని కొంత మంది యువకులు నాగార్జునసాగర్ కు రావడం అందులో ఒక యువకుడు నదిలో అదృశ్యం అయినా ఘటన నందికొండ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.నాలుగవ తేదీ సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా మంచాలమండలం లో ఎలక్ట్రిషియన్ గా పనిచేస్తున్న మందని శి(23) తన ముగ్గురు స్నేహితులై న దుసరి ప్రసాద్‌అలియాస్ గణేశ్, సొప్పరి శివ, పండుగ నర్సింహాతో కలిసి 4వ తేదీ సోమవారం రాత్రి 6:30గంటలకునాగార్జున సాగర్ చూద్దామని పైలాన్ కాలనీ క్రొత్త బ్రిడ్జి వద్దకు చేరు కొన్నారని. ఆ సమయంలో వారందరూ కొత్త బ్రిడ్జి వద్ద నిలబడి సెల్ఫీ లు దిగుతూ ఉండగా మందని శివ అనే యువకుడు కొత్త బ్రిడ్జి గోడపై నుంచి నదిలో పడిపోయినట్లు శివ స్నేహితులు శివ తండ్రికి తెలపడంతో అతని తండ్రి మందని కొమర య్య మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయడం జరిగిందని కొమర య్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్తయ్య తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక సీఐ శీనయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై తో పాటు హాలియా కు చెందిన 19 మంది ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం అదృశ్యమైన యువకుని కోసం కృష్ణా నదిలో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

# దేశంలోనే ఆదర్శ నియోజకవర్గాలుగా కోదాడ, హుజూర్‌నగర్

**అభివృద్ధి కార్యక్రమాలపై జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి**



ప్రజాపక్షం/కోదాడ/హుజూర్‌నగర్: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గాలుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధి పనులపై అధికారులతో హైద్రాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం యూనివర్శిటిలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రశ్న లేదన్నారు. నిర్దేశించిన సమయంలో లిఫ్టు ఇరిగేషన్లు పూర్తి చేయాలని, లిఫ్ట్ ఇరిగేషన్‌ల భూసేకరణకు అందరూ సహకరించాలి, లిఫ్టుల నిర్వహణలో రైతులు భాగస్వాములు కావాలన్నారు. రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4460 ఎకరాలకు రూ.47.64కోట్ల రూపాయలతో పాలేరు వాగుపై నిర్మించడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌ని 54.03 కోట్ల రూపాయలతో 5వేల ఎకరాలకు పాలేరు వాగు ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆర్9 లిఫ్ట్ ఇరిగేషన్ మునగాల, నడిగూడెం మండలానికి చెందిన 3500 ఎకరాలకు రూ.8.45 కోట్లతో నిర్మించడం జరుగుతుందని అన్నారు. మోతె లిఫ్ట్ ఇరిగేషన్ ని 244 కోట్ల రూపాయలతో 45,736 ఎకరాలకు 4.5 టిఎంసిల నీరు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. పులిచింతల వెనుక జలాలని ఉపయోగించుకుని ముక్త్యాలబ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో 1450 కోట్ల రూపాయలతో 53000 ఎకరాలకు నీరు అందించడం జరుగుతుందని,ఇప్పటికే 188.32 ఎకరాలకు భూ సేకరణ చేసి నష్ట పరిహారం అందించడం జరిగిందని,జూలై 2026 నాటికి పూర్తి చేయాలని, పైపుల నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను అదేశించారు. పాలకీడు మండలంలో జవహర్ జానపహడ్ లిఫ్టు ఇరిగేషన్ ద్వారా పదివేల ఎకరాలకు 302.20 కోట్లతో డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అదేశించారు. కొమటి కుంట, గుండ్లపహాడ్ చెరువులకి నీరు వచ్చేలా కాలువ ఏర్పాటుకు పరిశీలించాలని అధికారులకు సూచించారు. బెట్టెతండా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2041 ఎకరాలకు 26.02 కోట్ల రూపాలయతో నిర్మిస్తున్నామని జాన్‌పహడ్, బెట్టెతండా లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం పూర్తయితే శాశ్వతంగా నీరు అందించి పాలకీడు మండలం సస్య శ్యామలం అవుతుందని అన్నారు. నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ 3200 ఎకరాలకు నీరు అందించేందుకు 31 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అదేశించారు. పులిచింతల ద్వారా విద్యుత్ తయారీ చేసిన నీటి ద్వారా రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మేళ్లచెరువు, కోదాడ, చిలుకూరు, చింతలపాలెం మండలాలకి చెందిన 14100 ఎకరాలకు 320 కోట్లతో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. మహంకాళి గూడెం, మంచ్యతండా ఎత్తి పోతల పథకాలకు మరమ్మతులు చేపించాలని అధికారులను అదేశించారు. బూరగడ్డ చెర్వు సర్వే చేసి కబ్జాలో ఉన్న వారిని తొలగించి సరిహద్దులు గుర్తించాలని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తెచ్చేందుకు స్మాల్ మీడియం లిఫ్ట్ ఇరిగేషన్‌లు నిర్మిస్తున్నామని రైతుల నుండి సేకరించిన భూములకు నష్ట పరిహారం ఇస్తామని, పైపులు భూమిలోపటి నుంచి వేసి పైన సాగు చేసుకోవచ్చని, ఆ భూసేకరణ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులను ఒప్పించాలని అదేశించారు.

### కోదాడ, హుజూర్‌నగర్‌లలో ఆధునీకరణ బస్టాండ్ లకు పంద్రాగస్టున శంకుస్థాపన

కోదాడ బస్టాండ్‌ని ఆధునికరణ బస్టాండ్‌గా నిర్మించుటకి రూ. 16.89 కోట్లు, హుజూర్‌నగర్ నందు బస్టాండ్ నిర్మించుటకు రూ.3.52 కోట్లు మంజూరు చేశామని పంద్రాగస్టు రోజున కోదాడ, హుజూర్‌నగర్ ఆధునీకరణ బస్టాండ్లకు శంకుస్థాపన చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారులు ఏర్పాటు చేయాలని, ఆరు నెలలలోపు పూర్తి చేయాలని అదేశించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తూ, పార్కింగ్, క్యాంటిన్, ఎసి వెయింటింగ్ హాల్, పిడింగ్ రూమ్ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు అదేశించారు. గరిడేపల్లి, నేరేడుచర్ల, మేళ్లచెరువు బస్టాండ్‌లలో పరిశుభ్రం చేసి టాయిలెట్స్‌ని నిర్మించాలని, కోదాడ జాన్‌పహడ్ వయా మఠంపల్లి, నేరేడుచర్ల మీదుగా జాన్‌పహడ్, చెన్నాయిపాలెం, యాతవాకిళ్ల, గానుగబండా, మోతె మండలం సిరికొండలకు, కాపుగల్లు, యర్రవరం బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. కోదాడ డిపోకు ఎక్కువ బస్సులు కేటాయించాలని అధికారులను అదేశించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 315.10 కోట్లతో 16 రోడ్ల పనులు 407.4 కిమి లు నిర్మిస్తున్నామని 46.70 కోట్లతో ఆరు బ్రిడ్జిలు నిర్మిస్తున్నామని, హుజూర్‌నగర్ లో 8 కోట్లతో అర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్ నిర్మిస్తున్నామని, డిఎంఎఫ్‌టి 20.44 కోట్లతో 10 రకాల పనులు నిర్మిస్తున్నామని, పాలకీడు, చింతలపాలెంలో ప్రభుత్వ కార్యాలయాలు అలాగే కోదాడ నియోజకవర్గంలో 228.40 కోట్లతో 14రోడ్ల పనులు 272 కిలో మీటర్లు నిర్మిస్తున్నామని, 8 కోట్లతో మునగాల కొక్కిరేణి బ్రిడ్జి నిర్మిస్తున్నామని, అనంతగిరిలో 43 కోట్లతో 3 భవనాలు నిర్మిస్తున్నామని, డిఎంఎఫ్‌టి 6 పనులను 12.97 కోట్లతో నిర్మిస్తున్నామని, కమ్యూనిటి హాల్స్ నిర్మిస్తున్నామని ఎస్‌ఈ సీతరామయ్య వివరించారు.

# సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/మర్రిగూడ: కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఇన్ పేషెంట్లు, అవుట్ పేషెంట్ల సంఖ్యను పెంచాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని చెప్పారు. మంగళవారం ఆమె మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయాలసిస్ యూనిట్‌ను ఇతర విభాగాలను సందర్శించి ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ఆసుపత్రిలో ఉన్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపి ,ఐపి రిజిస్టర్ లను ,ఏఎన్ సి రిజిస్టర్ లు తనిఖీ చేశారు. ఎక్స్ రే ప్లాంట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కాగా ఎక్రే ప్లాంట్ యూనిట్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ నిధుల నుండి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఐపి, ఇన్ పేషెంట్ల సంఖ్య అవుట్ పేషంట్ల సంఖ్యను పెంచాలని, అదేవిధంగా సాధారణ ప్రసవాలు సైతం పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల పారిశుద్ధం, విద్య, భోజనం, వసతి సౌకర్యాలను పరిశీలించారు . విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, అంతే కాకుండా నాణ్యమైన భోజనంతో పాటు ,గుణాత్మక విద్యను అందించాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మాతృనాయక్, తహసిల్దార్, ఇతర అధికారులు ,ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర డాక్టర్లు ఉన్నారు.



## మరో 10 సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండలంలోని లచ్చమ్మ గూడెంలో 33/11 కెవి సబ్ స్టేషన్, చిమిర్యాల గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మరో 10 సబ్ స్టేషన్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సబ్ స్టేషన్ ప్రారంభించడంతో లో వోల్టేజ్ సమస్య ఉండదని అన్నారు. ఒకే రోజు మూడు సబ్ స్టేషన్‌ల ప్రారంభం, రెండు సబ్ స్టేషన్‌ల శంకుస్థాపన చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నారని అన్నారు. ప్రతి రైతుకు నీళ్లు కరెంటు ఉంటే ఈ ప్రాంత రైతులు ఆనందంతో వ్యవసాయం చేసుకుంటారన్నారు. మాది రైతు కుటుంబం కాబట్టి రైతుల కష్టాలు ఏంటో తనకు తెలుసునని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చర్లగూడెం ప్రాజెక్టు పూర్తి అయినట్లయితే ఈ ప్రాంతం సస్య శ్యామలమవుతుందని, నియోజకవర్గం అభివృద్ధి కోసం ఇద్దరం అన్నదమ్ములం కలిసి పని చేస్తామని అన్నారు. నాగెలుపు కోసం కమ్యూనిస్టులు ఎంత కృషి చేశారని, నేను కూడా ఎమ్మెల్సీ కోసం అంత కృషి చేశానని అన్నారు. మొదటి విడతలో అర్హులైన రాకుంటే నిరశపడవద్దని రెండవ విడతలో నేను ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కుంభం శ్రీనివాసరెడ్డి, జక్కలి ఐలయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీను, కాంగ్రెస్ పార్టీజిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, కుక్కల నరసింహ పాల్గొన్నారు.

## జంక్షన్ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని పెద్ద మసీదు ముందు జరుగుతున్న జంక్షన్ అభివృద్ధి పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు తమకు కేటాయించిన పనులను నాణ్యత ప్రమాణాలతో పనులు చేయాలన్నారు. జంక్షన్ అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటరి ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నకిరేకల్‌లో కార్డన్ సెర్చ్

### 350 ఇళ్లల్లో సోదాలు, పట్టుబడిన పత్రాలు లేని 130 వాహనాలు : జిల్లా ఎస్‌పి





ప్రజాపక్షం/నల్లగొండ (నకిరేకల్ ) : కాలనీల్లో,ఇంటి ప్రదేశాల్లో అనుమానితంగా ఎవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నకిరేకల్ పట్టణ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి ఆధ్వర్యంలో 5 మంది సిఐలు,20 ఎస్ఐలు,టిజిఎస్‌పి సిబ్బంది 50 మందితో మొత్తం కలిపి 300 మంది పోలీస్ సిబ్బందితో దాదాపు 350 ఇళ్లల్లో సోదాలు నిర్వహించగా సరియైన పత్రాలు లేని మొత్తం 130 వాహనాలు పట్టుబడగా, వీటిలో 120 ద్వి చక్ర వాహనాలు,10 త్రీ చక్ర వాహనాలు,08 మంది అనుమానితులను గుర్తించడం జరిగిందని వెల్లడించారు.ఇందులో ఒక ఆస్తి సంబంధిత నేరస్తున్నీ అదుపులో తీసుకోవడం జరిగిందని అలాగే ఇతర దేశం నేపాల్ నుంచి వచ్చిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని వీరి ఆధారాలను చెక్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఒక షెడ్ లో అక్రమంగా పట్టుబడిన 15 ఆవు దూడలు గోశాలకు తరలించడం జరుగుతుందన్నారు. గంజా సేవించినట్లుగా అనుమానితులను అదుపులోకి తీసుకొని వీరందరికీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్ రెడ్డి, కరుణాకర్, మహాలక్ష్మయ్య, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అందించే ప్రోత్సాకాలు అందిపుచ్చుకోండి

ప్రజాపక్షం/ ఉండవెల్లి : ప్రభుత్వం అందించే ప్రోత్సాకాలను అర్హతలు ఉన్న వారందరూ అందిపుచ్చుకోవాలని అలంపూర్ మండల వ్యవసాయ అధికారి నాగార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని లింగనవాయి రైతు వేదికలో గ్రామస్థాయి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారి రాజు సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయ అధికారి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం విస్తరణ అధికారులు పంచాయతీ కార్యదర్శులు పంటల నమోదు పీఎం కిసాన్ నిధి. వ్యవసాయం త్రీకరణ రైతుబీమా రైతు భరోసా ఎరువుల లభ్యత తదితర పథకాలపై గురించి గ్రామస్థాయి అధికారులకు తెలియజేశారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ ఫామ్ దరఖాస్తు చేసుకోవాలని రైతులందరూ నీటి వసతులు ఉన్న వారందరూ ఉపయోగించుకోవచ్చని తెలిపారు. డ్రిప్పు స్లిక్ర్యులర్సు. గురించి తెలియజేయడం జరిగింది. పశు సమర్థత శాఖ ఆధ్వర్యంలో పీఎంఈజీఎస్ ఈజీ పి.ఎన్‌ఎల్‌ఎం వంటి పథకాలు గురించి తెలియజేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల మొక్కలు నాటడం ప్రభుత్వం సబ్సిడీ రూపం లో చిన్న సన్నగా కారు రైతులకు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

# ఆయిల్‌పామ్ సాగుతో బంగారు భవిష్యత్తు



ప్రజాపక్షం/ మానవపాడు: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజవర్గం మానవపాడు మండలం మంగళవారం రోజున బీచుపల్లి లోని టి.జి. ఆయిల్ ఫెడ్ నర్సరీ ఆవరణలో ఉద్యాన శాఖ ద్వారా, టీ.జి. ఆయిల్ ఫెడ్ సహకారంతో ఇటిక్యాల, ఎర్రవల్లి, మానవపాడు మండలాలకు చెందిన గ్రామీణాభివృద్ధి శాఖలలోని వివిధ క్షేత్రస్థాయి అధికారులైన, అసిస్టెంట్ ప్రోగ్రాము ఆఫీసర్స్ ఎపిఓ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఈసీ టెక్నికలల్ అసిస్టెంట్ టిఏఫీల్ట్ అసిస్టెంట్లతో ఆయిల్ పామ్ పంట పై అవగాహన,శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.ఏ అక్బర్, టీ.జీ ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంఛార్జి , జి. శివ , నాగరెడ్డి పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.ఏ అక్బర్, గద్వాల డివిజనల్ ఉద్యాన అధికారి ఎమ్. రాజశేఖర్ మాట్లాడుతే 202526 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 3500 ఎకరాల ఆయిల్ పామ్ లక్ష్యంగా కేటాయించడం జరిగింది. ఈ లక్ష్యాన్ని ఉద్యాన శాఖ, టీ.జీ. ఆయిల్ ఫెడ్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో పూర్తి చేయాలి అనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ పామ్ పంట అనేది ఒకసారి వేసుకుంటే 30 సంవత్సరాల వరకు రైతులకు స్థిరమైన ఆదాయం వస్తుంది, చీడపీడల బెడద తక్కువ, అకాల వర్షాలకు వడగండ్లకు ఈ పంట ఎలాంటి నష్టం జరగదు, అంతర్ పంటలతో అదనపు ఆదాయాన్ని పొందచ్చు. అదేవిధంగా ఆయిల్ పామ్ చట్టం 1993 ప్రకారం ప్రతినెల నిర్దేశించిన ధరకు కంపెనీ కొనుగోలు చేయడం జరుగుతుంది. నాణ్యమైన మొక్కలను ప్రభుత్వపరంగా అందజేయడం జరుగుతుంది. డ్రిప్పు సదుపాయం ఎస్సీ, ఎస్టీ, రైతులకు 100 %, సన్న చిన్న రైతులకు 90 %, పెద్ద రైతులకు80% సబ్సిడీ పై అందజేయడం జరుగుతుంది. అదేవిధంగా పంట నిర్వహణకు రూ. 2100, అంతర పంటలకు రూ. 2100 ఇలా ఒక ఎకరానికి రూ. 4,200 ప్రతి సంవత్సరం రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. ఇలా నాలుగు సంవత్సరాలకు గాను రూ. 16,800 రైతులు సబ్సిడీ ద్వారా పొందవచ్చు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఉద్యాన అధికారి ఇమ్రానా , ఐజా ఉద్యాన అధికారి మహేష్, టీజీ ఆయిల్ ఫెడ్ క్లస్టర్ అధికారులు రామకృష్ణ, త్రివిక్రమ్, రాంబాబు పాల్గొన్నారు.

## నేటి నుండి ఎటిసి, ఐటిఐలలో వాక్-ఇన్ అడ్మిషన్స్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఈ విద్యా సంవత్సరానికి ఏటిసి (అడ్వాన్స్డ్ టెక్నాలజి సెంటర్స్)ఐటిఐ లలో వాక్‌ఇన్ అడ్మిషన్ కొరకు నోటిఫికేషన్ జారీ అయినందున జిల్లాలోని ఏటిసి ,ప్రభుత్వ (నాలుగు),ప్రైవేట్ (పది) ఐటిఐ లలో 2025/26,2025/27 సంవత్సరం (ఒకటి,రెండు సంవత్సరాల కోర్సులకు) అడ్మిషను కొరకు అభ్యర్థులు ముందుగా ఆన్లైన్‌లో ఈ నెల 6 నుండి 28 వ తేదీ వరకు రిజిస్ట్రే షన్ చేసుకొని, ప్రతి రోజు ఉదయం 9.00 గం. నుండి మధ్యాహ్నం 1.00 గం. వరకు కోరుకున్న ఏటిసి,ఐటిఐ నందు ఆన్లైన్ అప్లికేషన్,ఒరిజినల్ సర్టిఫికెట్ లతో పజరు కావలసి యున్నది. అభ్యర్థులు ఎస్ఎస్‌సి,టిసి, కుల దృవీకరణ,బోనఫైడ్ స్టడీ 1 నుండి 10 తరగతుల వరకు తెలంగాణలో చదివి ఉంటే వారిని స్థానిక అభ్యర్థులుగా పరిగణిస్తారు. ప్రతి రోజు హాజరైన అభ్యర్థు లలో మెరిట్ ప్రకారం అందుబాటులో ఉన్న ట్రేడ్ లలో సీట్లు కేటాయించబడతాయి అని జిల్లా ఐటిఐల కన్వీనర్,ప్రిన్సిపాల్ ఎ. నర్సింహ్మా చారి తెలిపారు.

# క్రీడ

## తెలంగాణ ఎస్‌పిగా మహమ్మద్ సిరాజ్..?



టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డిఎస్‌పి మహమ్మద్ సిరాజ్‌కు తెలంగాణ పోలీస్ శాఖ ప్రమోషన్ ఇవ్వనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంగ్లాండ్‌తో ఆఖరి టెస్ట్‌లో సంచలన ప్రదర్శన కనబర్చిన సిరాజ్.. టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టిన సిరాజ్.. కీలకమైన రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో చెలరేగి ఇంగ్లండ పతనాన్ని శాసించాడు. దాంతో ఈ హైదరాబాదీ పేసర్ సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సిరాజ్‌ను సోషల్ మీడియా వేదికగా అభినందిస్తున్నారు. విరాట్ కోహ్లీ సైతం సిరాజ్‌ను ప్రత్యేకంగా కొనియాడుతూ ట్వీట్ చేశాడు. తెలంగాణ డిఎస్‌పిగా కొనసాగుతున్న మహమ్మద్ సిరాజ్‌ను పోలీస్ శాఖ అభినందించింది. సిరాజ్ ప్రదర్శనను కొనియాడుతూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'డిఎస్‌పి' మహమ్మద్ సిరాజ్‌కు అభినందనలు. ఇంగ్లాండ్ గడ్డపై టీమిండియాకు చారిత్రాత్మక విజయా న్ని అందించాడు. సిరాజ్ తెలంగాణకే గర్వ కారణం. పోలీసు దుస్తుల్లో ఉన్న క్రికెట్ హీరో' అని తెలంగాణ పోలీసు శాఖ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. దాంతో ఈ ట్వీట్ నెట్టింట్ వైరల్‌గా మారింది. ఈ పోస్టుపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. అద్భుత ప్రదర్శన కనబర్చిన మహమ్మద్ సిరాజ్‌కు ఎస్‌పిగా ప్రమోషన్ ఇవ్వాలని కోరుతున్నారు. డిఎస్‌పిగానే చిరస్మరణీయ విజయాన్నందించాడని, ఎస్‌పి అయితే మరింత మెరుగ్గా రాణిస్తాడని కామెంట్ చేస్తున్నారు. అతని ప్రదర్శనను పరిగణలోకి తీసుకొని ఎస్‌పిగా ప్రమోషన్ ఇవ్వాలని రిక్వెస్ట్ చేస్తున్నారు. అయితే రూల్స్ ప్రకారం సిరాజ్‌ను నేరుగా ఎస్పీని చేసే అవకాశం లేదు.

## ఇంగ్లండ్‌పై విజయంతో
## డబ్ల్యుటిసిలో మూడోస్థానానికి టీమిండియా..



యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదో టెస్టును ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2–2తో సమం చేసింది. 2025–27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ కొత్త సైకిల్ టీమిండియాకు ఇదే తొలిసిరీస్. రెడ్ బాల్ ఫార్మాట్‌లో భారత జట్టుకు గిల్ నాయకత్వం లో మొదటిసారి టీమిండియా ఇంగ్లాండ్‌లో పర్యటించింది. ఈ సిరీస్‌ను గెలుచుకోలేకపోయినా.. చివరిదైన ఓవల్ టెస్టులో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. ఈ విజయం చాంపియ న్‌షిప్ పాయింట్ల పట్టికలో టీమిండియా మూడోస్థానానికి చేరుకున్నది. ఓవల్ టెస్ట్‌కు ముందు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా.. ఇప్పుడా స్థానంలో ఇంగ్లాండ్ ఉన్నది. భారత్ ఐదు మ్యాచుల్లో రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో 28 పాయింట్లతో పాటు 46.67శాతం పర్సంటేజ్ ఉన్నది. ఇక ఆస్ట్రేలియా జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నది. ఆస్ట్రేలియా మూడు మ్యాచుల్లో మూడు విజయాలను నమోదు చేసింది. శ్రీలంక జట్టు రెండోస్థానంలో ఉన్నది. రెండు మ్యాచులు ఆడగా.. అందులో ఒకటి గెలువగా.. మరొకటి డ్రాగా ముగిసింది. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచుల్లో రెండింట్లో గెలిచి.. రెండింట్లో ఓడిపోగా.. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నది

## ఆసియా కప్‌పై గురి..
### బంగ్లాదేశ్ తాత్కాలిక బృందంలో 25 మంది..!



బంగ్లాదేశ్ జట్టు ఆసియా కప్ కోసం సన్నాహకాలు షురూ చేసింది. మెగా టోర్నీకి ముందు స్వదేశంలో నెదర్లాండ్స్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది బంగ్లా. దాంతో ఈ సిరీస్‌తో పాటు ఆసియా కప్‌ను దృష్టిలో ఉంచుకొని మంగళవారం సెలెక్టర్లు ప్రిలిమినరీ స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. లిటన్ దాస్ సారథిగా 25 మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. వికెట్ కీపర్ నురుల్, మాజీ కెప్టెన్ శాంటోలకు చోటు దక్కింది. డచ్ జట్టుపై సిరీస్ విజయంతో ఆసియా కప్ పోటీలకు ఆత్మ విశ్వాసంతో వెళ్లాలనుకుంటోంది బంగ్లాదేశ్. ఈ సిరీస్ ముగియడమే ఆలస్యం.. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా ఆసియా కప్ మొదలవ్వనుంది. 'అందుబాటులో ఉన్న క్రికెటర్లు ఆగస్టు 6లోపు మిర్పూర్‌లోని ఫిట్‌నెస్ క్యాంప్‌లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 15 నుంచి నైపుణ్య శిక్షణ కొనసాగనుంది. ఆగస్టు 20 నాటికి క్యాంప్ సిల్హెట్‌కు తరలిపోనుంది' అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. మూడు టీ20ల సిరీస్ కోసం నెదర్లాండ్స్ జట్టు ఆగస్టు 26న బంగ్లాకు రానుంది. ఆగస్టు 30న మొదటి మ్యాచ్, సెప్టెంబర్ 1న రెండో టీ20, సెప్టెంబర్ 3న మూడో మ్యాచ్ జరుగనున్నాయి.

**ఆసియా కప్ తాత్కాలిక స్క్వాడ్ :** లిటన్ దాస్(కెప్టెన్), తంజిద్ హసన్, నయీం షేక్, సౌమ్య సర్కార్, మహ్మద్ పర్వేజ్ హొసేన్, తౌహిద్ హృదోయ్, జకీర్ అలీ అనిక్, మెహిదీ హసన్ మిరాజ్, షమీమ్ హొసేన్, నజ్ముల్ హుసేన్ శాంటో, రిషద్ హొసేన్, షక్ మహెదీ హసన్, తన్వీర్ ఇస్లాం, నసుం అహ్మద్, హసన్ మహ్మద్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ షకీబ్, సైఫుద్దీన్, నహిద్ రానా, ముస్తాఫిజుర్, షొరిఫుల్ ఇస్లాం, సయ్యద్ ఖలీద్ అహ్మద్, ఖాజీ నురుల్ హసన్, మహిదుల్ ఇస్లాం, మహ్మద్ సైఫ్ హసన్.

# మహిళ

## ఫోకస్

అధిక జనాభా కలిగిన భారతాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో లింగ వివక్ష లేదా జెండర్ డిస్క్రిమినేషన్ అత్యంత కీలకమైనదేకాదు.. అత్యంత ప్రధానమైనది కూడా. దేశంలో అత్యధిక శాతం మంది మహిళలు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. లింగ వివక్ష కనిపించని రంగం ఎక్కడా కనిపించదు. ఉన్నత విద్యా రంగంలోనూ ఈ వివక్ష స్పష్టంగా కనిపిస్తున్నది. దేశవ్యాప్త ఉన్నత విద్యా సంస్థల్లో మహిళా నాయకత్వం కేవలం 11.24 శాతానికే పరిమితం అయ్యిందని ఇటీవల అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీలు, ఐఐటీ,

## 'ఉన్నత విద్య'లోనూ వివక్షే!

ఐఐఎం, డీమ్డ్ యూనివర్సిటీలు మొత్తం 1352 ఉండగా, ఆ సంస్థల్లో కేవలం 152 ఉన్నత విద్యా సంస్థలకు మాత్రమే మహిళా నాయకత్వం ఉందని గణాంకాలు చెప్తున్నాయి. భారతీయ ఉన్నత విద్యా సంస్థలకు మహిళా నాయకత్వం 11.24 శాతం మాత్రమే ఉండడంతో సింగ్ వివక్ష ఏ స్థాయిలో ఉన్నది అర్థం అవుతున్నది. విద్యా సంస్థల్లో మహిళా నాయకత్వం పాతాళాని దిగజారడానికి ప్రధాన కారణాలుగా పురుషాధిక్య సమాజం, మహిళా శక్తిని చిన్నచూపు చూడడం, సమాజంలో మహిళల్ని చులకన చేసి చూడడం, వారి శక్తి సామర్థ్యాలను తక్కువ అంచనా వేయడం, ఉన్నత విద్యార్హతకు కలిగిన మహిళల శాతం తక్కువగా ఉండ డం, అర్హత కలి



గిన మహిళలు ముందుకు రాకపోవడం లాంటి పలు అంశాలను పేర్కొనవచ్చు. 2021లో విద్యా సంస్థల్లో మహిళా నాయకుల భాగస్వామ్యం 9.56 శాతం మాత్రమే ఉందని నివేదికలు పేర్కొంటున్నాయి. నాటి నుంచి నేటి వరకు మహిళల నాయకత్వం 2 శాతం వరకు పెరిగి 11.24 శాతానికి చేరడం కొంత ఊరటను కలిగిస్తున్నది అమెరికా, యూకె, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళా నాయకత్వం దాదాపు 25 శాతం వరకు ఉండడం, బ్రెజిల్ దేశంలో 47.3 శాతం వరకు ఉండడం గమనార్హం. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తొలి 100 యూనివర్సిటీలకు 25 శాతం మహిళలు నాయకత్వం వహించడం జరుగుతోంది. ఉన్నత విద్యా సంస్థ ల్లో నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడంతో పాటు నేటి యువతులకు ప్రేరణ కల్పించటానికి మహిళా నాయకత్వ విజయ గాథల్ని విస్తృతంగా ప్రచారం చేయడం లాంటి ప్రయోగాలు సత్ఫలితాలను ఇవ్వనున్నట్లు నిపుణులు అంటున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలు, కేంద్రీయ ఉన్నత విద్యా సంస్థల్లో మహిళా నాయకత్వం 14.04 శాతం, డీమ్డ్ యూనివర్సిటీల్లో 13.76 శాతం, రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల్లో 13.2 శాతం, ప్రైవేట్ యూనివర్సిటీల్లో 9.18 శాతం, జాతీయ స్థాయి ప్రాధాన్యం కలిగిన సంస్థల్లో 8.53 శాతం వరకు మహిళా నాయకత్వం కొనసాగుతున్నది. టెక్నికల్ విద్యా సంస్థల్లో మహిళా నాయకత్వం చాలా తక్కువగా కనిపిస్తున్నది. మన దేశంలోని 23 'ఐఐటి'ల్లో ఏ ఒక్క సంస్థకు మహిళా నాయకత్వం లేక పోవడం సోచనీయం. దేశంలో ఉన్న 120 'ఐఐటీ', 'ఐఐఐటి', 'ఎన్ఐటి', 'ఐఐఎస్‌సిఆర్' సంస్థల్లో కేవలం ఇద్దరు మహిళలు మాత్రమే నాయకత్వ స్థానాల్లో పని చేస్తున్నారు. దేశంలో ఉన్న 21 'ఐఐఎం'ల్లో కేవలం రెండింటికి మాత్రమే మహిళా నాయకత్వం కనిపిస్తున్నది. అలాగే 15 'ఏఐఐఎంఎస్'ల్లో కేవలం ఒక్క దానికి మాత్రమే మహిళ నాయకత్వం వహిస్తున్నది. భారతీయ ఉన్నత విద్యా సంస్థల్లో మహిళల నాయకత్వం పెంచడానికి పలు చర్యలు అవసరం. ఉన్నత విద్యా సంస్థల్లో మహిళా ఉద్యోగుల సంఖ్యను పెంచడం, ఆర్థిక సామాజిక సంస్కరణలు తీసుకోవడం కనీస అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఈ దిశగా చర్యలు తీసుకొని మహిళా నాయకత్వాన్ని పెంచడానికి గట్టి కృషి చేయాలి. అవసరమైతే 33 శాతం ఉన్నత విద్యా సంస్థల నాయకత్వాలకు మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలి. అన్ని సంస్థల్లో 50 శాతం వరకు మహిళా నాయకత్వాన్ని పెంచడానికి పటిష్ట ప్రయత్నాలు మొదలు పెట్టాలని కోరుకుందాం.

## మార్గదర్శకురాలు
## భౌతిక శాస్త్రంలో మేటి మౌర్స్‌లీ



మహిళల సంఖ్య అత్యల్పంగా ఉండే భౌతిక శాస్త్ర విభాగంలో రాణించడం కష్టం. అద్భుతాలు సృష్టించడం మరీ కష్టం. ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన అతి కొద్దిమంది మహిళల జాబితాలో రజా చెర్కొయ్ ఎల్ మౌర్స్‌లీ ముందు వరుసలో ఉంటుంది. మొరాకోకు చెందిన మౌర్స్‌లీ స్విట్జరాడ్‌లోని అత్యంత ప్రఖ్యాతమైన ఐరోపా న్యూక్లియర్ పరిశోధనా సంస్థ (సెర్న్)లోని ప్రపంచంలోనే అతి పెద్ద భౌతిక ప్రయోగ కేంద్రం 'లార్జ్ హార్డన్ కొలైడర్' (ఎల్‌హెచ్‌సి)లో ప్రయోగాలు నిర్వహించింది. అట్లాస్, సిఎంఎస్ అనే రెండు విభిన్న ప్రయోగాల్లో కీలక పాత్ర పోషించింది. హిగ్స్ బోసన్ సిద్ధాంతానికి అత్యంత కీలకమైన అంశాలను అందించింది. తన పరిశోధనల ద్వారా భౌతిక శాస్త్రంలో కణాల మూల స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో ప్రపంచానికి సహాయపడింది. ఆమె కృషి మొరాకోలో అణు శాస్త్ర అభివృద్ధిని వేగవంతం చేయడమే కాకుండా, ఆఫ్రికా దేశాల్లో శాస్త్రీయ పరిశోధనలకు మార్గదర్శకంగా నిలిచింది. ఆమె విజయాలు మహిళలకు, యువ శాస్త్రవేత్తలకు ప్రేరణగా మారాయి. మౌర్స్‌లీ పరిశోధనలు సైన్స్‌లో మహిళల పాత్రను బలపరిచాయి. ఆమె హిగ్స్ బోసన్ వంటి ప్రపంచ ప్రాముఖ్యత గల ప్రాజెక్టుల్లో నాయకత్వం వహించి, మహిళా లోకానికి మార్గదర్శకురాలైంది. ఆమె విజయం మొరాకో వంటి అతి చిన్న దేశాల్లో మహిళలకు సైన్స్‌లో అవకాశాలు ఉన్నాయని నిరూపించింది. ఆమె యువతీ శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలిచింది. 71 ఏళ్ల వయసులోనూ ఆమె తన సైద్ధాంతిక ఉపన్యాసాలు, వ్యాసాలతో భౌతిక శాస్త్రానికి ఎనలేని సేవలు అందించడం విశేషం. మహిళా లోకానికే గర్వకారణంగా నిలుస్తున్న మౌర్స్‌లీ ప్రేరణగా ఎంతో మంది మహిళల శాస్త్ర, పరిశోధనా రంగాల్లో రాణిస్తారని ఆశిద్దాం.

---

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు నిర్మిస్తాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బలమైన ఉద్యమ కార్యచరణను రూపొందిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల సమితి ఆధ్వర్యంలో నూతనంగా జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శిగా మొట్టమొదటి సారి యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాదులు ఉన్నాయని, తాత్కాలికంగా కొన్ని ఒడిదుడుకులు ఎందుర్కొన్నప్పకి వాటన్నింటినీ తట్టుకొని మళ్ళీ ప్రజల్లోకి వెళ్తామని అన్నారు. సిపిఐకి ఈ జిల్లాలో అనేక త్యాగాలు చేసిన చరిత్ర ఉందని, అదే స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అనేక సమస్యలు కొట్టుమిట్టడుతున్నాయని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని, ప్రభుత్వం ఈ జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయాలని లేని యెడల సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడె చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, రొండి నర్సింహా, బద్దుల సుధాకర్, టంగుటూరు రాములు తదితరులు పాల్గొన్నారు.

## రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా మార్చాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

**ప్రజాపక్షం / రెబ్బెన/ ఆసిఫాబాద్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సి) కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా (సిహెచ్‌సి)గా మార్చాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రోజున రెబ్బెనలో పిహెచ్‌సిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి సీతారాంను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ రెబ్బెనలో సుమారుగా 60 వేల జనాభా ఉండటంతో ప్రతి రోజూ రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారని, ప్రాథమిక కేంద్రం అయి ఉండటంతో అత్యవసర సేవ లు అందడం ఆలస్యమవుతోందని తెలిపారు. జాతీయ రహదారి ప్రక్కనే ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ కేంద్రాన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నా రు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తే స్థానికుల కు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. అదనంగా ఇద్దరు వైద్యులను నియమించి, అవసరమైన సిబ్బందిని కేటాయించాలని డిమాండ్ చేశారు.



## సిపిఐ విస్తరణకు కృషి చేసిన దొండపాటి వెంకయ్య

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం





**ప్రజాపక్షం/కొణిజర్ల :** పేదప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడి ఖమ్మం ఉమ్మడి జిల్లాలో సిపిఐ విస్తరణకు కృషి చేసిన దొండపాటి వెంకయ్య సేవలు శ్లాఘనీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. మండల కేంద్రం కొణిజర్లలో మంగళవారం సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి స్వర్ణ రమేష్ అధ్యక్షతన జరిగిన సిపిఐ సీనియర్ నాయకులు దొండపాటి వెంకయ్య 47వ వర్ధంతి కార్యక్రమంలో బాగం హేమంతురావు పాల్గొని ప్రసంగించారు. దొండపాటి వెంకయ్య సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేసి పార్టీ విస్తరణే లక్ష్యంగా పనిచేశాడని కొనియాడారు. గ్రామంలో రజాకార్ల అకృత్యాలకు ఎదురొడ్డి పోరాడిన కమ్యూనిస్టునాయకుడు అని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను నేటికి కొణిజర్ల మండలంలో ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. బిజేపి ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తు కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. పాలకుల నిర్లక్ష్యం వలన దేశంలో ఉపాధి అవకాశాలు లేక యువత నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి త్యాగ వీరుల స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సరేష్ మాట్లాడుతు నిస్వర్థంగా పార్టీ అభివృద్ధికోసం పనిచేసిన దొండపాటి వెంకయ్య అడుగుజాడల్లో నేటి యువత పనిచేయాలని అన్నారు. ఈప్రాంత కమ్యూనిస్టుల సమస్యలకోసం ఆయన చేసిన పోరాటం మరిచి పోలేనిదని తెలిపారు. ఎర్రజెండా నాయకత్వాన పేదల పక్షాన పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బలాన్ని పెంచుకునే విధంగా కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, దొండపాటి రమేష్, తోట రామాంజనేయులు, లక్ష్మీ నారాయణ, సిపిఎం నాయకులు కొప్పుల కృష్ణయ్య, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, లింగగూడెం మాజీ సర్పంచ్ దొండపాటి లక్ష్మి , జిల్లా సమితి సబ్యులు పాపగంటి సుదర్శన్, సీనియర్ నాయకులు పివిరావు, కొణిజర్ల సిపిఐ సహాయ కార్యదర్శి తోటపల్లి సీతారాములు, తండు సోమయ్య, తనికెళ్ల సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, కంపసాటి వెంకన్న, పిట్టల రాంబాబు, కొణిజర్ల మాజీ ఉపసర్పంచ్ గొడ్డుగొర్ల శ్రీను, రాంబాబు, చల్లా నాగమణి, పుట్టా సత్యనారాయణ, కొమ్మినేని వెంకయ్య, అడపా భాస్కర్‌రావు, అడపా వెంకటేశ్వర్లు, బండారు వెంకన్న, తలారి పాపారావు, గడల శ్రీనివాసరావు, దొండపాటి నాగమణి, సూరంపల్లి లాలమ్మ, దొండపాటి సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం బీడీలను నిషేధించి, సిగరెట్‌ల అమ్మకాలకు ఆహ్వానం




### బీడీ రంగంపై విధించిన ఆంక్షలు తీసివేయాలని బీడీ కార్మిక సంఘ నాయకుల డిమాండ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బీడీ రంగంపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని బీడి కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐటియుసి కార్మిక భవన్ శుభాస్ నగర్లో, తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్,రాజన్న సిరిసిల్ల జిల్లా,కార్యవర్గ,కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు కె.వి అనసూర్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా లాంటి దేశంలో అక్కడి ప్రభుత్వం బీడీలను నిషేదించి,సిగరెట్ ల అమ్మకాలు జరిగేలా చేసిందని,మన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మాత్రం కార్మిక వర్గం నోట్లో మన్ను కొట్టి విదేశీ సిగరెట్‌లకు ఆహ్వానం చెబుతోందని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో లక్షలాది మంది బీడీ పరిశ్రమలో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మంది కార్మికులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. బీడీ టెకేదార్లు కంపెనీలు ఇచ్చే కమిషన్ కాకుండా కార్మికుల నుండి నెలకు 2 వేల నుండి 3 వేల బీడీలు కోత పెడుతున్నారని మండిపడ్డారు. అసలే కార్మికులకు చాలీచాలని వేతనాలకు తోడు దోపిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికులకు జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని, విడి ఏ ప్రకారం బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు 261.97 వేతనం టెకేదార్లు ఇవ్వాలని, ఈపీఎఫ్ఓ పెన్షన్ 6 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విదంగా 4016 రూపాయలు ఆసరా పెన్షన్ బీడీ కార్మికులకు ఇవ్వాలన్నారు. అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ లు,ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. టెకేదార్లు ఆకు తుట్టి, తంబాకు తుట్టి, దారం తక్కువ ఇస్తున్నారని కార్మికులకు ఇబ్బందులు చేయవద్దని,కొన్ని కంపెనీలు కుర్కురేలు, ఇతర సరుకులను తయారు చేసే ఫ్యాక్టరీలు పెట్టుకొని సరుకులను కార్మికులకు అంట గడుతున్నారని ఇది మానాలని హెచ్చరించారు. విదేశీ సిగరెట్‌ల అమ్మకాలు దేశంలో నిషేధించాలని, లేబర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అన్ని రంగాల కార్మికులతో నెలలో ఒక రోజు సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్ల చంద్రమౌళి, గౌరవ అధ్యక్షులు కడారి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జ వేణు, రేగుల అనిత, గుమ్మడవెల్లి మంజుల, సుంకనపెల్లి శాంతమ్మ,ఎంజాల లక్ష్మి , గాజుల రాధ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల వలయంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్

**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సరిపడా తరగతులు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని, కళాశాల ప్రాంగణంలో చుట్టూ ప్రహారీగోడ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాల నేపథ్యంలో తరగతి గదులు సరిపోక విద్యార్థులు అనేక అవస్థలు పడుతూ కళాశాలకు వస్తున్నారని, కలాశాలకు ప్రహారీగోడను నిర్మించాలని, మంచినీటి సౌకర్యం, మూత్రశాలతో పాటు తదితర మౌలిక వసతుల లేమితో ప్రభుత్వ కళాశాలలు విచ్ఛిన్నమవుతున్నాయన్నారు. వెంటనే అధికారులు ప్రభుత్వం దృష్టిసారించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో అనేక ఉద్యమాలకు నాంది పలుకుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, మండల నాయకులు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడం హర్షణీయం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ, కాప్రా డివిజన్‌కు సిఎం రేవంత్‌రెడ్డి 5 కోట్ల 55 లక్షల నిధులు కేటాయించడం పట్ల కుషాయిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం. పరమేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 55లక్షలు, కాప్రా డివిజన్ శ్మశాన వాటికల అభివృద్ధికి 5కోట్లు నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరు కావడంపట్ల మార్కెట్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ రాష్ట్ర మహాసభల కరపత్రాల పంపిణీ

**ప్రజాపక్షం/కాప్రా :** ఈ నెల మేడ్చల్ జిల్లాలో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలంటూ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సమితి కాప్రా సాకేత్ జె ఆర్‌రెడ్డి నగర్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం పార్టీ నిరంతరం అండగా ఉంటూ పోరాటం చేస్తే సిపిఐని ఆదరించాలని కోరారు. కేంద్రం అన్ని వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.సత్యప్రసాద్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, లక్ష్మి నారాయణ, ఎల్లయ్య, మిరియాల సాయిలు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

### అధికారులకు కలెక్టర్ మనుచౌదరి సూచన



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఈ నెల 15న జిల్లా కలెక్టరేట్‌లో జరుగనున్న స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్ల విషయంలో సంబంధిత అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు.మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్య అతిథికి పోలీస్ గౌరవ వందనం, బందోబస్తు, కుర్చీలు, బారికేడింగ్, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా,సాంస్కృతిక కార్యక్రమాలు,అలంకరణలు వంటి విషయాల్లో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా, డిఆర్‌ఓ హరిప్రియ, పరిపాలనాధికారి రామ్‌మోహన్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి

### సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

**ప్రజాపక్షం/తాండూర్ :** యాలాల్ మండలంలో మండల మహాసభ నర్సింలు అధ్యక్షతన అక్కంపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయలక్ష్మి పండిత్ జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ తాండూర్‌కు వస్తున్నారని కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో పోరాడతాం అని అన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాడుతాం అన్నారు. మండల కార్యదర్శిగా నర్సింలు కార్యవర్గ సభ్యులు పువ్వు, అనసప్ప, రాములు, శ్రీశైలం, వనీల్, కిష్టమ్మ, బాబు, పకీరప్పలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు అబ్దుల్లా, రైతుసంఘం కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.




## పేదలకు నిత్యావసర సరుకులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఓల్డ్‌నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో జ్యోతి ఇజ్రాయిల్ జన్మదిన వేడుకల సందర్భంగా మంగళవారం పేదలకు నిత్యావసర సరుకులు ఉచితంగా అందించారు. సంఘసేవకులు షేర్ల అనీల్,దళిత నేతలు పిఎస్ శ్రీనివాస్, జర్నలిస్టు కృష్ణమూర్తి, బాలకృష్ణ, మను, డేవిడ్, సాయి రాజు తదితరులు పాల్గొన్నారు.




## అనాథ బాలలకు కిట్స్, నిత్యావసర సరుకుల పంపిణీ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** అనాథ పేద విద్యార్థులకు తమ సంస్థ అన్ని వేళలా సహకరిస్తుందని షేర్ ద విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణరావు, నిర్వాహకుడు అశోక్‌లు తెలిపారు. కూకట్‌పల్లిలోని చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ బాలల ఆశ్రమంలోని 60 మంది విద్యార్థులకు లక్ష రూపాయల విలువైన స్కూల్ కిట్స్, నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం కారణంగా చాలా మంది విద్యకు నోచుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. తమ సంపాదనలో కొంత సొమ్ము ను పేద, అనాథ విద్యార్థులకు అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు.

## అక్రమ కట్టడాలపై కొరడా



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడితే కఠినచర్యలు తప్పవని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి హెచ్చరించారు. మంగళవారం తూంకుంట మున్సిపల్‌లో మూడు అక్రమ నిర్మాణాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ తూంకుంట మున్సిపాలిటిలో ఎంఎంరెడ్డి కాలనీలో విజన్ హైస్కూల్ భవనం, వేంకటేశ్వర కాలనీలో రెండు భవనాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. గతంలో నోటిసులు ఇచ్చిన పనులు నిలిపివేయడం లేదని దీంతో ఆ భవనాలను సీజ్ చేశామని చెప్పారు. టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీధర్ పర్యవేక్షణలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పట్టణ ప్రజలు అనుమతులు తగినట్లుగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## అలియాబాద్‌లో స్క్రాప్ వేలంపాట

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటిలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్యక్షతన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అలియాబాద్ మున్సిపాలిటిలో పనికిరాని వస్తువులను(స్క్రాప్) వేళంపాట నిర్వహించారు. ఈ వేళం పాటులో 11 మంది పాల్గొనగా మహ్మద్ జావేద్ ఆలీ రూ. 3.27 లక్షలకు వేళం పాటలో స్క్రాప్‌ను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచర్జ్ ఆర్‌ఒ వేణుగోపాల్, ఇంచార్జ్ శానిటరి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ సనా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందనపల్లిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.కుందన్ పల్లిలో సుమారు 20కి పైగా ఇంటర్నల్ పోల్స్‌కి పాత వైర్లు తొలగించి కొత్త వైర్లు వేయాలని,రామలింగేశ్వర కాలనీలో 15,కుందన్‌పల్లిలో 10 కొత్త పోల్స్ ఏర్పాటు చేయాలని,గౌరీ ప్రియా,అనిషా ఎన్‌క్లేవ్ కాలనీలలో తరచుగా లో ఓల్టేజీ సమస్య వల్ల టివిలు,ప్యాన్లు,ఫ్రిడ్జిలు కాలిపోత్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ లో వోల్టేజీ తలెత్తకుండా రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## జొమాటో డెలివరీ బాయ్స్ ధర్నా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** తమ కష్టానికి తగిన విధంగా ప్రతిఫలాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో ఉప్పల్ ప్రాంతంలో మంగళవారం జొమాటో డెలివరీ బాయ్స్ ధర్నా నిర్వహించారు. గత మూడు నెలలుగా తాము రోజుకు 12 గంటలకు పైగా పని చేసినప్పటికి రూ. 500 సైతం రావటం లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇన్సూరెన్స్ సైతం ఇవ్వటం లేదని, తరచు డెలివరీ చేస్తుండగా ప్రమాదాలు చోటు చేసుకొంటున్నా జొమాటో యాజమాన్యం పట్టించుకోవటం లేదన్నారు. న్యాయపరంగా తమకు రావల్సిన హక్కుల గురించి ప్రభుత్వం స్పందించాలని కోరారు.

# మరమ్మతు పనులు పూర్తిచేసి వాడుకలోకి ప్రభుత్వ పాఠశాలలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశం



**ప్రజాపక్షం/కొడంగల్:** విద్యార్థినీ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తు పనులను చేపట్టి వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బాలంపేట్, గోకఫసల్‌బాద్‌లలోని ప్రభుత్వ పాఠశాలలు, బాలంపేట్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మరమ్మత్తు పనులు నాణ్యవంతంగా ఉండాలని,టాయిలెట్లు, పాఠశాల గదులకు తలుపులు, కిటికీలు అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బాలబాలికలకు అనుగుణంగా టాయిలెట్ల ఏర్పాట్లను చేసుకొని పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. స్కావెంజర్ల సిబ్బంది వివరాలతో పాటు నెలవారీ జీతాల చెల్లింపులపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్యంతో పాటు పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేవిధంగా మొక్కలు నాటాలని కలెక్టర్ అధికారుకలు సూచించారు. బాలంపేట్‌లోని కెజిబివి పాఠశాలలో చేపట్టిన పనులతో పాటుగా పడకగదుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రహరీ చుట్టూతా బ్లా పిట్లను అమర్చాలని కలెక్టర్ సూచించారు. కోకపసల్‌బాద్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం అంచనాలను రుపొందించి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధాన రోడ్డును ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో 160మంది బాల కార్మికులకు విముక్తి



**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంలో భాగంగా 160మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా ఎస్‌పి మాట్లాడుతూ కేంద్ర రాష్ట ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ ఎక్స్‌ఐలో కార్యక్రమం విజయవంతమైందని అన్నారు. అన్వర్ పాషా ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌ల వారీగా 3 టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని జులై 1నుండి 31వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాలో మొత్తం 160మంది బాలలను రక్షించామని తెలిపారు. రక్షించబడిన వారిలో 145మంది బాలురు, 15మంది బలికలు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 119మందికిగాను బాలురు 106, బాలికలు 13మంది ఉన్నారు. ఇతర రాష్టాలకు చెందిన 41మందిలో 39 మంది బాలురు, బాలికలు ఇద్దరిని రక్షించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 20ఎఫ్‌ఐర్‌లు 65ఐఆర్ లు నమోదు చేశామని, బాలల బాలల హక్కులను కాపాడవల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో పనిచేసి ఆపరేషన్ ముస్కాన్ ఎక్స్‌ఐ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రత్యేక బృందాల సభ్యులను ఇతర అధికారులను ఎస్‌పి అభినందించారు.




## బిసి ఉద్యమానికి అందరూ సహకరించాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసే లక్ష్యంగా చేస్తున్న బిసి ఉద్యమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బిసి హక్కుల సాధన సమితి కోరింది. న్యూనాగోల్‌లోని డాంగే భవన్ ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్ దిటి నర్సయ్య, బొడ్డుపల్లి కృష్ణలు మాట్లాడుతూ తెలంగాణా కోసం ఉద్యమించిన రీతిలో బిసిల న్యాయపరమైన రాజకీయ వాటా కోసం సకల జనులు మద్దతివ్వాలని, ఎస్సీలు, ఎస్టీలు ఉద్యమానికి వెన్నెముకగా నిలవాలన్నారు. బిజెపి రిజర్వేషన్ బిల్లుకు అడ్డంకిగా మారిందని విమర్శించారు. బాతరాజు నరసింహ, పల్లె రమేష్, పందిరి మదేలు లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## బాలికపై హత్యాచార యత్నం... కేసు నమోదు

**ప్రజాపక్షం/పూడూర్:** పరిగి నియోజకవర్గంలోని చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన చోటుచేసుకుందని మైనర్ బాలికపై హత్యాచార ప్రయత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటనపై వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీస్‌లు, స్థానిక ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పూడుర్ మండల పరిధిలో దామగుండం అడవి ప్రాంతంలో నేవీ రాడార్‌లో పనిచేయానికి వచ్చిన బీహర్ రాష్టానికి చెందిన కృష్ణకుమార్ 24లుగు సంవత్సరం 9సంవత్సరాల బాలికను రేకుల షెడ్డులోనికి తీసుకువెళ్లి హత్యాచార ప్రయత్నం చేశాడని,కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి కేసునమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# ఉద్యోగంలో బదిలీలు సహజం

### మండల సమాఖ్య అధ్యక్షురాలు భ్రమరాంబ



**ప్రజాపక్షం/బంట్వారం:** ఉద్యోగంలో బదిలీలు సహజం అని, జిల్లాలో అన్నింటిలో మొదటి స్థానంలో బంట్వారం మండల సమాఖ్య నిలవడానికి ఎపిఎం దేవయ్య ఎంతో కృషి చేసారని మండల సమాఖ్య అధ్యక్షురాలు భ్రమరాంబ మంగళవారం అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు, ఆహ్వాన సమావేశంలో భాగంగా ఆమె మాట్లాడుతూ... ఉద్యోగంలో బదిలీలు సహజం అని అన్నారు. సిబ్బంది అందరితో కలుపుగోలుగా ఉండి మండలాన్ని మొదటి స్థానంలో ఉంచిన ఘనత ఎపిఎం దేవయ్యకు దక్కుతుందన్నారు. సమాఖ్యలో ఎలాంటి సమస్య ఉన్నా కూడా తనదైన శైలిలో వెనువెంటనే పరిష్కరించి, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేవాడని అన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాల మంజూరులో బంట్వారం మండలం ముందు వరుసలో ఉంచేవారన్నారు. ఇవే కాకుండా స్త్రీశక్తి, న్యూ ఎంటర్ ప్రైజెస్, PMFME, విద్యార్థుల ఏకరూప దుస్తులు వంటి విషయాలలో చురుకుగా పనిచేసేవారని అన్నారు. బంట్వారం నూతనంగా బదిలీపై విచ్చేసిన ఆనంద్‌కు స్వాగతం పలికి శాలువ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర రావు, సమాఖ్య కార్యదర్శి కంసమ్మ, కోశాధికారి వీరమణి, సీసీలు నర్సిములు, ప్రకాష్ గౌడ్, అరుణ్ కుమార్, అనసూయ, లక్ష్మయ్య, మండల వివొల అధ్యక్షులు వీరేశం, విఓఎ లు, తదితరులు ఉన్నారు.

## ఇంటింటికీ బిజెపి నాయకుల ప్రచారం

**ప్రజాపక్షం/పూడూర్:** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండల పరిధిలోని మహసంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో పూడూర్ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి భారత ప్రధాన నరేంద్ర మోదీ పాలనలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధిపనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించిన బిజెపి నాయకులు రాష్టంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు, నెరవేర్చని హామీలపై ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు మల్లేశం పటేల్, మండల అధ్యక్షులు రాఘవేందర్, ప్రకాశ్‌యాదవ్ , కృష్ణచారి, తదితరులు పాల్గొన్నారు.



## విద్యతోపాటు జీవన నైపుణ్యాలు అందించటమే ఉల్లాస్ లక్ష్యం : ఎంఇఒ

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో విఒఎలకు ఉల్లాస్ వర్క్‌షాప్ శిక్షణ కార్యక్రమం ఎంఇఒ వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్య అవకాశం కోల్పోయిన 15సంవత్సరాలకు పైబడిన నిరక్షరాశ్యులకు జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక, ప్రాథమిక విద్యతోపాటు డిజిటల్ అక్షరాల చేత జీవన నైపుణ్యాలు , ఆర్థిక అక్షరాస్యత, వృత్తి నైపూణ్యాలు, నిరంతర విద్యను అందించడమే ఉల్లాస్ ముఖ్యలక్ష్యం అన్నారు. కనీస శక్తి సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం, నేర్పిచడం జరుగుతుందన్నారు. అభ్యాసకులు ఉల్లాస్ యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయవలసిఉంది. 20మంది సభ్యులకు ఒక వాలంటరీని నియమించి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గ్యామా ఎపిఎం శోభ, తదితరులు పాల్గొన్నారు.

## భార్యను కాపాడేందుకు వెళ్లి భర్త, ఆయన చెల్లెలు నాగమ్మమృతి

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్ :** బావిలో దూకిన భార్యను కాపాడబోయి భర్త మైసయ్య, నాగమ్మ మృతి చెందిన సంఘటన మోమిన్‌పేట్ మండల పరిధిలోని చీమలధారి గ్రామంలో చోటుచేసుకుంది, మోమిన్‌పేట్ ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం చీమలు దారి గ్రామంలో పూజిత వెంచర్లో గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పెద్దపల్లి చెందినగత పది సంవత్సరాలుగా భార్యభర్తలు చెల్లెలు కూలీలుగా పనిచేస్తున్నారు.




తగ రెండు మూడు రోజుల నుండి భార్యఅలివేలి భర్త మైసయ్య తో కుటుంబ సమస్యలతో గొడవపడేవారు, భర్త మీద ఉన్న కోపంతో భార్య ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకోని బావిలో దూకింది. వెంటనే చెల్లెలు నాగమ్మ తన భార్యను కాపాడుకోవడానికి ఇద్దరు కలిసి బావి దగ్గరికి వెళ్లారు భార్యబావిలో పడి చావుతో కొట్టుమిట్టడుతుంటే తనను కాపాడాలని ఇద్దరు కలిసి బావిలోకి దుకారు. దురదృష్టవశాత్తులో భార్య అలివేలు బతికింది కాని భర్త, చెల్లెలు మృతి చెందారు. పోలీసులు కేసునమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లికి తరలించారు. అలివేల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# కెసిఆర్‌పై అవినీతి మరక అంటించేందుకు యత్నం

**ప్రజాపక్షం/దుండిగల్ :** బిఆర్‌ఎస్ భవన్ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సస్య శ్యామలం చేసేందుకు బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ చేసిన కృషిని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలంగాణ ప్రజానీకానికి, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ లోని మేడ్చల్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత పాలకుల హయాంలో అడుగడుగునా నిర్లక్ష్యానికి గురై పాలకుల అసమర్ధ పాలనతో, తెలంగాణపై ఉన్న వివక్షతతో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక బీడుబారిన తెలంగాణ ప్రాంతాన్ని మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా సస్యశ్యామలం చేసిన అపర భగీరధుడు, తెలంగాణ దార్శనికులు బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో తన బృహత్తర ప్రణాళికలతో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుతో రైతన్న కళ్ళల్లో ఆనందం నింపి, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేసి దేశంలోనే అత్యధిక దిగుబడి నిచ్చే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన కెసిఆర్‌పై అవినీతి మరక అంటించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుటిలయత్నాలు చేస్తుందని, దీనిని ప్రజలంతా గమనిస్తున్నారని, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రగతిని కుంటుపరచిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారనీ హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఆవశ్యకత, ఇంత భారీ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయరంగానికి కలిగిన లబ్ధిని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో అసంబద్ధ ఆరోపణలను నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు వివరించాలన్నారు.







## సంతానంలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్య

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తీవ్ర మనస్థాపానికి గురైన వ్యక్తి శామీర్‌పేట పెద్ద చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం ప్రాంతానికి చెందిన రవికాంత్(38) కి శాలినితో గత పన్నెండెళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలుగడం లేదని తీవ్ర మనస్థాపానికి గురైన రవికాంత్ సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పాడు. మంగళవారం శామీర్‌పేట చెరువులో ఓ శవం తేలియాడుతు కనిపించడంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. చుట్టుపక్కల ఉన్న పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇవ్వడంతో బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైందని తెలుసుకున్నారు. మృతుడి కుటుంబీకులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించగా రవికాంత్‌దే అని గుర్తించారు. దీంతో శామీర్‌పేట పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని శంకర్ పల్లి ఎంపిడిఒ వెంకయ్య గౌడ్ అధికారులను ఆదేశించా రు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇతర విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలోని గ్రామాలలో 210 ఇందిరమ్మ ఇండ్ల బేస్ మెట్లు పూర్తి అయ్యాయని చెప్పారు. అందులో 68 మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లో మొదటి విడత లక్ష రూపాయలు వేయడం జరిగిందన్నారు.45 రోజులు దాటిన బేస్మెంట్ పనులు ప్రారంభించని లబ్ధిదారుల పేర్లు జాబితా నుండి తొలగించలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## పారిశుద్ధ్య కార్మికులు సమన్వయంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజా ఆరోగ్య భద్రతే లక్ష్యంగా, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభుత్వం తీసుకుందని, పారిశుద్ధ్య కార్మికులు, కాలనీ సంక్షేమ వాసులతో కలిసి సమన్వయం చేసుకోని పనులు చేయాలని హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలు అన్నారు. మంగళవారం డివిజన్లోని చైతన్య నగర్‌లో మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోడ్లు, కాలనీలు, బహిరంగ ప్రదేశాలల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగించాలని సూచించారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి, నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దోమల బెడదను నివారించడానికి ఎంటమాలజీ అధికారులు ఫాకింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన ఉండాలని, సంబంధిత అధికారులు పరివేక్షణలో పనులు జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఇఇ రమేష్ బాబు, శానిటేషన్ డిఇ నీలిమా, ఏఇ రవీందర్‌రెడ్డి, గోపాలకృష్ణ, కాలనీ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆంజనేయస్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, అంజయ్య యాదవ్, బక్కని నర్సింలుతోపాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ చేయడం శుభ సూచకమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా భగవంతుని స్మరించుకోవడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో నేతలు రఘునాథ్‌యాదవ్, దినేష్ సాగర్, వెంకటేష్, శివచారి, సుధీర్, మధు, బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నటరాజన్, లక్ష్మణ్‌నాయక్, రంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు రావడం అభినందనీయం అని ఖిల్లా మైసమ్మ దేవాలయ మాజీ ఛైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అప్స స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భారత సేవాశ్రమం సహకారంతో విద్యార్థులకు పుస్తకాలను, పెన్నులను పంపిణీ చేశారు. తాను చదువుకున్న పాఠశాలకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయాల కోసం రైతుల ప్రయోజనాలు తాకట్టుపెడుతున్న కాంగ్రెస్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీ రైతుల ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నదని రంగారెడ్డి జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు కమీషన్ వక్రీకరణలు, వాస్తవాలు అనే అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్ నుండి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఆయన శంషాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో వీక్షించారు. అనంతరం ఆయన నాయకులనుద్దేశించి మాట్లాడుతూ కాళేశ్వరంపై కాకమ్మ కబుర్లు చెబుతూ గోదావరి జలాలను వృథాగా క్రిందకు వదిలేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వం తొంబై శాతం పూర్తిచేసిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కాలువలు త్రవ్వడానికి కూడా పాలకులకు చేతులు రావడం లేదని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ 85 పిల్లర్లలో కుంగిన రెండింటిని సరిచేయాలని ఎన్‌డిఎస్‌ఎ సూచించినా పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. రైతులకు మేలు చేయడానికి ఇటువంటి చర్యలు చేపట్టవలసిన పాలకులు కేవలం కక్ష సాధింపు చర్యలకు మాత్రమే పరిమితమవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో కాదు.. గల్లీలో బిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వండి

**ప్రజాపక్షం/కొందుర్గు:** బిసి రిజర్వేషన్లపై ఢిల్లీలో కాదు.. గల్లీలో చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందో చెప్పాలని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొందుర్గులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వెళ్ళడం కాదు.. గల్లీలో చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందో..లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ గ్రామాన రచ్చబండలు ఏర్పాటు చేసి ప్రజలకు బిసి రిజర్వేషన్లపై క్లారిటి ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందే తప్పా ఇచ్చే అలోచనలో ఏమాత్రం లేదన్నారు. 10శాతం ఉన్న ముస్లింలకు 10శాతం రిజర్వేషన్ ఇస్తే 50శాతం ఉన్న బిసిలకు 32శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కపట ప్రేమను తరిమికొట్టేందుకు బిసిలంత ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. బిసిల పేరుతో ముస్లింలకు లబ్ధి చేకూర్చాలని చూస్తే బిజెపి ఊరుకోదని, బీసిలందరికి ఏకం చేసి కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నేతలు మంగన్న గారి బలవంత్‌రెడ్డి, బోయ శంకర్, కార్తీక్ యాదవ్ పాల్గొన్నారు.



# సిపిఐ రాష్ట్ర నాలుగో మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

మహాసభలకు శ్రేణులు తరలిరావాలి
: పాలమాకుల జంగయ్య పిలుపు



**ప్రజాపక్షం/శంషాబాద్:**భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఆగస్టు 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో జరగనున్నాయి. ఈ మహాసభల విజయవంతం కోసం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన శంషాబాద్ పట్టణంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. మహాసభల్లో ప్రజా సమస్యలు, రాజకీయ పరిస్థితులు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలపై చర్చించి తగిన విధి విధానాలు రూపొందించనున్నట్లు తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా '2026 మార్చి నాటికి మావోయిస్టులు లేని భారతదేశం చూస్తాం' అనే వ్యాఖ్యలు బాధాకరమని ఆయన విమర్శించారు. కమ్యూనిజం ప్రజల కష్టాల్లో పుట్టిన సైద్ధాంతిక సిద్ధాంతమని, దాన్ని అమీషా, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు తుడిచిపెట్టలేవని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర మహాసభలకు రంగారెడ్డి జిల్లా నుండి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.పోస్టర్ విడుదల కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు,రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే.రామస్వామి, ఓరుగంటి యాదయ్య, పై మీద జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభులింగం, బుద్ధుల జంగయ్య, పల్నాటి యాదయ్య, బాధరాజు నరసింహ, కన్యగారి నరసింహారెడ్డి, ఆర్. యాదగిరి, వడ్ల సత్యనారాయణ, ఎం.ఎ. రియాజ్, జిల్లా సమితి సభ్యులు నరగిరి తదితరులు పాల్గొన్నారు.

### జంగయ్యకు శంషాబాద్‌లో శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మూడవసారి ఎన్నికైన పాలమాకుల జంగయ్యను మంగళవారం శంషాబాద్‌లో సిపిఐ రాష్ట్ర,జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, సిపిఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి పాల్గొన్నారు. అనంతరం గిరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పేదలకు న్యాయం చేయడంలో, నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు, పింఛన్లు అందించడంలో,కాలనీలు,బస్తీలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం జంగయ్య అనేక ఉద్యమాలు చేసిన నాయకుడని అన్నారు. ఇకముందు కూడా జిల్లా సమితి పిలుపు మేరకు ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలలో పాల్గొంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. యాదగిరి,కన్యగారి నరసింహారెడ్డి, ఎం.ఎ. రియాజ్, మున్సిపల్ రంగం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామావత్ సక్రునాయక్, ఏఐటియూసి శంషాబాద్ మండల కార్యదర్శి రాజు,తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు.. నాలుగు బైక్‌లు స్వాధీనం

వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేయడంతోపాటు నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ తెలిపారు. మంగళవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన నర్సింలు అనే వ్యక్తి జూన్ 19న తన బైక్‌ను పట్టణంలో బస్టాండ్‌లోని కోరియర్ ఆఫీస్ పక్కన పార్కు చేశారని వివరించారు. తిరిగి జూన్ 21వ తేదిన చూడగా కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఆగస్టు 4వ తేదిన సాంకేతిక ఆధారాలతో కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన నిందితుడు కొర్ర వినోద్‌ను ఆదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటకు వచ్చిందని వివరించారు. ఇండ్ల ముందు, దుకాణాల ముందు తాళాలు వేసి ఉన్న వాహనాలను ఎవరు చూడని సమయంలో హ్యాండిల్ విరగొట్టి దొంగిలిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో 4కేసులు, ఆర్‌జిఐ పోలీస్ స్టేషన్‌లో 1కేసు, అఫ్జల్‌గంజ్ పిఎస్ పరిధిలో 2కేసులు మొత్తం 11కేసుల్లో దొంగతనం చేసి జైలుకు వెళ్ళి వచ్చినట్లు వివరించారు. నిందితుడి నుండి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసిపి లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సిఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శివారెడ్డి, క్రైమ్ టీం రవీందర్, సంతోష్, కరుణాకర్, జాకీర్, రాజులు ఉన్నారు.

## త్వరలో జిల్లాల్లో పర్యటిస్తా : అనిరుధ్ గుప్తా



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి అగర్వాల్ సమాజ్ సభ్యుల సభ్యత్వ నమోదు చేపడుతామని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా తెలిపారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని రాఘవరత్న టవర్‌లో అగర్వాల్ సమాజ్ కమిటీ సభ్యుల, కార్య నిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనిరుధ్ గుప్తా మాట్లాడుతూ అగర్వాల్ సమాజ్ భవిష్యత్తు ప్రణాళికలు గురించి తెలిపి సభ్యత్వ ప్రచారాన్ని పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు. 18 ఏండ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారికి ఉచిత సభ్యత్వంపై , సమాజ్ ఉద్యోగులకు ప్రివిలేజ్ కార్డు అందించే విషయంపై, అధికారిక వెబ్‌సైట్ ప్రారంభంపై చర్చించామని ఆయన వివరించారు.

## అథ్లెటిక్స్ పోటీల్లో తపస్వీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని సరూర్ న గర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో వనస్థలిపురం డివిజన్‌లోని రెడియో కాలనీలో గల తపస్వీ పాఠశాల విద్యార్థులు పోటీల్లో రాణించి గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల చైర్మన్ గౌరిగ ప్రదీప్ కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలల్లో రన్నింగ్ రేసులో గోల్డ్ మెడల్ మెడల్ సాధించిన మౌర్య నాయక్, జానలిన్ త్రో విభాగంలో రెండవ బ్రాజ్ మెడల్స్ రావడం జరిగిందని, మెడల్ సాధించిన విద్యార్థులకు స్వీట్లు తీనిపించి అభినంధించారు. విద్యాతో పాటు క్రీడాల్లో రాణించినప్పుడే విద్యార్థులలో దగిన నైపుణ్యతను గుర్తిస్తామన్నారు.

## అందెల నివాసానికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** ఇటీవల హర్యానా గవర్నర్‌గా పదవీ విరమణ పొందిన బండారు దత్తాత్రేయ మంగళవారం రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు నివాసానికి విచ్చేశారు. ఈ మేరకు నాదర్‌గుల్‌లోని అందెల నివాసానికి విచ్చేసిన దత్తత్రేయకు నియోజకవర్గం బిజెపి నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పనిచేసి రాబోయే ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయాలని దత్తత్రేయ పార్టీ నేతలకు సూచించారు. అనంతరం అందెల కుటుంబ సభ్యులు, నాయకులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. అనంతరం దత్తాత్రేయ ను అందెల శ్రీరాములు యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్‌రెడ్డి, కడారి జంగయ్యయాదవ్, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్లగుడెం రామ కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన సెవెన్ హిల్స్ కాలనీ జాయింట్ యాక్షన్ కమిటీ



**ప్రజపక్షం /హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ సేవన్ హిల్స్ సౌత్ ఎండ్ పార్క్ డిపి నగర్ హిమపురి కాలనీ ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుదీర్ రెడ్డిని కలిసి పైనుండి వచ్చే వర్షపు నీరు కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ డ్రైన్ లో మురుగు నీరు కేమికల్ వాటర్ తో కలిసి వస్తున్నాయ్ దానివలన ఇంటిలో ఉండ లేకపోతున్నాము అని ఓపెన్ డ్రైన్ లో కలుపుతున్న వారిమీద చెర్యలు తీసువాలని వినతి పత్రం ఇచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తొరలో అధికారులు తో కలిసి వచ్చి స్వయంగా సమస్యను పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కత్తుల రాంబాబు, కమలాకర్, మధు, ప్రవీణ్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నాణ్యత ప్రమాణాలతో కూడిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 11,12,13,14వార్డులో ఎమ్మెల్యేతోపాటు అధికారులు పర్యటించి చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు, వేగం పాటించి పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, స్థానిక నాయకులు సూచించారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఉన్నత పాఠశాల వరకు వేయనున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులతోపాటు మంచినీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఫరూఖ్ నగర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి సంబంధించిన దిమ్మెను కొత్తగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించా రు. పనుల్లో ఎలాంటి జాప్యం ఉన్న ఉపేక్షించేది లేదని, సకాలంలో పూర్తి అయ్యే విధంగా చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, కాంగ్రెస్ నేతలు మహ్మద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. స్థానిక వార్డుల మహిళలకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న వివరించారు. నాణ్యత ప్రమాణాలతో సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు కృషి చేయాల

## తల్లిపాలు మంచి ఔషధం

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తల్లిపాలను మించిన ఆహారం మరొకటి ఉండదన్నారు. బిడ్డకు తల్లిపాలు ఆహారం మాత్రమే కాదు, మంచి ఔషధం అని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు అన్నారు. మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో మనిషి తప్ప ఏక్షీర జంతువులు తమ పిల్లలకు ఇతర జంతువుల పాలు పట్టదు అని, తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించినారు. బిడ్డ పుట్టిన తర్వాత రెండు రోజులు వచ్చు పాలు మురుపాలు బిడ్డకు జీవితాంతం రక్షణ కలగజేస్తే, రక్ష రక్షక కణాలు ఉంటాయని, ఇది బిడ్డకు మొదటి టీకాతో సమానం అని తెలిపారు. తల్లిపాలను మించిన ఆహారం మరొకటి ఉండదన్నారు. బిడ్డకు తల్లిపాలు ఆహారం మాత్రమే కాదు,మంచి ఔషధం అని వివిధ రకాల వ్యాధుల నుండి కాపాడుతుందని తెలిపారు. రోగశక్తి పెరగడమే కాకుండా బిడ్డ ఎదగడానికి ద్రోహం చేస్తుంది అందుకే కనీసం ఆరు నెలల పాటు తప్పకుండా తల్లిపాలు పట్టించాలని ఆయన స్పష్టం చేశారు. సహజ సిద్ధమైన తల్లిపాలలో యాంటీబాడీలు,విటమిన్లు నాణ్యమైన ప్రోటీన్లు ఒమేగా త్రి వంటి బిడ్డ మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రాధిక,డాక్టర్ పూనం,మాస్ మీడియా మీడియా అధికారి కొప్పునమోని శ్రీనివాసులు,డిపిహెచ్‌ఎన్‌ఒ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**ప్రజాపక్షం/గండిపేట:** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్పూర్ సెక్టర్ 5 శేర్లింగంపల్లి ప్రాజెక్ట్ ద్వారా ప్రపంచ తల్లిపావారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ సరస్వతి మాట్లాడుతూ అమృతం లాంటి తల్లి పాలు తాగిన బిడ్డకు ఎలాంటి వ్యాధులకు గురికాకుండా తల్లీ,బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. శిశువుకు మొదటి టీకా ముర్రుపాలు అని, ముర్రుపాలు తాగిన బిడ్డ ఎదుగుదల బాగా ఉంటుందన్నారు. శిశువుకు తల్లి పాలు ఎప్పుడైనా ఎక్కడైనా తాగించవచ్చని తల్లిపాలు ఇచ్చే ముందు బ్రెస్ట్ శుభ్రం చేసుకుని తల్లిపాలు పడితే బ్రెస్ట్ క్యాన్సర్ రాదన్నారు. ముర్రుపాలు ఎల్లో కలర్‌లో జిగటగా ఉంటాయని, తల్లిపాలు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ డబ్బా పాలు తాగించవద్దని బాలింతలకు ఆమె సూచించారు. కార్యక్రమంలో గర్భిణీసిలు ,తదితరులు.పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. నర్సరీ మొక్కలు బావిపాలు

గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్‌లో తరలింపు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పాడుబడ్డ బావిపాలు అవుతున్నాయని మాజీ సర్పంచ్ సుమితా చందునాయక్ ఆరోపించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీలోని నర్సరీలో అధికారులు ఇలా పెంచడం అలా ట్రాక్టర్‌లో తీసుకువెళ్ళి బావిలో పరవేయడం అనవాయితీగా వస్తుందని వివరించారు. వన నర్సరీ ఏర్పాటు కోసం ప్రభుత్వం లక్షలు ఖర్చు చేస్తుంటే అధికారులు మాత్రం బుడిదలో పోసిన పన్నీరు మాదిరి గా చేస్తున్నారని ఆరోపించారు. గుట్టు చప్పుడు కాకుండా అధికారులు సోమవా రం మధ్యాహ్నం నర్సరీ నుండి మొక్కలను తీసుకొని వెళ్ళి పాడుబడిన బావిలో వేశారని తెలిపారు. నర్సరీలో మొక్కలను పెంచి నాటేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అదేశిస్తే అధికారులు మాత్రం అందుకు బిన్నంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. నర్సరీలో ఉన్న మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులది కాదా అని ప్రశ్నించారు. ప్రజాధనం దుర్వినియోగం చేయడమే లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు సకాలంలో స్పంధించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### రెండేళ్ల క్రితం చనిపోయిన మొక్కలనే పడేశాం : అశోక్‌రెడ్డి

రెండేళ్ల క్రితం చనిపోయిన మొక్కలను మాత్రమే తాము తీసుకువెళ్ళి పాడుబడిన బావిలో వేశామే తప్పా కొత్తవాటిని ఏమి వేయలేదని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్‌రెడ్డి అన్నారు. నర్సరీలో కొత్త మొక్కలు పెంచేందుకు స్థలం లేకపోవడంతోనే చనిపోయిన మొక్కలను పారవేశామని పేర్కొన్నారు. మేజర్ గ్రామ పంచాయతీలకు ఇస్తున్న టార్గెట్‌ను చిన్న పంచాయతీలకు ఇస్తుండటంతోనే కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.

## బెట్టింగ్ యాప్‌కు బానిసై ప్రాణం తీసుకున్న పోస్టల్ ఉద్యోగి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** బెట్టింగ్ గేమ్స్‌కు అలవాటుపడి తన ప్రాణం తీసుకున్న ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సహా రా స్టేట్స్, మన్సూరాబాద్ నివాసం ఉంటున్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నరేష్ (38) పోస్టల్ ఉద్యోగిగా వనస్థలిపురంలోని ఆటో నగర్‌లో డిస్పాచ్ సెక్షన్(స్టోరింగ్ అసిస్టేంట్) గా విధులు నిర్వహిస్తున్నాడు. సాహారా స్టేట్స్‌లో భార్య కీర్తి, పాప భ వ్యితో కలిసి నివాసం ఉంటున్నారు. గత కొంత కాలంగా ఆన్‌లైన్ బె ట్టింగ్ యాప్‌లో గేమ్స్‌కు బానిసై అయినవాళ్ళ దగ్గర అప్పులు చేసి దా దాపు 9లక్షలు అప్పు చేసి, అవి తీర్చలేని పరిస్థితిలో భార్యను ట్యాబ్లెట్ తీసుకురామన్ని బయటకు పంపించి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు వనస్థలిపురం ఎస్‌ఐ గిరీష్ కుమార్ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## నందివనపర్తిలో ఇంటింటికి బిజెపి..

**ప్రజాపక్షం/యాచారం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టికి చెందిన వారిని అత్యధిక ఓట్లతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ కమిటి సభ్యులు యాచారం మండల ఎన్నికల విభాగరి బోసుపల్లి ప్రతాప్ అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో బిజెపి మహసంపర్కు అభియాన్ లో భాగంగా ఇంటింటికి బిజెపి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మేకల యాదగిరి రెడ్డి, కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు మరిపల్లి అంజయ్య యాదవ్ మండల అధ్యక్షులు జరుపుల విజయ్‌నాయక్‌తదితరులు పాల్గోన్నారు.

# రీల్

## బర్త్‌డే స్పెషల్.. పోస్టర్ విడుదల




మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట దర్శకత్వంలో నిర్మిస్తున్న విశ్వంభర సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. త్వరలోనే విడుదలకు సిద్ధం అవుతోంది. చిరంజీవి సరసన హీరోయిన్‌గా ఆశికా రంగనాథ్ నటిస్తోంది. ఆశికా బర్త్ డే సందర్భంగా పోస్టర్ రిలీజ్ చేశారు. విశ్వాంభర సినిమాలో ఆశికా చాలా కీలకమైన పాత్రను పోషించారు. ఇందులో త్రిషా కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. యూవి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎంఎం కీరవాణి సంగీతం అందించారు.

## జటాధర ఫస్ట్ లుక్



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా లీడ్ రోల్స్‌లో జీ స్టూడియోస్, ప్రెర్నా అరోరా ఎస్‌కే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్న నేచురల్ థ్రిల్లర్ 'జటాధర' ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. పోస్టర్ అద్భుతంగా వుంది. మానవాళి వర్సెస్ దైవత్వం, శాపం వర్సెస్ శక్తి మధ్య సంగ్రామానికి చిహ్నంగా నిలిచింది. మెరుపుల మధ్య ఆకాశాన్ని చీల్చుకుంటూ త్రిశూలం దూసుకెళ్తుంటే, సుధీర్ బాబు యుద్ధానికి సిద్ధమవుతాడు. అతని వెనుక ఉగ్ర శివుడి రూపం కనిపిస్తుంది. ఈ ఫస్ట్ సినిమాపై చాలా క్యురియాసిటీ పెంచింది. ఈ సినిమా టీజర్ ఆగస్ట్ 8న విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్నారు. వరల్డ్ క్లాస్ గ్రాఫిక్స్, ఏఐఎన్‌హాన్స్‌డ్ స్టోరీటెల్లింగ్, స్క్రీన్‌ప్లేతో సిమిమా విజువల్ గ్రాండియర్‌గా వుండబోతుంది.




## 22న 'త్రిబాణధారి బార్బరిక్' విడుదల

స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. పాన్ ఇండియన్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రంలో వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రధాన పాత్రల్ని పోషించారు. సత్య రాజ్ మాట్లాడుతూ 'త్రిబాణధారి బార్బరిక్' సినిమాలో పని చేసినందుకు ఆనందంగా ఉంది. మేమంతా కూడా మాదే మెయిన్ పాత్ర అని చెప్పుకోవచ్చు. ఈశ్వర్ నాతో డ్యాన్స్ చేయించారు. రమేష్ మా అందరినీ అద్భుతంగా చూపించారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు ఇతర సీన్లను కూడా అడిగి చూశాను. కెమెరా యాంగిల్‌తోనే సస్పెన్స్‌ను క్రియేట్ చేశారు. 70 ఏళ్లు దాటినా కూడా నేను కొత్త కొత్త పాత్రల్ని చేయాలని అనుకుంటున్నాను. రెగ్యులర్ పాత్రల్ని కాకుండా 'బార్బరిక్' లాంటి కొత్త పాత్రల్ని మరిన్ని చేయాలని అనుకుంటున్నాను అని అన్నారు.

## పవన్ కళ్యాణ్ సపోర్ట్ మరచిపోలేను

### దర్శకుడు హరీష్ శంకర్



పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో మైత్రి మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమా షూటింగ్ చిన్న చిన్న ప్యాచ్ వర్క్ తప్ప మిగితా షూటింగ్ అంతా పూర్తయింది. అయితే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేయడానికి పవన్ కళ్యాణ్ ఇచ్చిన సపోర్ట్ జీవితంలో మరిచిపోలేనని దర్శకుడు హరీష్ శంకర్ అన్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన గబ్బర్ సింగ్ సినిమా సూపర్ సూపర్ హిట్ అయింది. ఇప్పుడు ఇద్దరి కాంబినేషన్‌లో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా తెరకెక్కుతోంది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరలో విడుదల చేయనున్నారు. గబ్బర్ సింగ్ సినిమా కంటే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను మరింత జాగ్రత్తగా కష్టపడి చేశామని హరీష్ శంకర్ తెలిపారు. మా ఇద్దరి కాంబినేషన్ లో మరో సూపర్ డూపర్ హిట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆడియన్స్ థ్రిల్ ఫీలయ్యే సినిమా



ఎస్‌జె శివ

కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్', ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్‌జె మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమౌతుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్‌జె శివతో జరిపిన చిట్ చాట్.

*** బకాసుర రెస్టారెంట్ ఎలాంటి కథాంశం ?**

బకాసుర ఎంటర్‌టైన్‌మెంట్ అనేది ఒక హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్. ఇప్పటి వరకు తెలుగులో చాలా జోనర్‌లు వచ్చాయి. ఇదొక కొత్త జోనర్. మా సినిమాతోనే ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఇదొక తిండిబోతు కథ. దానిని నుంచి వచ్చే కామెడీ కాబట్టి హంగర్ కామెడీ అంటున్నాం. ఫైనల్‌గా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే మా లక్ష్యం.

*** ఈ సినిమాలో హీరోగా కమెడియన్ ప్రవీణ్‌ను తీసుకోవడానికి కారణం ఏమిటి?**

మొదట వేరే హీరోలతో డిస్కస్ చేశాం. కానీ అందరూ సోలో హీరో కథలైతే చేస్తాం అన్నారు. కానీ ఈ కథ అలాంటిది కాదు. ఆ సమయంలోనే ప్రవీణ్ కూడా హీరోగా ఇంట్రడ్యూస్ అయ్యే ప్లానింగ్‌లో వున్నాడని తెలిసి ఆయన్నీ కలిశాం.ఐదుగురు బ్యాచిలర్స్ మధ్య జరిగే కామెడీ కథ ఇది. ఇక ఈ కథ వినగానే ప్రవీణ్ ఈ సినిమాకు కథే హీరో.. తప్పకుండా మనం చేద్దా అన్నాడు.

*** మీ నేపథ్యం ఏమిటి?**

నేను లండన్‌లో ఇంటర్నేషన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్తిచేశాను. విరూపాక్ష చిత్రానికి అసిస్టెంట్ దర్శకుడిగా పనిచేశాను. ఇక గతంలో మా నాన్న కొన్ని సినిమాలు నిర్మించారు. ఆయన కోరిక, ఆయన కల తీర్చడం కోసమే నేను దర్శకుడిగా, మా అన్నయ్య నిర్మాతగా మారాడు.

*** ఇది బకాసుర రెస్టారెంట్‌లో జరిగే కథనా?**

రెస్టారెంట్ పెట్టడమే కథ. రెస్టారెంట్ పెట్టాలని కలలు కనే ఓ యువకుడి కథ ఇది. ఈ అంశానికి హారర్, థ్రిల్లింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్ అంశాలు జోడించాం. ఇదొక క్లీన్ కామెడీ.. అందరూ ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ చిత్రమిది.

*** ఇదొక కొత్త జానర్.. ఎక్స్‌పెరిమెంట్ అనుకోవచ్చా?**

నిజమే ఇదొక కొత్తజానర్‌తో పాటు కమర్షియల్ ఎక్స్‌పర్‌మెంట్ అనుకోవచ్చు. ఇంతకు ముందు వచ్చిన యమలీల, ఘటోత్కచుడులా ఆడియన్స్ థ్రిల్లింగ్‌గా ఫీలయ్యే కథ ఇది. ఇలాంటి కొత్త కథలనే జనాలు ఆదరిస్తారనే నమ్మకం వుంది. మన జీవితంలోకి ఓ తిండిబోతు దెయ్యం వస్తే ఆ తిప్పలు ఎలా ఉంటాయి అనేది కథ. సినిమా మొత్తం కంప్లీట్ ప్యాకేజీలా ఉంటుంది. హారర్ థ్రిల్లర్, కామెడీ, ఎమోషన్ అన్నీ ఉంటాయి.

*** ఈ సినిమాను దిల్‌రాజు గారు పంపిణీ చేస్తున్నారని తెలసింది?**

అవును. శిరీష్ సినిమా చూసి మెచ్చుకున్నారు. ఈ సినిమా కథ గురించి ఆయన మాతో గంటసేపు డిస్కషన్ చేశాడు. ఎస్వీసీ లాంటి గొప్ప సంస్థ ఈ సినిమాను విడుదల చేయడం ఆనందంగా ఉంది

*** కొత్తకథతో, స్టార్స్ లేకుండా ఇంత బడ్జెట్ అవసరమా?**

కథను నమ్మి ఈ సినిమాను చేశాం. పెద్ద హీరోలను పెట్టిన రిటరన్స్ వస్తాయని గ్యారంటిగా చెప్పలేని రోజులివి. పెద్ద హీరోకు ఇవ్వాల్సిన పారితోషికం మేము మేకింగ్‌లో పెట్టాం. క్వాలిటీగా సినిమా తీశాం. కంటెంట్ బాగుంటే సినిమాలు సూపర్‌హిట్ అవుతాయని ఎన్నో సినిమాలు ప్రూవ్ చేశాయి.

*** మీ తొలి సినిమా అనుభవం ఎలా ఉంది?**

సినిమా తీయడం చాలా టఫ్.. ఇక్కడ సినిమా బిజినెస్‌లో ఎవరైనా కథ ఏమిటి? ఎలా ఉండబోతుంది? అని అడగటం లేదు. ప్యాడింగ్ ఎవరు? ఎంత పెట్టారు? ఎంత ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు అని అడుగుతున్నారు. సినిమా అనేది ఎంటర్‌టైన్‌మెంట్ కానీ దాని గురించి తప్ప అన్నీ అడుగుతున్నారు.

*** మీ తదుపరి చిత్రం కూడా మీ బ్యానర్‌లోనే చేస్తారా?**

మా ఎస్‌జె బ్యానర్‌లో కొత్త దర్శకులకు మాత్రమే అవకాశం. సో.. నా తదుపరి చిత్రం ఇందులో ఉండదు. ఈ బ్యానర్‌లో వరుసగా సినిమాలు చేస్తాం. చాలా తక్కువ వర్కింగ్‌డేస్‌లో సినిమాలు చేయడం అంటే ఇష్టం. ఈ విషయంలో పూరీ నాకు ఆదర్శం. ఈ రోజుల్లో నిర్మాత డబ్బు విరాళంగా మారిపోతుందనేది నా ఫీలింగ్. అలా కాకుండా ఆ డబ్బును ప్రాపర్‌గా ఖర్చు పెట్టాలి. అప్పుడూ అందరూ బాగుంటారు. మా బకాసుర రెస్టారెంట్ ఐదు కోట్ల రూపాయాలతో తీసిన 12 కోట్ల రూపాయాల అవుట్‌పుట్ కనిపిస్తుంది.

## 2026లో జీ2 విడుదల



బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ గూఢచారికి సిక్వెల్‌గా తెరకెక్కుతున్న మూవీ జీ2 విడుదలకు సిద్ధమవుతోంది. అడవి శేష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాను 2026 మే 1న థియేటర్లలో రిలీజ్ కానుంది. అడివి శేష్ హీరోగా మరో సరికొత్త మిషన్‌కి రెడీ అవుతున్న ఈ సినిమాకి గ్రాండ్ లెవెల్ పోస్టర్స్‌తో రిలీజ్ చేశారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం, ఫస్ట్ పార్ట్ గూఢచారి సక్సెస్‌ను బేస్‌గా తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు. 150రోజుల పాటు, 6 దేశాల్లో షూటింగ్ చేసి, 23 భారీ సెట్లతో తెరకెక్కించిన ఈ మూవీ, ఇండియన్ సినిమాలో స్పై థ్రిల్లర్ జానర్ ని రీడిఫైన్ చేయనుంది. ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తోంది. యాక్షన్‌తో పాటు ఎమోషన్ వున్న క్యారెక్టర్ ఇది. ఈ మూవీతో ఇమ్రాన్ హష్మీ తొలిసారి తెలుగు తెరపై కనిపించబోతున్నారు. అలాగే మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## 'మాస్ జాతర' నుంచి 'ఓలే ఓలే' పాట విడుదల



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మొదటి గీతంగా విడుదలైన 'తు మేరా లవర్' అందరినీ ఉర్రూతలూగించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'ఓలే ఓలే'ను విడుదల చేశారు. ధమాకా జోడి రవితేజశ్రీలీల తెరపై కనిపిస్తే ఆ సందడే వేరు. 'ఓలే ఓలే' పాటతో ఈ జోడి మరోసారి ఆకట్టుకుంది. రవితేజ తన వింటేజ్ స్టెప్పులతో అలరించారు. శ్రీలీల తన అసాధారణ నృత్య ప్రతిభతో మరోసారి కట్టిపడేశారు.

## దుల్కర్ సల్మాన్ కొత్త చిత్రం షురూ..



వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ అద్భుతమైన స్క్రిప్ట్ సెలెక్షన్స్‌తో ఎప్పుడూ యూనిక్ కథలు, చాలెంజింగ్ రోల్స్‌తో అలరిస్తున్నారు. తన 41వ చిత్రం తెరకెక్కుతుంది. దుల్కర్ సల్మాన్ హీరోగా నూతన దర్శకుడు రవి నేలకుదిటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ ప్రారంభించారు. లవ్ స్టోరీ హ్యూమన్ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తారు. ముహూర్తపు షాట్‌కు నేచురల్ స్టార్ నాని క్లాప్ కొట్టారు. దర్శకుడు బుచ్చి బాబు సానా కెమెరా స్విచ్ ఆన్ చేయగా, గుణ్ణం సందీప్, నాని, రమ్య గుణ్ణం స్క్రిప్ట్‌ను టీంకు అందజేశారు. ఫస్ట్ షాట్‌ను రవి నెలకుడిటి స్వయంగా దర్శకత్వం వహించారు. దసరా, ది ప్యారడైజ్ చిత్రాల దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయింది.

ఈ చిత్రానికి అనయ్ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు, జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.ఈ చిత్రం తెలుగు, మలయాళం, హిందీ, కన్నడ, తమిళ భాషలలో పాన్ ఇండియా విడుదల కానుంది.

## అత్తమామలపై కేసు రద్దు చేసిన హైకోర్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివాహ వివాదాల నేపథ్యంలో అత్తమామలపై దాఖలైన కేసును హైకోర్టు రద్దు చేస్తూ జస్టిస్ జువ్వడి శ్రీదేవి ఇటీవల తీర్పు వెలువరించారు. ఐపీసీలోని 498–ఎ, వరకట్న నిషేధ చట్టంలోని 3, 4 సెక్షన్ల కింద నమోదైన కేసుల్లోని ఆరోపణలకు స్పష్టత లేదని, సాదాసీదా ఆరోపణలతో కేసు పెట్టారని తప్పుపట్టారు. నిర్దిష్ట ఆధారాలు లేకుండా కేసు పెట్టారని ఆక్షేపించారు. మహారాష్ట్రకు చెందిన గోవింద్ ప్రసాద్ శర్మ, ఉష శర్మ వృద్ధ దంపతులైన అత్తమామలపై రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, అత్తాపూర్‌లో ఉండే కోడలు ఫిర్యాదు చేశారు. శర్మ కుమారుడు మహేశ్‌కు 2017లో వివాహం జరిగింది. అత్తమామలపై కోడలు 2022లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేధిస్తున్నారంటూ 498–ఎ కింద కేసు నమోదు అయ్యింది. మహారాష్ట్రలోని ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం ప్రయత్నం చేస్తూనే అత్తమామలు రూ.10 లక్షలు అదనపు కట్నం ఇవ్వాలని వేధిస్తున్నారని కేసు పెట్టారని, అయితే, అత్తమామలు దౌర్జన్యం చేశారని బాధితురాలు ఆరోపించారేగానీ, ఏతేదీన, ఎక్కడ దౌర్జన్యానికి పాల్పడిందీ వివరించలేదని న్యాయమూర్తి తప్పుపట్టారు. కుటుంబసభ్యులపై నిరాధార ఆరోపణలు చేసి తప్పుడు కేసులు నమోదు వల్ల చట్టం దుర్వినియోగం అవుతోందని వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు భజన్‌లాల్ కేసులో జారీ చేసిన మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ, వ్యక్తిగత ప్రతీకారంతో అత్తమామలపై కేసు పెట్టినట్లుగా ఉందన్నారు. అత్తమామలపై క్రిమినల్ కేసును రద్దు చేస్తూ తీర్పు వెలువరించారు.

## నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన ఉద్యమ నాయకుడు

### చందు నాయక్ సంతాప సభలో ఇటి నరసింహ్మా, వి.ఎస్.బోస్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూ పోరాటాల ద్వారా నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన ఉద్యమ నాయకుడు చందు నాయక్ అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు ఇటి నరసింహ, వి.ఎస్.బోసు కొనియాడారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు కె.చందు నాయక్ సంతాప సభ జరిగింది. జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో ఇటి నరసింహ, వి.ఎస్.బోస్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ యువ నాయకుడిగా ఎదుగుతున్న సమయంలో చందు నాయక్ దారుణ హత్యకు గురికావడం సిపిఐ పార్టీకి తీరని లోటన్నారు. హైదరాబాద్ మహానగరంలో ఇళ్ల స్థలాల కోసం భూపోరాటాల చేసి అనేక మందికి గుడిసెలు వేయించి పట్టాలిపించడమే కాకుండ, వారి రక్షణ కోసం మురికివాడల్లోనే చందు నాయక్ తన నివాసాన్ని ఏర్పరచుకొని, పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మంచి మనిషిని కోల్పోవడం బాధగా ఉన్నప్పటికీ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రధాన కర్తవ్యంగా సాగుతామని తెలిపారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్‌బోస్ మాట్లాడుతూ చందు నాయక్ ప్రజల కోసం తనజీవితాన్ని అంకితం చేశారని, గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం కోసం కృషి చేశారని తెలిపారు. ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ భూపోరాటాలు, మలిదశ తెలంగాణ ఉద్యమంతోపాటు కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తి కోసం జరిగిన అలుపెరగని పోరాటాల్లో చందు నాయక్ చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. ఈ సభలో ఎఐటియూసి రాష్ట్రకార్యదర్శి బి.వెంకటేశం, తెలంగాణ శ్రామిక మహిళా ఫోరమ్ కన్వీనర్ పి.ప్రేమ్‌పావని, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, పడాల నళిని, సీనియర్‌నాయకులు ఆర్.శంకర్ నాయక్, ఖైరతాబాద్ నియోజకవర్గం కార్యదర్శి మామిడిచెట్ల వెంకట్ స్వామి, చందు నా యక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయవాద వృత్తి విలువల పరిరక్షణకు పద్మనాభ రెడ్డి ఎనలేని కృషి

### ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయవాద వృత్తిలో విలువల పరిరక్షణ కోసం ప్రముఖ న్యాయవాది పద్మనాభ రెడ్డి చేసిన కృషి ఆదర్శనీయమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవిఎల్ అధ్యక్షతన పద్మనాభ రెడ్డి సంస్మరణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బొమ్మగాని ప్రభాకర్ పద్మనాభ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వేలకు పైగా కేసులను వాదించిన ప్రముఖ న్యాయవాది పద్మనాభ రెడ్డి విలువలతో కూడినవృత్తిని నిర్వహించి అందరి అభిమానాన్ని చురగొన్నారన్నారు. సమర్థత, సహకారం స్నేహశీలతకు, అంకిత భావానికి ఆదర్శనీయమని, నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతూ వందలాదిమంది న్యాయవాదులకు ఆదర్శంగా నిలిచారని బొమ్మగాని ప్రభాకర్ కొనియాడారు. పద్మనాభరెడ్డి భారత రాజ్యాంగం పొందుపరిచిన ప్రజాస్వామ్యం సెక్యులరిజం సామాజిక న్యాయం కోసం పరితపించారన్నారు. ఫీజుల కోసం కాకుండా పేద ప్రజలకు న్యాయం జరిగేందుకు ఆయన చేసినటువంటి కృషి మరువరానిది అన్నారు. ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిఎల్ మాట్లాడుతూ పద్మనాభ రెడ్డి జీవితకాలంలో ఎంతోమందిని ప్రోత్సహించి నిలదొక్కునేందుకు చేయూతనిచ్చారన్నారు. సంఘం విస్తరణ కోసం మరొక వైపు విలువల కొరకు తపించి జీవించిన వ్యక్తిగా ఆయనకు పేరు ఉన్నదని కెవిఎల్ గుర్తు చేశారు.హైదరాబాద్ మహానగర ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మనాభ రెడ్డి ఎంతో మంది బాధితుల పక్షాన నిలిచి వారికి న్యాయం జరిగేలా చూశారన్నారు.

ఈ కార్యక్రమంలో ఐఎఎల్ నాయకులు కాసాని వీర బాబు, ఆర్‌బి రామారావు, భగత్సేన్, ఎం.ప్రసాద్, వై.కిషన్. కె.హరిప్రసాద్ పాల్గొన్నారు.

## గంటకో బిడ్డ మృత్యువాత

(మొదటి పేజీ తరువాయి)

తథ్యమని ఇప్పటికే ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఇజ్రాయెల్ కాల్పులు, బాంబుదాడుల్లో గంటకో బిడ్డ మృత్యువాత పడుతోందని యూనిసెఫ్ ప్రకటించింది. 2023 అక్టోబరు 7వ తేదీన యుద్ధం మొదలైన తర్వాత నుండి ఇప్పటివరకూ 60,933 మంది పాలస్తినా ప్రజలు ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారని తెలిపింది. మరో 1.50 లక్షల మంది దాడుల్లో గాయపడ్డారు. గడచిన 24 గంటల్లో జరిగిన దాడుల్లో ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒక బిడ్డ ఆకలితో మరణించింది. 94 మంది పిల్లలు సహా మొత్తం 188 మంది పస్తులతో మరణించారు. ఆహార కేంద్రాలవద్ద సైనికులు జరిపిన కాల్పుల్లో 1200 మందికిపైగా ప్రజలు మరణించారు. ఉత్తరగాజా, గాజా సిటీ, డైర్ అల్ బలాహ్, ఖాన్ యూనిస్, రఫాలలో ఏ ప్రాంతాన్నీ వదలిపెట్టకుండా ఇజ్రాయెల్ సైనికులు బాంబు దాడులు చేస్తున్నారు.

## ఒప్పందం నుండి వైదొలగిన రష్యా

(మొదటి పేజీ తరువాయి)

స్వల్పశ్రేణి క్షిపణుల ప్రయోగాలపై ఈ ఒప్పందం కింద రష్యా తనకు తానుగా ఇప్పటివరకూ పాటిస్తున్న నియంత్రణ నుండి వైదొలగుతున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవన కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ టాస్ వార్తాసంస్థకు చెప్పారు. ఇకమీదట రష్యా ఈ క్షిపణుల ప్రయోగాలకు సంబంధించిన ఎలాంటి స్వీయ పరిమితులను, ఏకపక్ష నిషేధాన్ని పాటించబోదని స్పష్టం చేశారు. 1987 డిసెంబరు ఏడో తేదీన నాటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్, సోవియట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మిహాయిల్ గోర్బచేవ్ మధ్య ఈ ప్రమాదకర క్షిపణుల నియంత్రణ ఒప్పందం జరిగింది. 1988 మే 27న ఈ ఒప్పందాన్ని అమెరికా సెనేట్ ఆమోదించగా దానికి నాలుగు రోజుల తర్వాత గోర్బచేవ్ ఈ ఒప్పందాన్ని అమలులోకి తెచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం 1000 కి.మీ నుండి 5,500 కి.మీ దూరం ప్రయాణం చేయగల మధ్యంతర శ్రేణి క్రూయిజ్ అణు క్షిపణులు, 500 నుండి 1000 కి.మీ దూరం వరకూ ప్రయాణం చేయగల స్వల్పశ్రేణి క్షిపణి ప్రయోగాలను నిలిపివేసేందుకు ఆనాడు నాయకులిద్దరూ ఐఎన్‌ఎఫ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐతే జల–వాయు మార్గాలలో ఈ క్షిపణి ప్రయోగాలకు ఈ ఒప్పందాన్ని ఆనాడు వర్తింపజేయలేదు. ఈ ఒప్పందం ప్రకారం 1991 నాటికి అమెరికా,రష్యా రెండు దేశాలూ దాదాపు 2,682 క్షిపణులను ధ్వంసం చేశాయి. ఆ తర్వాత పది సంవత్సరాలపాటు వీటి ధ్వంసంపై పరస్పర తనిఖీ కార్యక్రమాలు కూడా జరిగాయి. ఐతే డోనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాన్ని అమలు చేయడంలో రష్యా విఫలమైందని ఆరోపిస్తూ ఐ ఎన్ ఎఫ్ నుండి 2019లో వైదొలగారు. ఈ చర్యను రష్యా ఖండించినప్పటికీ ఇప్పటివరకూ ఈ ఒప్పందానికి అనుగుణంగా స్వీయ నియంత్రణలు పాటిస్తూ వచ్చింది. ఈ ఒప్పందంవల్ల రష్యాకు సమీపంలో ఉన్న యూరప్ దేశాలకే ఎక్కువ ప్రమాదం కలుగుతుంది. నాటో కూటమికి, రష్యాకు మధ్య పరోక్ష యుద్ధానికి ఉక్రేన్ ఇప్పటికే పెద్ద వేదికగా మారింది.

## వ్యవస్థ పునరుజ్జీవం?

(మొదటి పేజీ తరువాయి)

(ఎస్ఎఆర్‌పి) కానిస్టేబుల్ మురళీనాథ్ గౌడ్‌ను జూన్ 2009లో పంపించారు. నెల రోజుల తరువాత కానిస్టేబుల్ మురళీనాథ్ గౌడ్ నోయిడాలో తీవ్ర గాయలతో రక్తం మడుగులో అనుమానస్పద స్థితిలో చనిపోయాడు.'' ఈ సంఘటన అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆర్డర్లీ వ్యవస్థపై తీవ్రమైన చర్చ కుడా జరిగింది. ఈ సంఘటనతో పోలీస్ శాఖలో ఆర్డర్లీ వ్యవస్థ కనుమరుగైంది. ప్రస్తుతం తెలంగాణ పోలీసు శాఖలో ఆర్డర్లీ వ్యవస్థ పునర్జీవనమైంది. సర్వీస్‌లో ఉన్న ఐపిఎస్ అధికారుల మాట పక్కనపెడితే, పదవీ విరమణ పొందిన ఐపిఎస్ అధికారుల ఇళ్లలో నేటికీ ఆర్డర్లీ వ్యవస్థ కొనసాగుతున్నది. హైదరాబాద్‌లో ఉన్న సుమారు 30 మందికి పైగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారుల ఇళ్లలో సుమారు 200 మందికి పైగా కానిస్టేబుల్స్, హోంగార్డులు ఆర్డర్లీ వ్యవస్థలో పనిచేస్తున్నారని, ఇది కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. పదవీ విరమణ చేసిన ఐపిఎస్ అధికారుల ఇళ్లలో ఇప్పటికీ ఆర్డర్లీలు పనిచేయడం సాధారణంగా మారింది. ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి అదనపు డిజిపిగా పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ తర్వాత ఆయన తన ప్రైవేట్ ఇంటికి మారారు. రెండు నెలల తర్వాత, ఒక కానిస్టేబుల్ రాష్ట్ర హోం కార్యదర్శికి ఒక లేఖ రాసి, తనతో పాటు మరికొంత మంది కానిస్టేబుల్‌లను పదవీ విరమణ చేసిన అధికారి ఇంట్లో బలవంతంగా అన్ని రకాల ఇంటి పనులు చేయించారని ఫిర్యాదు చేశాడు. హోం కార్యదర్శి దర్యాప్తు చేయమని డిప్యూటీ సెక్రటరీని ఆదేశించారు. డిప్యూటీ సెక్రటరీ ఇద్దరు సిబ్బందితో కలిసి ఆ రిటైర్డ్ అధికారి ఇంటికి వెళ్లగా, ఆశ్చర్యకరంగా ఆ ఇంట్లో తొమ్మిది మంది కానిస్టేబుల్స్ పనిచేస్తున్నారని గుర్తించారు. వారందరూ వెంటనే పోలీసు లైన్లకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత హోం శాఖ సమగ్ర విచారణకు ఆదేశించింది. అలాగే రిటైర్డ్ ఐపిఎస్ అధికారులకు అనధికారికంగా ఇంటి సహాయంగా కానిస్టేబుళ్ల సదుపాయాన్ని ఇచ్చినట్లు వెల్లడైంది. ఈ ఆర్ధర్లీ వ్యవస్థ ఏర్పాటు చేయడంలో సర్వీస్‌లో ఉన్న ఐపిఎస్ అధికారులు కూడా భాగస్వాములైనట్లు విచారణలో తేలింది. హోంశాఖ కార్యదర్శి వెంటనే ఒక ఉత్తర్వు జారీ చేసి, ఈ చట్టవిరుద్ధమైన ఆర్ధర్లీ వ్యవస్థను అరికట్టాలని, అలాంటి కానిస్టేబుళ్లందరినీ పోలీస్ లైన్లకు, తరువాత వివిధ పోలీస్ స్టేషన్లకు పంపాలని డిజిపిని ఆదేశించారు. ఏ హోదాలోనైనా పనిచేస్తున్న ఏ ఉద్యోగుల సేవను పొందే హక్కు ఏ పదవీ విరమణ చేసిన అధికారికి లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నోయిడాలో మరణించిన హైద్రాబాద్ కానిస్టేబుల్ మురళీనాథ్ గౌడ్ లాంటి ఉదంతాలు పునరావృతం కాకుండా ఉండేందుకు సర్వీస్‌లో ఉన్న ఈ ఐపిఎస్ అధికారులు తగిన జాగ్రత్తలు, చర్యలు తీసుకోక తప్పదని కానిస్టేబుల్స్, వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సత్యపాల్ మాలిక్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభ గవర్నర్‌గా పనిచేయడంతో పాటు గోవా, బిహార్, మేఘాలయ, ఒడిశా రాష్ట్రాల గవర్నర్‌గా బాధ్యతలను కూడా నిర్వర్తించారు. సత్యపాల్ మాలిక్ మంగళవారం మధ్యాహ్నం 112గంటలకు మరణించారని రామ్‌మనోహర్ లోహియా హాస్పిటల్ వైద్యులు ప్రకటించారు. పలురకాల జబ్బుల బారినపడ్డ సత్యపాల్ మాలిక్ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు)లో చాలా కాలంగా చికిత్స పొందుతున్నారు అని హాస్పిటల్ స్టాఫ్ తెలియజేసింది. 'హాస్పిటల్‌లోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో మేం కల్పించిన సదుపాయంతో చికిత్స పొందుతున్న సత్యపాల్ మాలిక్ గతించారని తెలియజేసేందుకు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం' అని ఆర్ఎంఎల్ అధికారవర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. మాలిక్ దీర్ఘకాలికంగా 'డయాబెటిక్ కిడ్నీ వ్యాధి, హైపర్‌టెన్షన్, అనారోగ్య ఊబకాయం సహా నిద్రలేమి, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న రోగిగా ఆయనకు ఆసుపత్రిలో చికిత్సను అందజేస్తున్నాం' అని ఆర్ఎంఎల్ అధికారవర్గాలు వెల్లడించాయి. జమ్ముకశ్మీర్‌లో గవర్నర్‌గా ఉన్న సమయంలో సత్యపాల్ మాలిక్ ఆర్టికల్ 370 రద్దు, 2019 ఆగష్టు 5న రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజన చేశారు. యాధృచ్ఛికంగా అతను కేంద్రం తీసుకున్న చర్యకు ఆరవ వార్షికోత్సవం జరుపుకున్నారు.జమ్ములోని రెండు ప్రధాన ప్రాజెక్టుల ఫైళ్లను క్లియర్ చేసేందుకు లంచం ఇచ్చారని ఆరోపించబడిన తర్వాత సత్యపాల్ మాలిక్ చాలా వివాదానికి దారితీశాడు. రైతులు మరియు పుల్వామా ఉగ్రదాడికి సంబంధించిన అంశాలపై బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రూ.2,200 కోట్ల విలువైన కిరు జలవిద్యుత్ ప్రాజెక్ట్ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన సిబిఐ ఈ ఏడాది మేలో సత్యపాల్ మాలిక్‌పై చార్జిషీట్ దాఖలు చేసింది. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి ప్రకటన ప్రకారం సత్యపాల్ మాలిక్ మే 11న మధ్యాహ్నం 1204గంటలకు సంక్లిష్టమైన మూత్రమార్గ వ్యాధి బారినపడి హాస్పిటల్‌లో చేరారు. తర్వాత అతనికి రిఫ్రాక్టరీ సెప్టిక్ షాక్ సెకండరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, హాస్పిటల్‌అక్వైర్డ్ న్యుమోనియా, మల్టీ ఆర్గాన్ పెరిగిపోయాయి. వేగంగా మెరుగైన వైద్య చికిత్స కల్పించినప్పటికీ అతని ఆరోగ్యం క్షీణిస్తూనే ఉందని ఆర్ఎంఎల్ హాస్పిటల్ అధికారవర్గాలు వెల్లడించాయి.మంగళవారం (ఆగష్టు 5) మధ్యాహ్నం 112 గంటలకు తుదిశ్వాస విడిచారని వైద్యులు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com